సంపుటి : 78 సంచిక : 47 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ శ్రావణ బహుళ ఏకాదశి
07-13 సెప్టెంబర్ 2026
వెల : ₹20/-




# హిందూ.. విశ్వబంధు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

@Jagriti Tv 78 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక www.jagritiweekly.com




# లోక్‌భవన్‌లో 'నమస్తే సదా వత్సలే'

**హైదరాబాద్,** ఆగస్టు 31: నగరంలోని లోక్‌భవన్ ప్రాంగణంలోని సంస్కృతి ఆడిటోరియంలో సంస్కారభారతి, ప్రజ్ఞా భారతి సంయుక్త ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ (సంఘ) ప్రార్థన 'నమస్తే సదా వత్సలే' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సాంస్కృతిక, కళారంగాలకు చెందిన ప్రముఖులతో పాటు ప్రజా జీవితంలోని పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

త్రిపుర గవర్నర్ శ్రీ ఇంద్రసేనారెడ్డి, మాజీ గవర్నర్లు శ్రీ సీహెచ్ విద్యాసాగర్ రావు, శ్రీ బండారు దత్తాత్రేయ, సంస్కార భారతి అఖిల భారత సంఘటనా కార్యదర్శి అభిజిత్ గోఖలే, అఖిల భారత ప్రార్థనా ప్రకల్ప ప్రముఖ్ రాహుల్ రానడే, ప్రముఖ సినీ నటుడు సాయికుమార్, ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్యక్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘ ప్రార్థన 'నమస్తే సదా వత్సలే' ఆడియో–విజువల్ (AV) రూపాన్ని ప్రదర్శించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా రూపొందిస్తున్న 'శతగానం భవతి' పేరుతో వందకు పైగా దేశభక్తి గీతాల ప్రాజెక్టు టీజర్‌ను కూడా ఈ సందర్భంగా విడుదల చేశారు.

పుణెకు చెందిన రాహుల్ రానడే 'నమస్తే సదా వత్సలే' ప్రార్థనకు సంగీతాన్ని సమకూర్చగా, లండన్‌కు చెందిన రాయల్ ఫిల్హార్మోనిక్ ఆర్కెస్ట్రాతో సంగీతాన్ని రికార్డు చేశారు. ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ ప్రార్థనను ఆలపించగా, ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ ప్రార్థనలోని భావం, అర్థాన్ని ప్రేక్షకులకు వివరించారు.

సంఘ ప్రార్థన సందేశాన్ని మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేసే ఉద్దేశంతో దీనిని ఎనిమిది భాషల్లోకి అనువదించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రార్థనతో పాటు దాని తెలుగు వెర్షన్ కూడా ప్రేక్షకులకు ప్రదర్శించారు.

ఈ ఆడియో–విజువల్‌ను హైదరాబాద్‌కు చెందిన సినీ నిర్మాణ సంస్థ రోవస్కైర్ ఎంటర్‌టైన్‌మెంట్ రూపొందించింది.

అదేవిధంగా, రాబోయే రోజుల్లో 100 దేశభక్తి గీతాలను రూపొందించి ప్రజలకు అందించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ప్రముఖ సంగీత దర్శకులు ఎం.ఎం. కీరవాణి, వందేమాతరం శ్రీనివాస్, ఆర్పీ పట్నాయక్, కేఎం రాధాకృష్ణన్ తదితరులు ఈ గీతాలకు సంగీతాన్ని సమకూర్చనున్నారు.

దేశభక్తి, సాంస్కృతిక వ్యక్తీకరణ, సంఘ ప్రార్థనలోని విలువలను ప్రతిబింబించడంతో పాటు, ఈ భావాలను ఆధునిక ఆడియో–విజువల్ మాధ్యమం ద్వారా నేటితరానికి చేరువ చేసే ప్రయత్నాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

కార్యక్రమం అనంతరం ఆంధ్రప్రదేశ్ సంస్కారభారతి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'సాహో ఛత్రపతి శివాజీ' చారిత్రక నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో సంస్కార భారతి కార్యాధ్యక్షులు డా. కేకేవీ శర్మ, సంస్కారభారతి తెలంగాణ ప్రాంత అధ్యక్షులు డా॥ కళాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ సంస్కారభారతి అధ్యక్షులు డాక్టర్ పివీఎన్ కృష్ణ, ప్రజ్ఞాభారతి అధ్యక్షులు వి. శ్రీనివాస్, కార్యదర్శి రఘు, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, బిహార్ రాష్ట్ర హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి, ఆర్ఎస్ఎస్ తెలంగాణ అధ్యక్షుడు సుందర్‌రెడ్డితో పాటు పలువురు కళా, సాంస్కృతిక రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.



కీర్తిశేషులు శ్రీ వడ్లమూడి రామమోహనరావు 1985 నుంచి 2007 వరకు 22 సంవత్సరాలు జాగృతి వారపత్రిక సంపాదకుడిగా విశిష్ట సేవలు అందించిన ధన్యజీవి.

జాగృతి ఆధ్వర్యంలో

# స్వర్గీయ వడ్లమూడి రామమోహనరావు స్మారక

# 'నవలల పోటీ- 2026'

## రచనలను ఆహ్వానిస్తున్నాం..



**ప్రథమ బహుమతి రూ. 25,000**

**ద్వితీయ బహుమతి రూ. 20,000**

### సూచనలు :

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి.
- నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
- తమ రచన డీటీపీ చేసిన పిదప అక్షర దోషాలు, వాక్య నిర్మాణం, ఫుల్‌స్టాప్, కామా గుర్తులు సరి చూచుకొనగలరు. అలాగే పదాలు, వాక్యాలు అల్లుకుపోకుండా చూసి పంపవలసిందిగా మనవి.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా, మొబైల్ నంబర్ సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

నవలలు **jagriticompetition@gmail.com** కు కూడా మెయిల్ చేయవచ్చు.

నవలలు పంపవలసిన చిరునామా : **3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.**

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 15 సెప్టెంబర్, 2026**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,**
**వ్యాపార ప్రకటనల వివరాల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** | **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

**ఈ** దేశంలో ధర్మానికి ఇచ్చిన ప్రాధాన్యత కారణంగానే హిందూ జీవన విధానం అనాదిగా కొనసాగుతూ వస్తోంది. మహాభారతంలోని శాంతి పర్వంలో యుధిష్ఠురుడికి ధర్మోపదేశం చేస్తూ, మహాధర్మానికి నమస్కారం, కృష్ణపరమాత్మకు నమస్కారం అనే వాక్యంతో భీష్ముడు చెప్పిన శ్లోకం ధర్మం గొప్పతనాన్ని వివరిస్తుంది. ఆ ధర్మంలో భాగంగానే కుటుంబంలో తల్లి జీవన విలువలు అనే ధర్మసూక్ష్మాలను అందించడం పరంపరగా వస్తోంది. ఈ పవిత్ర భారతదేశంలో సనాతన ధర్మాన్ని 55 సంవత్సరాల పాటు కాంగ్రెస్ నాశనం చేసింది. హిందూధర్మం పట్ల నిరంతరం భ్రమలు కలుగజేయడానికి కంకణం కట్టుకున్నది. వలసవాద దృక్పథం అనే శ్లేష్మం నుంచి కాంగ్రెస్ నేటికీ బయటపడలేకపోతున్నది.

అయితే, 2014నుంచి ప్రారంభమైన సాంస్కృతిక పునరుజ్జీవనం వేగంగా పురోగమిస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్‌ను ప్రజలు చీదరించి, అధికారానికి దూరం చేసినప్పటికీ తన పాతధోరణిని మానుకోలేకపోతున్నది. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష హోదాలో ఉంటూనే రాజ్యాంగ ప్రతిని చేతపట్టుకుని, రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. స్వార్థపూరిత రాజకీయ కుట్రలతో హిందుత్వం మీద పదేపదే బురద చల్లుతున్నారు రాహుల్‌గాంధీ. పాశ్చాత్య మూసదృష్టితో తప్ప స్వదేశ సంస్కృతిని ఆయన చూడలేకపోవడం అతిపెద్ద విషాదం.

గత నెల 22వ తేదీన పుణెలో జరిగిన **'ఛాత్రోంకి గూంజ్'** కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మనుస్మృతిని ఉల్లేఖిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. మహిళలు తండ్రి, భర్త, కుమారుడి రక్షణలోనే ఉండకూడదని, స్వేచ్ఛగా ఉండాలంటూ బాధ్యతారాహిత్య ప్రకటనలు చేశారు. మనుధర్మశాస్త్రం కారణంగా మన దేశంలో స్త్రీ అణచివేతకు గురవుతోందని, వారికి స్వేచ్ఛ లేదని చేసిన వ్యాఖ్యలపై పీఠాధిపతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పందిస్తూ, కాంగ్రెస్ నాయకులు తమ కుమార్తెలకు రక్షణ ఇవ్వడం మానివేయాలని జ్యోతిర్మఠాధిపతి అవిముక్తేశ్వరానంద సలహా ఇవ్వడం గమనార్హం.

స్త్రీకి స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం కావాలి. విద్య, ఉపాధి, ఆస్తి, ఆరోగ్యం ,

**శాలివాహన 1948 శ్రీ పరాభవ శ్రావణ బహుళ ఏకాదశి**

## లోపలి పేజీలలో...




6లో

ముఖపత్ర కథనం
**హిందూ.. విశ్వబంధు**

ధారావాహిక నవల
5
**ఏ వెలుగులకీ ప్రస్థానం ?**
– గన్నవరపు నరసింహామూర్తి
20లో



ప్రత్యేక వ్యాసం
**పర్యావరణ హితైషి గజాననుడు**
42లో



# జాగృతి

## సంపాదకీయం

## ఎప్పుడూ వక్ర వ్యాఖ్యలేనా?

భద్రత, నిర్ణయాధికారం ప్రతి రంగంలో పురుషులతో సమానమైన అవకాశాలు కావాలి. ఈ విషయంలో రెండో అభిప్రాయానికి తావు లేదు. మహిళలపై వివక్షను, హింసను, అణచివేతను ఏ రూపంలో ఉన్నా ప్రశ్నించాల్సిందే. కానీ స్త్రీ సాధికారత పేరుతో చరిత్రను, మతాన్ని, సంప్రదాయాలను, రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎంపిక చేసుకొని విమర్శించడం మాత్రం సమాజ సంస్కరణకు మార్గం కాదు.

స్త్రీల పట్ల గౌరవం అనేది మన సంస్కృతిలో అత్యంత ప్రాముఖ్యత గల విషయం. ఇంటింటా వెలసి ఉన్న లక్ష్మీ స్వరూపిణులుగా స్త్రీలను పరిగణిస్తుంటాం. ప్రతి వ్యక్తి తన తల్లిని దైవసమానురాలుగా (మాతృదేవోభవ) భావించాలని మన సంస్కృతి చెప్తుంది. జీవితమంతా తోడుండే స్నేహితురాలు (సఖీ) భార్య అన్న భావన మనకు కొత్త కాదు. స్త్రీత్వానికి ఇచ్చిన పవిత్ర హోదా ఇది. ప్రతి బాలిక, ప్రతి స్త్రీని కూడా మాతృత్వపు అవతారంగా పరిగణిస్తారు. అందుకే చిన్న వయసు బాలికలను కూడా "అమ్మా" అని సంబోధించే అలవాటు మనలో ఉంది. స్త్రీపై లైంగిక అత్యాచారం జరిపే నీచ ప్రవృత్తిని అదుపుచేసే ఉన్నత భావన ఇది. ఈ భావన నేటికీ స్త్రీలపై జరిగే నేరాలకు అడ్డుకట్టగా చాలావరకు నిలిచి ఉంది. కానీ, పాశ్చాత్య సంస్కృతి స్త్రీని ఒక భోగ వస్తువుగా మాత్రమే పరిగణిస్తుంది. మనం అటువంటి జంతు ప్రవృత్తిని తిరస్కరించి మానుషం, దివ్యం, శాశ్వతం అయిన మన సంస్కృతీ విలువలను కాపాడుకోవాలి.

స్త్రీకి జీవితంలో అన్ని దశలలోను రక్షణ అవసరమని చెప్పే శ్లోకం ఒకటి మనుస్మృతిలో ఉంది. అది స్త్రీల స్వాతంత్ర్యాన్ని హరించేందుకు ఉద్దేశించినదని కొందరు విమర్శిస్తుంటారు. ఈ విమర్శను తిప్పికొడుతూ కెర్రీబ్రౌన్ అనే బ్రిటీష్ రచయిత్రి తన '**హిందూత్వం చిరంతన బోధనలు**' అనే గ్రంథంలో (186వ పేజీ) 'హిందూ సంస్కృతిలో స్త్రీకి సంరక్షణ ఉంది. ఇందుకు కారణం ఆమె హీనమని కాదు. ఆమె ఎంతో విలువైనదని భావించడమే. ఆమె సమాజానికి గర్వకారణం, శక్తిస్వరూపిణి, కిరీటంపై పొదిగిన రత్నాలను ఎలా రక్షణ లేకుండా వదిలివేయకూడదో, అదేవిధంగా స్త్రీని కూడా రక్షణ లేకుండా వదిలివేయకూడదు. శిశుజననం, గృహకృత్యాలు, ఆధ్యాత్మిక ఉన్నతి అనే పెనుభారాలను మోస్తున్న స్త్రీపై వాటికి అదనంగా జీవనభృతిని ఆర్జించే భారాన్ని మోపకూడదు. ఆమె తన సంతానానికి సంస్కృతిని అందించే మూలస్రోతస్సు," అని రాశారు.

పురుషుల నుంచి, దుష్టస్వభావంగలవారి నుంచి జరిగే దాడులకు లోను అయ్యేది స్త్రీలేనన్నది సర్వవిదితం. అందువల్లనే బాలికలనే కాక పెద్ద వయసులోని స్త్రీలను కూడా కాపాడే బాధ్యతను మనుస్మృతి తండ్రిమీద, భర్తమీద, కుమారుని మీద వరుసగా ఉంచింది. ఇది పాశ్చాత్యతను వంటబట్టించుకున్న రాహుల్‌కు నచ్చడం లేదు.

మహిళా సాధికారతను రాజకీయ ఆయుధంగా మార్చడం మహిళలకు మేలు చేయదు. ఒకవైపు మహిళల పక్షాన ఉన్నట్టు మాట్లాడుతూనే, మరోపక్క మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కాకుండా చూస్తున్న ప్రతిపక్ష పార్టీ నాయకుడి కపటత్వాన్ని ప్రజలు గమనించరనుకోవడం పొరపాటు. భారతదేశంలో మహిళ ఎప్పుడూ సాధికారతతోనే ఉన్నదనడానికి సాక్షాత్తు ఆయన నాయనమ్మ ఇందిరాగాంధీయే ఉదాహరణ కాదా? ★





40లో

కథ

**అమ్మ మనసు**

– సింహ ప్రసాద్





| | | |
|---|---|---|
| లవ్ జీహాద్‌తో మతమార్పిడికి కుట్ర (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| ఆందోళనకరంగా నేరాల రేటు... (తెలంగాణ) | - | 18 |
| విద్యార్థుల నెత్తిన ట్రంప్ వీసా 'బాంబు'!! (అంతర్జాతీయం) | - | 24 |
| అరాచకవాద ప్రత్యామ్నాయం (చర్చ) | - | 26 |
| మన(ను) స్మృతిలో మహిళ (మహిళ) | - | 29 |
| శివాలయమే విద్య, వైద్యాలయాలు (గళమెత్తిన గతం) | - | 30 |
| జ్ఞాన భాండాగారం సంస్కృతం (ప్రత్యేక వ్యాసం) | - | 34 |
| గురూజీ రచనల వక్రీకరణ (ఆర్ఎస్ఎస్-100) | - | 37 |
| 94 సంవత్సరాలు... 600 టెస్టులు.. (క్రీడ) | - | 43 |
| మార్పిజం-శ్రీరామరాజ్యం-52 (సమాప్తం) | - | 45 |
| బాలజాగృతి | - | 46 |
| 'ఇరుముడి'కి ఊహకందని విజయం! (సినిమా) | - | 50 |

# పాశ్చాత్యులకు హిం

**1893లో చికాగో ప్రపంచ మతాల సభలో స్వామి వివేకానంద పాశ్చాత్య దేశాలకు భారత ఆధ్యాత్మిక ప్రపంచ దృక్పథాన్ని పరిచయం చేసిన ఒక శతాబ్దానికి పైగా గడిచిన తరువాత, ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ ఇటీవల పాశ్చాత్య ప్రపంచానికి ఇచ్చిన సందేశం ఒక సారూప్య నాగరిక వాదనను పునరుజ్జీవింపజేసింది. హిందుత్వాన్ని రాజకీయ ద్వంద్వాలకు కుదించే ముద్రల ద్వారా కాకుండా బహుళత్వం, సార్వత్రిక ఆమోదం, వసుధైవ కుటుంబకం అనే సూత్రాల ద్వారా అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చింది. డాక్టర్ మోహన్ భాగవత్ పాశ్చాత్య ప్రపంచానికి అందించిన సందేశం అనేక కారణాల రీత్యా అత్యంత ప్రాధాన్యత కలిగినది. ఇది ప్రధానంగా హిందుత్వంలోని 'అందరినీ కలుపుకుపోయే' (సమ్మిళిత) స్వభావాన్ని ప్రపంచానికి గుర్తుచేస్తుంది. అలాగే దీనికి ఉద్దేశపూర్వకంగా లేదా అనాలోచితంగా అంటగట్టిన అనేక అపోహలను సవాలు చేస్తుంది.**

హిందుత్వ ఉగ్రవాదం వంటి పదబంధాల చుట్టూ ఒక కథనాన్ని సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో, హిందుత్వం వాస్తవానికి దేనిని సూచిస్తుందో, అంతకంటే ముఖ్యంగా దాని నాగరికతా తత్వం ఆచరణలో ఎలా వ్యక్తమైందో అర్థం చేసుకోవడం చాలా అవసరం.

ఈ సందేశం సారాంశం కొత్తదేమీ కాదు. 130 ఏళ్లకు పైగా క్రితమే, స్వామి వివేకానంద పాశ్చాత్య ప్రపంచం ముందు ఇటువంటి భావననే వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 11, 1893న చికాగోలో జరిగిన 'ప్రపంచ మతాల సభ' (World's Parliament of Religions)లో స్వామి వివేకానంద భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని అంతర్జాతీయ వేదికపై పరిచయం చేశారు. ఆయన ప్రసంగం భారతదేశం, దాని తాత్విక సంప్రదాయాల పట్ల ప్రపంచ దృక్పథంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. హిందూ ధర్మం ఇతరులను తిరస్కరించడం ద్వారా తన ఆధిపత్యాన్ని చాటుకునే ధర్మంగా కాకుండా, తన సొంత అస్తిత్వాన్ని కోల్పోకుండానే వైవిధ్యాన్ని స్వీకరించగల ఒక నాగరికతగా వివేకానంద దానిని ఆవిష్కరించారు.

"ప్రపంచానికి సహనాన్ని, విశ్వ ఆమోదాన్ని బోధించిన ధర్మానికి చెందినందుకు నేను గర్వపడుతున్నాను. మేము విశ్వ సహనాన్ని విశ్వసించడమే కాకుండా, అన్ని మతాలను సత్యంగా అంగీకరిస్తాము" అని ఆయన ప్రకటించారు. ఇవి కేవలం విదేశీ ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి చెప్పిన దౌత్యపరమైన మాటలు కావు. అవి వేళ్లూనుకున్న నాగరిక ప్రపంచ దృక్పథాన్ని ప్రతిబింబించాయి. హింసను ఎదుర్కొంటున్న వర్గాలకు ఆశ్రయం కల్పించడంలో భారతదేశం పోషించిన చారిత్రక పాత్ర గురించి ప్రస్తావిస్తూ "భూమిపై ఉన్న అన్ని మతాలు, అన్ని దేశాలకు చెందిన పీడితులకూ, శరణార్థులకూ ఆశ్రయం కల్పించిన జాతికి చెందినందుకు నేను గర్విస్తున్నాను" అని అన్నారు. హిందుత్వాన్ని అర్థం చేసుకోవడంలో ఇది ఒక ముఖ్యమైన కోణంగా ఉంటుంది. దీనిని తరచుగా సంకుచిత రాజకీయ దృక్కోణంతోనే వ్యాఖ్యానిస్తారు. కానీ దాని నాగరిక, తాత్విక పునాదులను విస్మరిస్తారు. హిందూ సంప్రదాయం చారిత్రాత్మకంగా



# దుత్వం, సమ్మిళితత్వం




బహుళ ఆలోచనా విధానాలను, ఆరాధనా రూపాలను, తాత్విక వ్యాఖ్యానాలను స్వీకరించింది. హిందూ సమాజంలోనే వైవిధ్యం ఉండటమే, భారతీయ నాగరికతలో సామాజిక సమైక్యతకు ఏకరూపత ఎన్నడూ ఏకైక ఆధారం కాదని నిరూపిస్తుంది. ఈ సూత్రం 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమే ఒక కుటుంబం) అనే ప్రాచీన భారతీయ భావనలో ప్రతిబింబిస్తుంది. ఇది కేవలం ఆధునిక దౌత్యం కోసం సృష్టించిన నినాదం మాత్రమే కాదు. ఇది మానవాళిని వర్గాలు ,నాగరికతల మధ్య ఉండే శాశ్వత సంఘర్షణల కోణంలో కాకుండా, పరస్పర అనుసంధానత ద్వారా అర్థం చేసుకునే ఒక ప్రపంచ దృక్పథాన్ని సూచిస్తుంది. భారత్ తన G20 అధ్యక్షత కాలంలో ఈ నాగరికతా దృక్పథాన్ని ప్రముఖంగా చాటిచెప్పింది. "వసుధైవ కుటుంబకం – ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు" అనే ఇతివృత్తం, ఒక ప్రాచీన భారతీయ తాత్విక భావనను సమకాలీన ప్రపంచ వేదికపై కేంద్ర బిందువుగా నిలిపింది. అందుకే హిందుత్వ భావనను సరళమైన రాజకీయ ముద్రలకు అతీతంగా అర్థం చేసుకోవాలి. హిందుత్వాన్ని కేవలం ఒక ఎన్నికల నినాదంగా పరిగణిస్తే, దాని నాగరికతా కోణాలు చర్చ నుండి కనుమరుగవుతాయి. హిందుత్వంతో ముడిపడి ఉన్న విస్తృత భారతీయ భావన భారతదేశం గురించిన సాంస్కృతిక, నాగరికతా అవగాహనలో వేళ్లూనుకుంది. అది భూమిని ఒక ఉమ్మడి నివాసంగా గుర్తించి, విభిన్న నాగరికతా గుర్తింపును నిలుపుకుంటూనే బహుళత్వాన్ని గౌరవిస్తుంది. చికాగోలో స్వామి వివేకానంద చెప్పిన మాటలు నేటికీ సందర్భోచితంగా ఉన్నాయి. ఎందుకంటే అవి ఈ దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి ఒక మేధోపరమైన చట్రాన్ని అందిస్తాయి. ఆయన ఆత్మవిశ్వాసం న్యూనతా భావం నుండి పుట్టలేదు. భారతదేశం తన నాగరికతా మూలాలను విడిచిపెట్టడం ద్వారా ఆధునికమవుతుందని ఆయన పాశ్చాత్య దేశాలకు చెప్పలేదు. దానికి బదులుగా, ఆయన భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఆత్మవిశ్వాసంతో ప్రదర్శిస్తూనే, ఇతర సంప్రదాయాల పట్ల గౌరవాన్ని ఏకకాలంలో నొక్కిచెప్పారు. నాగరికతా ఆత్మవిశ్వాసం, సార్వత్రిక ఆమోదం అనే ఆ కలయిక, బహుశా సమకాలీన ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత ముఖ్యమైన కానుకలలో ఒకటిగా నిలిచిపోతుంది. నేడు, ప్రపంచ రాజకీయాలు ధ్రువీకరణ, గుర్తింపు సంఘర్షణలు, పోటీ నాగరికతా కథనాలతో అంతకంతకూ నిండిపోతున్న తరుణంలో, భారతీయ విధానం మరో అవకాశాన్ని అందిస్తోంది. వైవిధ్యం అనేది శాశ్వత సంఘర్షణకు మూలం కానవసరం లేదని ఇది సూచిస్తుంది. ఒక సమాజం ఇతరుల గుర్తింపులను, నమ్మకాలను గౌరవిస్తూనే తన సాంస్కృతిక గుర్తింపును కాపాడుకోగలదు. అందువల్ల, ఆర్ఎస్ఎస్ నాయకత్వం నుండి వెలువడుతున్న సందేశాన్ని ఈ విస్తృత చారిత్రక, నాగరికతా సందర్భంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. హిందుత్వం అంటే ఏమిటి? భారత్ అనే భావన సమాజాన్ని, వైవిధ్యాన్ని, మానవత్వాన్ని ఎలా అర్థం చేసుకుంటుంది? అనే దానిపై కొనసాగుతున్న సంభాషణలో ఇది ఒక భాగమవుతుంది. హిందుత్వంను కేవలం హింస లేదా "ఉగ్రవాదం" అనే కోణం నుండే చిత్రీకరించడానికి ప్రయత్నించేవారు, ఈ మేధోపరమైన, చారిత్రక సంప్రదాయంతో కూడా గంభీరంగా మమేకం కావాలి. ప్రజాస్వామ్యంలో విమర్శ సమంజసమే. కానీ విమర్శతో పాటు, విమర్శకు గురవుతున్న తత్వం గురించిన నిజాయతీతో కూడిన చర్చ కూడా ఉండాలి.

# భారతీయ అమెరికన్లు




కొన్ని సందర్భాల్లో భౌగోళిక అంశాలు వాదనకు దారితీస్తాయి. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ ఆధునిక అమెరికా గాథలో అంతర్భాగంగా ఉంది. బహుమతి పోరాటాలు, ఛాంపియన్‌షిప్‌లు, రాక్ సంగీత కచేరీలు, రాజకీయ ప్రదర్శనలు, ప్రముఖులు, వాణిజ్యం, విజయం, నాటకరంగం ఇలా రకరకాల కార్యక్రమాలతో అది శబ్దానికి అలవాటుపడిన ప్రదేశంగా మారింది. కానీ ఆగస్టు 29న అమెరికాలో అంతర్భాగమైన ఆ ప్రదేశంలోకి వసుధైవ కుటుంబకం అనే అత్యంత పురాతనమైన ఒక సాంస్కృతిక ప్రతిపాదన రంగప్రవేశం చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ ప్రసంగించడానికి లేవడానికి చాలా ముందే, ఆ వేదిక ఆ ప్రతిపాదనను వివరించడం ప్రారంభించింది. ప్రదర్శకులు భారతదేశం, చైనా, ఆఫ్రికా, ఐరోపా, మధ్యప్రాచ్య దేశాల సంప్రదాయాలను కార్యక్రమంలోకి తీసుకువచ్చారు. వేషధారణలు మారాయి. లయలు మారాయి. కదలికలు మారాయి. కానీ ప్రేక్షకులు మాత్రం మారలేదు. వాతావరణం ఉత్సాహభరితంగా, కొన్ని క్షణాల్లో పారవశ్యంతో నిండిపోయింది. ఫోన్లు తలల పైకి లేచాయి. సముద్రాలు, చరిత్రలతో వేరు పడిన సంస్కృతులు, వాటిలో ఏ ఒక్కటీ మరొకదానిలో కలిసిపోవాల్సిన అవసరం లేకుండా ఒకే వేదికను ఆక్రమించడంతో, ఆడిటోరియం అంతటా చప్పట్లు మారుమోగాయి. ఆ ప్రదర్శన ఏడు రంగుల హరివిల్లును ఆవిష్కరించింది. డాక్టర్ భాగవత్ దానికి గొంతుకను అందించారు.

వైవిధ్యాన్ని వేడుకగా చేసుకోవడానికి, దాని కింద ఉన్నదాన్ని అర్థం చేసుకోవడానికి మధ్య ఒక సూక్ష్మమైన, ముఖ్యమైన వ్యత్యాసం ఉంది. వైవిధ్యానికి సంబంధించిన ఆధునిక పదజాలం సాధారణంగా జాతి, మతం, జాతి సమూహం, జాతీయత, భాష, గుర్తింపు వంటి భేదాలను ఏకరువు పెట్టడంతో మొదలవుతుంది. డాక్టర్ భాగవత్ న్యూయార్క్‌కు తీసుకువచ్చిన నాగరికతా పదజాలం దీనికి వ్యతిరేక దిశలో వైవిధ్యాలకు పుట్టుకనిచ్చిన ఒక అంతర్లీన ఐక్యతతో మొదలైంది. విభిన్నులైన ప్రజలు కలిసి జీవించగలరని బహుళత్వం మనకు చెబుతుంది. వసుధైవ కుటుంబకం దీనికి మించి వెళుతుంది. అది పరాయి వ్యక్తి అంటే కేవలం అతని భిన్నత్వాన్ని సహించడం మాత్రమే కాదు, అతడు కూడా మనతో పాటు ఒకే మానవ కుటుంబంలో సభ్యుడని సూచిస్తుంది. ఇలాంటి వాదనను వినిపించడానికి న్యూయార్క్ నగరం అసాధారణంగా అనువైనది. తమతో పాటు ఇతర ప్రాంతాల జ్ఞాపకాలను మోసుకొచ్చిన ప్రజల వల్ల నిరంతరం మార్పులకు గురయ్యే ప్రదేశాలు భూమిపై చాలా తక్కువ. న్యూయార్క్ పరిసరాలు జ్ఞాపకాలతో నిండిన మాతృభూములు. దాని వీధులు ప్రపంచపు యాసలలో మాట్లాడతాయి. అందువల్ల, అటువంటి నగరానికి భిన్నత్వం కనుమరుగు కావాల్సిన అవసరం లేదని, భిన్నత్వాన్ని విభజించాల్సిన అవసరం అంతకంటే లేదని డాక్టర్ భాగవత్ ప్రతిపాదించారు. "మనమంతా ఒక్కటే, మనలోని వైవిధ్యంవల్ల ఆ ఏకత్వం మరింత బలపడుతుంది," అని ఆయన అన్నారు. పదాల ఎంపిక చాలా ముఖ్యం, ఎందుకంటే భారతదేశం వెలుపల ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రధానంగా జాతీయవాదం, మెజారిటేరియనిజం, ఏకాకి అనే పదజాలంతోనే అన్వయిస్తారు. ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ తన అమెరికా పర్యటనలో అత్యంత ప్రముఖమైన వేదికలలో ఒకదానిని ఎంచుకుని, ఒకరి గుర్తింపుపై విశ్వాసానికి ఇతరుల గుర్తింపును తగ్గించుకోవాల్సిన అవసరం లేదు అనే భిన్నమైన దిశలో సాగే ఒక ప్రతిపాదనను స్పష్టం చేశారు. ఆ వాదన 'నా లాగా అయిపోండి' అని కాదు. అది మీరు మీలాగే ఉండండి, కానీ మనల్ని కలిపేది ఏమిటో గుర్తించండి అని చెబుతుంది.

**ధర్మానికి పెద్ద పీట**

ఆంగ్ల భాష తరతరాలుగా సరిగ్గా అనువదించ లేకపోయిన ధర్మం అనే పదం వైపు దృష్టిని డాక్టర్ భాగవత్ సారించారు. "ధర్మం అంటే మతం కాదు. అది ఒక పూజ కాదు. అది వీటన్నిటికీ అతీతమైనది" అని అన్నారు. అస్తిత్వంలోని పైకి పోటీ పడుతున్నట్లు కనిపించే అంశాలు ఒకదానిని మరొకటి నాశనం చేసుకోకుండా, సమతుల్యంగా ఉండేలా చేసే సూత్రం ధర్మం అని పేర్కొన్నారు. మతం, లౌకికవాదం, మెజారిటీ, మైనారిటీ, వామపక్షం, రైట్‌వింగ్, ఉదారవాదం, సంప్రదాయవాదం అంటూ వేరేచోట పుట్టుకొచ్చిన వర్గాలలో రెండు శతాబ్దాలకు పైగా భారతదేశం తరచుగా తనను తాను వివరించు

# మనోగతం

కోవలసి వచ్చింది. ఈ వర్గాలు నిరుపయోగమైనవి కావు. కానీ ధర్మం, అర్థం, కామం, మోక్షం, సేవ, సంవాదం, కుటుంబవంటి వాటిద్వారా మేధోపరమైన పదజాలం పరిణామం చెందిన ఒక నాగరికతను కొలవడానికి అవి అసంపూర్ణమైన సాధనాలు మాత్రమే. అనువాదం వెలుగునివ్వగలదు. అది వెలుగును తగ్గించగలదు కూడా. ధర్మాన్ని కేవలం "మతం" అని అనువదిస్తే, ఆ పదంలో ఇమిడి ఉన్న తాత్వికతలో కొంత భాగం కోల్పోతుంది. అలాగే, "దాతృత్వం" అనే పదంతో సేవ అర్థం ముగిసిపోదు. "వసుధైవ కుటుంబకం" కేవలం "ప్రపంచ సామరస్యం" కంటే ఎంతో ఎక్కువ అర్థాన్ని సూచిస్తుంది. భారతదేశం వంటి ప్రాచీన నాగరికత ఆధునిక ప్రపంచపు పదజాలాన్ని తిరస్కరించాల్సిన అవసరం లేదు. అలాగే, అది తన సొంత పదజాలాన్ని కూడా మరచిపోనవసరం లేదు.

**అద్భుతమైన ఘట్టాలకు వేదిక**

కార్యక్రమంలోని కొన్ని అత్యంత అద్భుతమైన ఘట్టాలకు అసలు ప్రసంగమే అవసరం కాలేదు. ధార్మిక పెద్దలు తమదైన ప్రత్యేక వస్త్రధారణలో, సంప్రదాయాలతో కలిసి వేదికపైకి వచ్చారు. తాము ఒకే ధార్మిక సిద్ధాంతాన్ని పంచుకుంటున్నట్లు వారు నటించలేదు. అలా నటించాలని ఎవరూ వారిని కోరలేదు. భేదాలను తుడిచివేయడం ద్వారా ఏకత్వాన్ని ప్రదర్శించలేదు. భేదాలను ఒకే చట్రంలో స్పష్టంగా కనిపించేలా చేయడం ద్వారా దానిని ప్రదర్శించారు.

మత సామరస్యం అంటే మత, సామాజిక నాయకులు కేవలం సంభాషణలకే పరిమితం కాకుండా సంబంధాలను పెంచుకోవడం, సమాజాలకు సేవ చేయడం, ఒకరికొకరు తోడుగా నిలబడటం వంటి పనులతో ఆచరణాత్మక బాధ్యతల వైపు పయనించాలన్న పిలుపుతో కార్యక్రమం ముగిసింది. ఆ తర్వాత అత్యంత సరళమైన ఒక చర్య జరిగింది. అదే రక్షాబంధన్.

**రాఖీ పండుగ**

కార్యక్రమంలో పాల్గొన్నవారి కోసం నిర్వాహకులు రాఖీలను సిద్ధంగా ఉంచారు. తమ చుట్టూ ఉన్నవారి వైపు తిరిగి, ఆ పవిత్రమైన రక్షణ దారాన్ని కట్టమని సభికులను ప్రోత్సహించారు. ఆ క్రమంలో కొన్నిసార్లు తమకు తెలిసిన వారి మణికట్టుకు, మరికొన్నిసార్లు అపరిచితుల మణికట్టుకు వారు రాఖీ కట్టారు. వేదికపై డాక్టర్ భాగవత్ మణికట్టుకు రాఖీ కట్టారు. హిందూ ఆచారం కుటుంబం, పరిచయం అనే పరిమితులను దాటి, మరో మనిషి పట్ల బాధ్యత అనే ఒక ఉన్నతమైన విషయానికి ప్రతీకగా ఆ సందర్భం నిలిచింది. "మీరు ఇతరుల బాధ్యత తీసుకున్నప్పుడు, అది మీకు స్వేచ్ఛను ఇస్తుంది" అని డాక్టర్ భాగవత్ అన్నారు. ఆ విధంగా ఒక ప్రాచీన ఆచారం పౌర ప్రతిపాదనగా మారింది.

**భారత్‌ను విశ్లేషిస్తున్న అమెరికన్ తరం**

సర్‌సంఘచాలక్ ప్రసంగం ప్రవాస భారతీయుల సందిగ్ధతలను ప్రస్తావించినప్పటికీ, అమెరికాను తమ దత్తత దేశంగా అస్సలు భావించని వారి నుండే కొన్ని అత్యంత కీలకమైన స్పందనలు వెలువడ్డాయి. కునాల్ అత్రేయ వయసు 31 సంవత్సరాలు. ఆయన నాలుగేళ్ల వయసులో న్యూజెర్సీకి వచ్చి, అక్కడే పెరిగారు. స్థానిక ఎన్నికలలో పోటీ చేయడం సహా, ఇప్పటికే అమెరికన్ పౌర జీవితంలో పాలుపంచుకున్నారు. వదిలిపెట్టిన మాతృభూమిని గుర్తుచేసుకునే వలసదారుడి వ్యామోహంతో ఆయన మాట్లాడలేదు. ఆయనది ఒక వారసత్వాన్ని విశ్లేషిస్తున్న అమెరికన్ స్వరం. "మన భేదాలన్నింటి వెనుక ఒకే మానవత్వం ఉంది. మనల్ని ఏకం చేసే బంధాలను మనం గుర్తించాలి" అని అత్రేయ అన్నారు. నేను నాలుగేళ్ల వయసులో న్యూజెర్సీకి వచ్చి ఇక్కడే పెరిగాను. నా తరం హిందూ అమెరికన్లకు వసుధైవ కుటుంబకం అనే సందేశానికి ఒక ప్రత్యేక అర్థం ఉంది. వసుధైవ కుటుంబకం(ప్రపంచం ఒకే కుటుంబం) అనేది కేవలం ఒక ప్రాచీన భారతీయ భావన మాత్రమే కాదు. మనం ఈనాడు జీవిస్తున్న ప్రపంచంలో మనమందరం అనుసరించాల్సిన విషయం అది అని తెలిపారు. అమెరికాకు వలస వచ్చిన తొలితరం భారతీయులు, ఇక్కడికి వచ్చిన తర్వాత చదువుకోవడం, పని చేయడం, స్థిరపడటం, జీవించడం విజయం సాధించడం వంటి వాటిని సాధించారు. ఆసుపత్రులలో, విశ్వవిద్యాలయాలలో, ప్రయోగశాలలలో, సమావేశ మందిరాలలోకి అడుగుపెట్టారు. వ్యాపారాలను, వృత్తులను, దేవాలయాలను, గృహాలను నిర్మించుకున్నారు. వారి విజయం ఇప్పుడు అమెరికన్ చరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నది.

**వసుధైవ కుటుంబానికి నిదర్శనం సంగీతం**

నాగరికతలు కేవలం సంస్థలు లేదా తత్వాల ద్వారా మాత్రమే ప్రయాణించవు. అవి రాగాలలో, వంటకాలలో, భాషలో, ఆచారాలలో, ఎటువంటి సూచన లేకుండా పునరావృతమయ్యే హావభావాలలో, వాటి మూలాలు మరచిపోయిన చాలా కాలం తర్వాత కూడా గుర్తుండిపోయే కథలలో ప్రయాణిస్తాయి. అందువల్ల ఏకత్వం అనే భావన ప్రఖ్యాత హిందుస్థానీ శాస్త్రీయ గాయకుడు మహేష్ కాలేకు రాజకీయాలకు అతీతంగా ప్రతిధ్వనిస్తుంది. "మనల్ని భాష, భౌగోళికం, నమ్మకాల సరిహద్దులకు ఆవలకి తీసుకువెళ్లి, మనం పంచుకునే లోతైన మానవ సంబంధాన్ని గుర్తుచేసే శక్తి సంగీతానికి ఉందని ఒక కళాకారుడిగా నేను నమ్ముతాను" అని కాలే అన్నారు. "అందుకే 'వసుధైవ కుటుంబకం' అనే భావన నాతో బలంగా ప్రతిధ్వనిస్తుంది. భారత దేశంలో నివసిస్తూ, భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంప్రదాయాలతో గాఢంగా అనుసంధానమై ఉన్న మనలాంటి వారికి, ఈ విశ్వ ఏకత్వ సందేశం ప్రత్యేకంగా అర్థవంతమైనది. మన వారసత్వం మనకు మూలాలను ఇస్తుంది. కానీ అది మన హృదయాలను ప్రపంచం ఎదుట ఆవిష్కరించడాన్ని కూడా నేర్పుతుంది'' అని తెలిపారు. ఒక సంగీతకారుడు ఇలాంటి వాదన చేయడంలో ఏదో ఒక ప్రత్యేకత వినిపించింది. రాగానికి పాస్‌పోర్ట్ అవసరం లేదు. ఒక రాగం ఇమ్మిగ్రేషన్ వద్ద దానంతట అదే ప్రత్యక్షం కాదు. ఎవరో ఒకరు దాన్ని గుర్తుంచుకోవడం వల్లే అది ప్రయాణిస్తుంది.

**అణువణువునా భారతీయత**

సంజనకు 21 ఏళ్లు. ఆమె అమెరికా తూర్పు తీరంలో పుట్టి పెరిగారు. భరతనాట్య నర్తకి. హిందీ అనర్గళంగా మాట్లాడగలరు. తమ కుటుంబ నాగరికత, కేవలం అప్పుడప్పుడు జరుపుకునే పండుగలగానో, లేదా అవగాహన లేకుండా చేసే ఆచారాలుగానో మిగిలిపోకుండా ఆమె తల్లిదండ్రులు చూసుకున్నారు. అది తెలుసుకోవలసిన విషయంగా మారింది. "నేను ఇక్కడే తూర్పు తీరంలో పుట్టి పెరిగాను. కానీ భారతదేశానికి ఇంత దూరంగా ఉన్నప్పటికీ మన సంస్కృతికి దూరమైనట్లు నాకు ఎప్పుడూ అనిపించలేదు. నిజానికి, దానిని మరింత లోతుగా అర్థం చేసుకోవాలనే కోరికను అది నాలో కలిగించింది," అని సంజన అన్నారు.

"నేను భరతనాట్యం నేర్చుకున్నాను, హిందీ నేర్చుకున్నాను. హిందీలో అనర్గళంగా మాట్లాడతాను. మన సంప్రదాయాలను కేవలం ప్రత్యేక సందర్భాలలో పాటించేవిగా కాకుండా, మనం అర్థం చేసుకుని, ఆచరించేవిగా ఉండేలా మా తల్లిదండ్రులు చూసుకున్నారు. భారతదేశం వెలుపల పెరిగే నాలాంటి వారు మనం ఎక్కడి నుండి వచ్చామో తెలుసుకోవడానికి మరింత స్పృహతో కూడిన ప్రయత్నం చేస్తారని కొన్నిసార్లు నాకు అనిపిస్తుంది. బహుశా ఆ కారణంగానే భారతదేశంలో పెరిగే చాలా మంది యువతలాగే మన సంప్రదాయాలను నాలాంటి వారు కూడా లోతుగా తెలుసుకోగలుగుతారు" అని తెలిపారు. అలాంటి అస్తిత్వ మూలాలను ఒకేచోట అనుభూతించే అవకాశాన్ని సంజనకు మాడిసన్ స్క్వేర్ గార్డెన్ అందించింది. "మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో కూర్చుని,

ఎన్నో సంస్కృతులు, విశ్వాసాలు ఏకత్వం అనే భావన చుట్టూ కలవడాన్ని చూడటం నాకు అపారమైన గర్వాన్ని, అనుబంధాన్ని కలిగించింది'' అని అన్నారు. 21 ఏళ్ల వయసులో, నేను పుట్టి పెరిగిన దేశంలో ఇలాంటి అనుభవాన్ని పొందడం, అదే సమయంలో నా అస్తిత్వంలో అంతర్భాగమైన నాగరికతను, సంస్కృతిని వేడుకగా జరుపుకోవడం చాలా ప్రత్యేకమైనది. అక్కడ ఉండటం, అందులో భాగం కావడం నన్ను నిజంగా పులకించిపోయేలా చేసింది అని భావోద్వేగంతో తెలిపారు. దూరం పెరిగేకొద్దీ వారసత్వం ఎల్లప్పుడూ బలహీనపడదు. కొన్నిసార్లు దూరం అనేది వారసత్వాన్ని చైతన్యవంతం చేస్తుందని చెప్పడానికి సజీవ నిదర్శనంగా సంజన నిలుస్తారు.

### భారత్‌లో ముస్లింలను వద్దనుకునేవాడు హిందువే కాదు

డాక్టర్ భాగవత్ మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌కు రాకముందు, ఆగస్టు 29న న్యూయార్క్‌లో మరో సంభాషణ జరిగింది. విశ్వ ఏకత్వ వేడుకకు ముందు జరిగిన ఒక సర్వమత సమావేశంలో, హిందూ రాష్ట్రం అర్థం, భారతదేశంలో ముస్లింల స్థానంపై చాలాకాలంగా జరుగుతున్న వాదనలతో ముడిపడి ఉన్న ఒక ప్రశ్నకు ఆయన మరింత సూటిగా సమాధానమిచ్చారు. భారతదేశంలో ముస్లింలు ఉండకూడదని ఏ హిందువైనా విశ్వసిస్తే, "అతను హిందువుగా ఉండడు" అని తాను గతంలో అన్నట్లు తెలిపారు. సమయం, ప్రదేశం మధ్య వ్యత్యాసం ముఖ్యమైనది. డాక్టర్ భాగవత్ మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌కు రాకముందు చేసిన వ్యాఖ్య అది. కానీ తాత్వికంగా, అది ఏకత్వం, ధర్మం, భిన్నత్వంలో ఏకత్వంపై ఆయన చేసిన ప్రసంగం అంతటా కొనసాగిన అదే పరంపరలో ఒక భాగంగా నిలిచింది. వసుధైవ కుటుంబకానికి నాగరికతా అలంకారాలకు అతీతమైన అర్థం ఉండాలంటే, ఈ ప్రపంచమనే కుటుంబం, విభిన్నంగా పూజించేవారు, విభిన్నంగా విశ్వసించేవారు లేదా మెజారిటీ ప్రజల చారిత్రక స్మృతిని పంచుకోని వారిని కూడా కలుపుకోవాలి. స్వతంత్రుల మధ్య విశ్వాసాన్ని సులభంగా ప్రకటించుకోవచ్చు. ఇతరుల కోసం మనం ఇచ్చేదాన్ని కొలవడం మరింత కష్టం.

### హిందువు అయినంత మాత్రాన అమెరికన్ కాకుండా పోడు

తరతరాలుగా, వలసదారులను కూరలో కరివేపాకులాగా తీసివేయడంగా భావించేవారు. అమెరికన్ అవ్వడం అంటే నెమ్మదిగా, అగోచరంగా, మూలాలకు దూరం కావడమే. కానీ పరిణతి చెందిన వలస సమాజాలు మరింత సంక్లిష్టమైన విషయాన్ని కనుగొంటాయి. గుర్తింపు అనేది అంకగణితం కానవసరం లేదు. సంస్కృతిని తెలుసుకోవడం, భరతనాట్యం సాధన చేయడం, గుడికి వెళ్లడం, రాగం వినడం లేదా భారత్‌ను నాగరిక వారసత్వంగా భావించడం వల్ల ఒక హిందూ అమెరికన్ ఒక నికార్సైన అమెరికన్‌కు ఏ విషయంలోనూ తీసిపోడు. అలాగే, భారత్‌పై మమకారం ఒక అమెరికన్ భారతీయ పౌరుడిని అమెరికా పట్ల ఉన్న బాధ్యతల నుండి విముక్తి చేయదు. డాక్టర్ భాగవత్ చేసిన కర్మభూమి సూత్రీకరణ పైన చెప్పిన రెండింటినీ పక్కపక్కనే ఉంచింది. అమెరికా మీరు నివసించే చోటు. దానికి కట్టుబడి ఉండండి. భారత్ వారసత్వం ఇచ్చిన చోటు. దాని విలువలతో జీవించండి అని అన్నారు. ప్రవాస సమూహాలను తరచుగా అంచనా వేసే ద్వంద్వ పదజాలం కన్నా ఇది చాలా ఉన్నతమైన ప్రతిపాదన. మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో దీపాలు ఆరిపోయాయి. నృత్యకారులు వేదికను విడిచి వెళ్లిపోయారు. ధార్మిక పెద్దలు నిష్క్రమించారు. చప్పట్లు ఆగిపోయాయి. ఫోటోగ్రాఫ్‌లు, ప్రసంగాల భాగాలు, మణికట్టుకు రాఖీలు, జ్ఞాపకాలతో నిండిన ఫోన్‌లను చేతబట్టుకుని ప్రజలు తిరిగి మాన్‌హాటన్‌లోకి ప్రవేశించారు. తన సాధారణ అమెరికన్ జీవితానికి మాడిసన్ స్క్వేర్ గార్డెన్ తిరిగి వచ్చింది. కానీ ఆ సాయంత్రపు జ్ఞాపకాలలో ఏదో





ఒకటి చిరస్మరణీయ మవుతుంది.

**సంఖ్య కన్నా సంభాషణకే ప్రాధాన్యత**

కేవలం వేలాది మంది ఒకే చోట చేరారన్న కారణం వల్ల మాత్రమే కాదు. సంఖ్యలు ఒక రోజు ఆకట్టుకుంటాయి, కానీ ఆ తర్వాత అంతకంటే పెద్ద సంఖ్యల ముందు అవి వెనుకబడిపోతాయి. కానీ లోపల జరిగిన సంభాషణకే ఎక్కువ ప్రాధాన్యత లభించింది. ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ అమెరికాకు వచ్చి, ప్రవాస భారతీయులతో మాట్లాడుతూ, అమెరికా వారి కర్మభూమి అని, అందువల్ల వారి మొదటి బాధ్యత దానికే ఉందని చెప్పారు. ఆయన భారత్‌ను ఒక పోటీ రాజకీయ విధేయతగా కాకుండా, దాని విలువలు ప్రజల ప్రవర్తనలో ప్రతిబింబించాల్సిన జన్మభూమిగా అభివర్ణించారు. న్యూజెర్సీలో పెరిగిన 31 ఏళ్ల వ్యక్తి మానవత్వం గురించి మాట్లాడారు. ప్రపంచానికి హృదయాన్ని తెరుస్తూనే, వేళ్లూనుకున్న వారసత్వం గురించి ఒక సంగీతకారుడుల వివరించారు. అమెరికా తూర్పు తీరంలో పుట్టి పెరిగి, హిందీలో అనర్గళంగా మాట్లాడగలిగే 21 ఏళ్ల భరతనాట్య నర్తకి సముద్రం అవతల నుండి తాను వారసత్వంగా పొందిన నాగరికతను తెలుసుకోవడం గురించి మాట్లాడారు. బయట నిరసనకారులు విభేదించే తమ స్వేచ్ఛను వినియోగించుకున్నారు. లోపల వేలాది మంది వినే తమ స్వేచ్ఛను వినియోగించుకున్నారు. రాజకీయాలు, అస్తిత్వం అనే పోటీకి అతీతంగా "వైవిధ్యం సహజం, ఐక్యత సత్యం" అంటూ డాక్టర్ భాగవత్ చేసిన అత్యంత సరళమైన సూత్రీకరణ సంభాషణ శిఖరాగ్రాన నిలిచింది.

బహుశా ఆగస్టు 29న జరిగిన అసలైన ప్రయాణం అదేనేమో. అది భారత్ నుండి న్యూయార్క్‌కు ఒక ఆర్ఎస్ఎస్ అధిపతి చేసిన ప్రయాణం మాత్రమే కాదు. డాక్టర్ మోహన్ భాగవత్ 'జన్మభూమి-కర్మభూమి' అంటూ ఉపనిషత్‌లో ప్రస్తావించిన వాక్యం సముద్రాన్ని దాటి చేసిన ప్రయాణం మాత్రమే కాదు. అది ఒక సమాజం వలసగా సాధించిన విజయాల నుండి నాగరిక స్వీయ-స్వాధీనత వైపు సాగించిన ప్రయాణం. అమెరికాలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకుని, తాము ఎక్కడి నుండి వచ్చామో చెప్పుకోగలిగేంత భద్రతను ఆ ప్రదేశంలో పొందే స్థాయికి చేరుకున్న ప్రయాణం. శతాబ్దాల క్రితం ఈ ప్రపంచం ఒకే కుటుంబం అని రుషులు ప్రకటించారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో, ఆ ప్రాచీన ప్రతిపాదన ఒకరు ఒక నాగరికతను వారసత్వంగా పొందవచ్చు, పూర్తిగా మరొక దేశానికి చెందినవారై ఉండవచ్చు. రెండింటిలో దేనిని తక్కువ చేయాల్సిన పనిలేదు. అన్నింటికీ మించి, సముద్రం భూభాగాలను వేరు చేస్తుంది కానీ వారసత్వాలను వేరు చేయదు అనే ఒక సంపూర్ణ ఆధునిక వాస్తవికతను స్పష్టం చేసింది.

**- మనోరంజన్ గుప్తా, న్యూయార్క్**

**ఆర్గనైజర్ సౌజన్యంతో**

# కృష్ణ చైతన్యం విశ్వవ్యాపితం

ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్, తమ అమెరికా పర్యటనలో భాగంగా ఆగస్టు 28న న్యూయార్క్‌లోని ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించారు. అక్కడ నిరాశ్రయులకు ఆహారం పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచంలోని సంఘర్షణలు, విభజనలను అధిగ మించడంలో 'కృష్ణ చైతన్యం' ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఆలయంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, భేదాలు, సంఘర్షణలు ఉన్నప్పటికీ ప్రజలను ఏకం చేయడంలో చైతన్యం ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. "నేటి ప్రపంచంలో ఎన్నో సంఘర్షణలు, ఎన్నో ద్వంద్వాలు ఉన్నాయి. అందరినీ ఏకం చేసేది చైతన్యం మాత్రమే. ఆ చైతన్యమే కృష్ణచైతన్యం. మనమంతా ఒక్కటే. ఈ ప్రపంచంలోని ఎన్నో వైవిధ్యాలు ఉన్నప్పటికీ, వాస్తవానికి అదంతా కృష్ణుడే అనే బలమైన అవగాహనతో, మనమంతా ఈ ద్వంద్వాల




గుండా ప్రయాణిస్తూనే ఉన్నాం అని అన్నారు. "అంతా కృష్ణుడే అనే ఈ భావన కనుక ప్రతి హృదయాన్నీ చేరితే, ఈ ప్రపంచం కచ్చితంగా మెరుగైనదిగా మారుతుంది. ఇది నేడు మనం చూస్తున్న భౌతిక ప్రపంచంలా కాకుండా, ప్రతి మానవుడికీ ఒక స్వర్గధామంలా ఉంటుంది" అని తెలిపారు. ఈ సందర్భంగా ఇస్కాన్ పాలకమండలి సభ్యుడు గౌరాంగ్ దాస్ మాట్లాడుతూ "సర్ సంఘచాలక్ ఈ రోజు మాన్‌హట్టన్‌లోని ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించడం మాకు ఎంతో గర్వకారణం. 1966లో, ఇస్కాన్ వ్యవస్థాపకులైన శ్రీలప్రభుపాద సరిగ్గా ఇదే న్యూయార్క్ నగరంలో ఇస్కాన్‌ను స్థాపించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తన 100వ వార్షికోత్సవాన్ని జరుపు కుంటున్న ఈ సంవత్సరంలోనే, ఇస్కాన్ కూడా తన 60వ వార్షికోత్సవాన్ని జరుపు కుంటోంది. ఆధ్యాత్మికత, సేవాభావం, సామాజిక పరివర్తన అనే మూడు ప్రధాన అంశాలపై మేము మోహన్‌భాగవత్‌జీతో చర్చిస్తున్నాము. గత ఏడాది కాలంగా, మేము 'జీరో హంగర్ న్యూయార్క్' (ఆకలిగొన్నవారు లేని న్యూయార్క్) అనే భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. ఒక లక్ష మందికి భోజన పళ్లెం అందించే మైలురాయిని మోహన్ భాగవత్‌జీ ఈ రోజు ప్రారంభించారు. అందుకే మేము ఆయనను ఈ కార్యక్రమానికి ఆహ్వానించాము" అని తెలిపారు. "వీరి పర్యటన సందర్భంగా, హిందూ సనాతన ధర్మాన్ని ప్రతి ఇంటికీ ఎలా చేరవేయాలి? దానిని దైనందిన జీవితంలో ఆచరించేలా ప్రజలను ఎలా ప్రేరేపించాలి? అనే విషయంపై మేము చర్చిస్తున్నాము. తమ తీరికలేని కార్యక్రమాల నుండి సమయం కేటాయించి ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించి, తమ ప్రసంగంతో మమ్మల్నందరినీ ఆశీర్వదించినందుకు ఆయనకు మేము కృతజ్ఞులం. ఇస్కాన్ తరపున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహాయపడిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని గౌరంగ్‌దాస్ తెలిపారు.

# భిన్నత్వం సహజం, ఐక్యతే

భిన్నత్వంలో ఏకత్వం అనేది భారత్ డీఎన్ఏలోనే అంతర్లీనంగా ఇమిడి ఉందని ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ అన్నారు. ఆగస్టు 29న న్యూయార్క్ నగరంలో 'యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్' కార్యక్రమంలో, ప్రవాస భారతీయులు, అంతర్జాతీయ ప్రతినిధులతో కూడిన భారీ సభలో 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే నాగరికతాతత్వాన్ని వివరించారు. దేశాలు కేవలం భౌగోళిక ప్రాంతాలు మాత్రమే కావని పేర్కొన్నారు. విశ్వవ్యాప్త ఏకత్వ సత్యాన్ని ప్రపంచ సమాజానికి చాటిచెప్పడం, పంచుకోవడం భారత్ విశిష్ట లక్ష్యమని అన్నారు. సరైన ఆలోచనలు,నిస్వార్థ సేవ ద్వారా ప్రపంచాన్ని నిలబెట్టాల్సిన నైతిక బాధ్యత మానవ మేధస్సుకు ఉందని తెలిపారు. విదేశాలలో నివసిస్తున్న భారతీయులు తమ 'జన్మభూమి' (పుట్టిన నేల) అందించిన విలువలను ఆచరిస్తూనే, తమ 'కర్మభూమి' (పనిచేసే నేల) పట్ల అచంచలమైన విధేయతను కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.

**ప్రసంగంలోని ముఖ్యాంశాలు**

* అమెరికా సంయుక్త రాష్ట్రాల (USA) గురించి మాట్లాడేటప్పుడు తరచుగా చర్చించే పదం "బహుళత్వం" (Pluralism). అదే భారతదేశం గురించి మాట్లాడేటప్పుడు, మరొక భావన లేదా పదబంధం చర్చకు వస్తుంది. అదే "భిన్నత్వంలో ఏకత్వం" (Unity in diversity). భారత దేశానికి సంబంధించి, ఏకత్వం, వైవిధ్యం రెండూ దాని మూల స్వభావం(DNA)లోనే ఇమిడి ఉన్నాయి.
* దేశాలు కేవలం భౌగోళిక ప్రాంతాలు మాత్రమే కావు. దేశాలకు ఒక నిర్దిష్టమైన కర్తవ్యం ఉంటుంది. ప్రతి దేశానికి ఒక సందేశాన్ని అందించడం, ఒక లక్ష్యాన్ని సాధించడం, ఒక గమ్యాన్ని చేరుకోవడం అనే బాధ్యత ఉంటుందని స్వామి వివేకానంద చెప్పారు.
* భారతదేశానికి నిర్దేశితమైన గమ్యం ఏమిటి? ఈ "భిన్నత్వంలో ఏకత్వం" అనే సత్యాన్ని స్వయంగా గ్రహించడం, సమయానుకూలంగా ప్రపంచానికి కూడా దానిని తెలియజేయడం భారతదేశం ఉద్దేశ్యం. మనమందరం ఒక్కటే. భిన్నత్వం వల్ల ఆ ఏకత్వం మరింత శోభాయమానంగా మారుతుంది. కాబట్టి, భిన్నత్వాన్ని మనం గౌరవించాలి, ఆచరించాలి, స్వీకరించాలి. అదే సమయంలో, ఏకత్వ భావనను కూడా మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.
* మంచి, చెడుల మధ్య తేడా తెలిసిన, ఆలోచనాపరులైన మానవులకు ఈ ప్రపంచాన్ని నిలబెట్టే బాధ్యత ఉంది.
* సరైన మార్గంలో ఆలోచిస్తే, మీరు దేవునికి దగ్గరవుతారు. తప్పుగా ఆలోచిస్తే, మీరు జంతు స్వభావానికి దగ్గరవుతారు. కాబట్టి, ఆలోచనా విధానం లేదా దిశ చాలా ముఖ్యం.
* సరైన దిశలో తన జీవితాన్ని మలచుకునే వ్యక్తి భగవంతుని దృష్టిలో బాధ్యతాయుతమైన పౌరుడిగా ఉంటాడు.
* మానవులను జంతువుల నుండి వేరు చేసే ఒక ప్రత్యేక లక్షణం ఉంది. అదే 'ఆలోచనా శక్తి'. మానవులు సరైన రీతిలో ఆలోచిస్తే, వారు ఈ ప్రపంచం మొత్తాన్ని నిలబెట్టగలరు.
* మంచి, చెడుల గురించిన అవగాహన మానవులకు ఉన్నందున, ప్రపంచం పట్ల వారికి బాధ్యత ఉంటుంది. అందుకే, భిన్నత్వం ఉన్నప్పటికీ మానవులు ఏకత్వాన్ని గ్రహించగలరు.
* శరీరాలు, ఇతర అంశాలు వేరుగా ఉన్నప్పటికీ, మనలో అంతర్గతంగా ఒకే తత్వం ఉంటుంది.




# ఐదు నిబద్ధతల కార్యాచరణ ప్రకటన

న్యూయార్క్‌లో జరిగిన 'ఒక ప్రపంచం: ఒక మానవత్వం' సదస్సు ప్రపంచ ప్రధాన నిబద్ధతల 'కార్యాచరణకు పిలుపు' ఇచ్చింది. ప్రపంచ ధార్మిక నాయకుల మండలి (ది వరల్డ్ కౌన్సిల్ ఆఫ్ రెలిజియస్ లీడర్స్) ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉన్నత స్థాయి అంతర్-ధార్మిక సమావేశం, "కార్యాచరణకు పిలుపు" అనే పేరుతో ఒక చారిత్రాత్మక ఉమ్మడి ప్రకటనను జారీ చేసింది. ద్వేషాన్ని ఎదుర్కోవడానికి, మానవ గౌరవాన్ని కాపాడటానికి, ఐక్యతను పెంపొందించడానికి ధార్మిక సమాజాలు కేవలం ఆచారబద్ధమైన మాటలకే పరిమితం కాకుండా ముందుకు సాగాలని ఈ ప్రకటన స్పష్టం చేసింది. "మానవాళికి ఇది ఒక కీలకమైన తరుణం" అని గుర్తిస్తూ, శతాబ్దాల నాటి సంప్రదాయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆధ్యాత్మిక నాయకులు, నైతిక జవాబుదారీతనం, సామూహిక చర్య కోసం ఒక అత్యవసర విజ్ఞప్తిని జారీ చేయడానికి న్యూయార్క్ నగరంలో "ప్రపంచ ధార్మిక నాయకుల మండలి" ఆధ్వర్యంలో ఆగస్టు 29న సమావేశమయ్యారు. "ఒకే ప్రపంచం: ఒకే మానవత్వం సదస్సు"లో భాగంగా వెలువడిన ఈ ప్రకటన విశ్వాసం స్వస్థపరిచే శక్తిని ప్రధానంగా ప్రస్తావిస్తూనే, హింసను ప్రేరేపించడానికి, అణగారిన వర్గాలను వెలివేయడానికి, సామాజిక విభజనలను తీవ్రతరం చేయడానికి ధార్మిక సిద్ధాంతాలను తరచుగా దుర్వినియోగం చేశారన్న బాధాకరమైన వాస్తవాన్ని అంగీకరించింది. కొనసాగుతున్న యుద్ధాలు, ప్రజల విశ్వాసం క్షీణించడం, సరిహద్దులు దాటి డిజిటల్ ద్వేషం వేగంగా వ్యాప్తి చెందడాన్ని ఎత్తి చూపింది. శాంతిని పాదుగొల్పే భారాన్ని ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు మోయలేవని స్పష్టం చేసింది. విచ్ఛిన్నమైన సమాజాలను ఏకం చేయడంలో ధార్మిక నాయకులకు ఒక ప్రత్యేకమైన నైతిక బాధ్యత ఉందని పేర్కొంది. "ప్రతి మానవునికి గౌరవం ఉంది. ఏ సమాజమూ మరొకదాని కంటే తక్కువది కాదు. ఇతరుల బాధ మనది కానంత మాత్రాన అది అప్రస్తుతం కాదు," అని తెలిపింది. ఇతరుల ధర్మాన్ని పరిరక్షించడం వల్ల ఒకరి సొంత దృఢ విశ్వాసాలు వీగిపోవని తేల్చి చెప్పింది.

**ఐదు ప్రధాన నిబద్ధతలు**

ఉమ్మడి విలువలను స్పష్టమైన సామాజిక ఫలితాలుగా మార్చడానికి, ఈ శిఖరాగ్ర సమావేశం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ధార్మిక సంస్థల కోసం ఐదు ప్రాథమిక నిబద్ధతలను వివరించింది.

# సత్యం

మనమందరం ఒకరికొకరం చెందినవారమే.

✶ "అస్తిత్వ ఏకత్వం" (Unity of existence).. అదే మన సత్యం.

✶ ప్రపంచాన్ని "ఒకటి"గా చూడటమే మన దృక్పథం.

✶ ఒక ధోరణి: "తాము జీవించడం, ఇతరులను జీవించనివ్వడం." మరొక ధోరణి: "తాము జీవించడం, తమకు విధేయులైన వారిని మాత్రమే జీవించనివ్వడం." "మీరు మాకు విధేయులైతే, మేము మిమ్మల్ని రక్షిస్తాము" అని చెప్పేవారే రాక్షసులు.

✶ దుర్మార్గుల మనస్సులలోని శత్రుభావం నశించాలని భారతీయ మహర్షులు ప్రార్థిస్తారు.

✶ అమెరికాలోని భారతీయులు తమ 'కర్మభూమి' పట్ల విధేయత కలిగి ఉండాలి. ఆ బాధ్యతను నిర్వర్తించిన తర్వాత, ఒకవేళ తమ 'జన్మభూమి' కోసం ఏదైనా చేయాలనే తపన ఉంటే, అప్పుడు భారత్ మీకు అందించిన విలువలతో జీవించండి.

✶ ఆ విలువలను ప్రపంచానికి అందించడమే మన గమ్యం. ఈ ధర్మం ఏ పునాదిపై నిలిచి ఉందో, అదే 'ఏకత్వం' లేదా 'అస్తిత్వ ఐక్యత'. అదే మన సత్యం.

✶ ఈ జ్ఞానాన్ని ప్రపంచానికి అందించడం. ఆ సత్యాన్ని సాక్షాత్కరించుకోవడమనే కర్తవ్యం మనకు భారత్‌లో హిమాలయాల నుండి సముద్రం వరకు ఉంది.

✶ భారత్ మీకు జీవన విధానాన్ని అందించింది.

✶ కేవలం ఉపన్యాసాల ద్వారా కాకుండా, ఆచరణ ద్వారా ఈ సందేశాన్ని ప్రపంచానికి అందించడమే భారతీయుని కర్తవ్యం.

✶ విశ్వాన్ని నిలకడగా ఉండేలా చేసే నియమమే ధర్మం. మానవులు తమ జీవన ప్రమాణాలను లేదా జీవన నాణ్యతను సరిగ్గా నిర్వహించుకోవడానికి తోడ్పడే నియమం ధర్మం. 'మధ్యే మార్గమే' (సమతుల్య మార్గం) ధర్మం.

✶ మనం ఏకత్వంతో ఐక్యమై ఉన్నాము. భిన్నత్వంతో శోభిల్లుతున్నాము.

✶ భిన్నత్వం సహజమైనది, ఐక్యత సత్యమైనది.

✶ మనం సమాజానికి తిరిగి ఇవ్వాలి. అదే మన సంప్రదాయం. భారత జీవన విధానాన్ని మీరు ముందుకు తీసుకువెళ్లాలని భారత్ మీ నుండి ఆశిస్తోంది. ఇది ఒక సుస్థిర జీవన విధానానికి నమూనా.

ధర్మం ఒక ఆవశ్యకమైన మధ్యేమార్గమని, దాని ద్వారానే మానవులు జీవన నాణ్యతను నిర్వహించుకుంటూ, విశ్వ క్రమాన్ని పరిరక్షించుకుంటారని తన ప్రసంగం ముగింపులో డాక్టర్ మోహన్ భాగవత్ అన్నారు. నిజమైన సేవ అనేది ఒకరు ఎంత సంపాదించారు అనే దానిలో కాకుండా, సమాజానికి ఎంత తిరిగి పంచిపెట్టారు అనే దానిలో ఉంటుందని తెలిపారు. భారత్ శాశ్వత ఆదర్శాలను కేవలం బోధించడం కాకుండా, వాటిని చురుకుగా ఆచరించాలని ప్రపంచ భారతీయ సమాజాన్ని కోరారు. కర్తవ్యం, పరస్పర గౌరవం, నిస్వార్థ పంపిణీపై ఆధారపడిన జీవనశైలిని స్వీకరించాలని పిలుపునిచ్చారు. తద్వారా అంతర్లీన ఏకత్వానికి అలంకారంగా కీర్తించే భిన్నత్వంతో నిజమైన, సుస్థిరమైన, సామరస్యపూర్వకమైన ప్రపంచాన్ని మానవాళి నిర్మించగలదని పేర్కొన్నారు.




1. **తమతోనే ప్రారంభించడం:** నాయకులు తమ సొంత అంతర్గత ఆచారాలు, మాటలు, బోధనలను పరిశీలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అవమానం, ద్వేషం లేదా హింసను సమర్థించడానికి మతాన్ని ఉపయోగించే ఏ ప్రయత్నాన్నైనా స్పష్టంగా తిరస్కరించారు.

**2.ఒకరికొకరు అండగా నిలబడటం:** భౌగోళిక దూరం లేదా మతపరమైన గుర్తింపుతో సంబంధం లేకుండా, ఏ సమూహమైనా అమానవీయంగా ప్రవర్తించినప్పుడు లేదా ఇతరులను లక్ష్యంగా చేసుకున్నప్పుడు, మిగిలిన సమూహాలు గళం విప్పేలా ఈ ప్రకటన నిర్దేశిస్తుంది.

**3.సంక్షోభానికి ముందే సంబంధాలను నిర్మించడం:** సంఘర్షణలు తలెత్తక ముందే మూసధోరణులను నిర్మూలించడానికి చురుకైన, విభిన్న సంస్కృతులు, విభిన్న మతాల మధ్య సంబంధాలను, ముఖ్యంగా యువత మధ్య సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిస్తోంది.

**4.కలిసి సేవ చేయడం:** అస్తిత్వం కోసం పోటీ పడటం కంటే ఉమ్మడి శ్రమకు ప్రాధాన్యతనిస్తూ, ఆకలితో ఉన్నవారికి, రోగులకు, నిరాశ్రయులకు, హింసకు గురైనవారికి మానవతా సహాయం అందించడంలో సంఘాలు నేరుగా సహకరించుకోవాలని కోరింది.

**5.భవిష్యత్తుకు బాధ్యత వహించడం:** యుద్ధం, పేదరికం, పర్యావరణ పరిరక్షణ, కృత్రిమ మేధ(ఏఐ) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు వంటి కీలకమైన ప్రపంచ సవాళ్లపై నైతిక పర్యవేక్షణను చేపట్టడానికి ధార్మిక నాయకులు కట్టుబడి ఉన్నారు. సాంకేతిక పురోగతి మానవ గౌరవాన్ని దెబ్బతీయకుండా, అది మానవాళికి సేవ చేయాలని ప్రకటన పేర్కొంది.

**స్థానిక అమలుకు ఆదేశం**

నిష్క్రియ ఒప్పందాలను తిరస్కరిస్తూ, హాజరైన ప్రతి నాయకుడు కనీసం ఒక నిర్దిష్టమైన, స్థానికీకరించిన కార్యాచరణ చేపట్టాలి. ఉదాహరణకు యువత కోసం వేదికలను సృష్టించడం, లక్షిత వర్గాలకు మద్దతు ఇవ్వడం, లేదా కఠినమైన సంభాషణలను ప్రారంభించడం వంటివి అమలు చేయాలని శిఖరాగ్ర సమావేశం పిలుపునిచ్చింది. "ఒక ప్రపంచ ప్రకటన స్థానికంగా కార్యాచరణకు నోచుకున్నప్పుడే దానికి విలువ ఉంటుంది," అని ప్రకటన పేర్కొంది. ధార్మిక నాయకులు మాత్రమే అన్ని అన్యాయాలను నిర్మూలించలేనప్పటికీ, ప్రతి ధైర్యసాహసాల చర్య మరొకదానికి అవకాశం కల్పిస్తుందని అది అంగీకరించింది.




# హిందూ .. విశ్వ

భిన్నత్వం ఐక్యతకు నిదర్శనమని, మానవ సేవ దేశం శాశ్వత సంప్రదాయమని ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ అన్నారు. ఆగస్టు 30న కెనడా, టొరంటోలో "హిందూ విశ్వ బంధు – స్నేహభావంతో ప్రపంచాన్ని ఆలింగనం చేసుకోండి" కార్యక్రమంలో వసుధైవ కుటుంబకం అనే భారత నాగరిక స్ఫూర్తిని ప్రముఖంగా ప్రస్తావించారు. "వసుధైవ కుటుంబకం అనే భావనను అంటే సమస్త భూగోళం ఒకే కుటుంబం అనే విశ్వాసాన్ని విశాల దృక్పథం, జ్ఞానం కలిగిన వారు అంగీకరిస్తారు. భౌతిక ప్రపంచంలోని వ్యక్తులు శరీరం, ఆకారం, రంగులపరంగా భిన్నంగా కనిపించినప్పటికీ, అంతర్గతంగా మనమందరం ఒక్కటే. కాబట్టి, ఇతరులకు సేవ చేయడం మన కర్తవ్యం. శాశ్వతమైన ఆనందాన్ని నిరంతర సంతృప్తిని కలిగించే జ్ఞానాన్ని మనం పొందాము" అని అన్నారు. ప్రపంచానికి సహాయపడటం, ఐక్యత అనే భారత్ అంతర్గత సంస్కృతిని ప్రధానంగా ప్రస్తావించారు. భిన్నత్వాన్ని ఎప్పుడూ కూడా ఐక్యత సహజ రూపంగానే భారత్ సంప్రదాయం భావిస్తుందని పేర్కొన్నారు. "ప్రపంచంలో ఎవరైనా సరే, భారత్‌ను సాయం కోరినప్పుడు అది ఎప్పుడూ నిరాకరించలేదు. పైగా, ఎవరూ అడగకపోయినా సరే భారత్ ఆపన్న హస్తం అందిస్తుంది. ఇదే మన సంప్రదాయం. ఇదే భారత్ డీఎన్ఏ. అందుకే 'హిందువులు మేల్కొంటే, ప్రపంచం మేల్కొంటుంది' అనే మాటను మీరు వినే ఉంటారు" అని అన్నారు. మానవాళి, ప్రకృతి మధ్య ఐక్యతను భారత ఆధ్యాత్మిక వారసత్వం ఎలా పెంపొందిస్తుందో మరింతగా వివరించారు. "వారు ప్రాణం ఉన్న వాటిని, ప్రాణం లేనివాటిని రెండింటినీ తమవిగా భావిస్తారు... భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడాలని వారికి బోధించారు. అందుకే భారతదేశంలో భిన్నత్వం ఐక్యతకు ఎన్నడూ అడ్డంకి కాదు. భిన్నత్వంలో ఏకత్వం ఉండటమే కాకుండా, భిన్నత్వమే ఒక రకమైన ఐక్యత అని మన సంప్రదాయం మనకు బోధిస్తుంది," అని అన్నారు. ప్రపంచమంతా ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న ఒకే కుటుంబం అనే అవగాహనతో కూడుకున్న 'వసుధైవ కుటుంబకం' అనే ప్రాచీన తత్వాన్ని స్వీకరించాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. బాహ్య భేదాలను అధిగమించి, మానవాళి అంతర్లీన ఆధ్యాత్మిక ఐక్యతను గుర్తించడంలోనే నిజమైన జ్ఞానోదయం ఉందని అన్నారు. అంతేకాకుండా, భారత్ తన స్వభావరీత్యా మహాశక్తిగా కాకుండా విశ్వగురువుగా ఎలా మారిందీ వివరించారు. "ఒకానొక సమయంలో భారత్‌ను అగ్రరాజ్యం అని పిలవవచ్చు. కానీ అది అగ్రరాజ్యం కాదు. అది ప్రపంచానికి సేవ చేసింది. దాని స్వభావరీత్యా, అది మహాశక్తిగా కాకుండా విశ్వగురువుగా మారింది. కాబట్టి భారత్ ఎదుగుదల అంటే మరింత ఐక్యమైన, మరింత విముక్తి పొందిన మానవాళి అని అర్థం" అని అన్నారు.

అంతర్జాతీయ మానవతా సంక్షోభాల సమయంలో భారత్ ముందుకొచ్చిన చారిత్రక, సమకాలీన ఉదాహరణలను డాక్టర్ భాగవత్

## హిందువులు, సిక్కుల విలువలు ఒకటే

హిందువులు, సిక్కులు వేర్వేరు ధర్మాలను అనుసరించవచ్చు, కానీ మేము ఒకే విలువలను, స్ఫూర్తిని పంచుకుంటాము అని సిక్కు నాయకుడు కశ్మీర్ సింగ్ ధాలివాల్ అన్నారు. కెనడాలోని టొరంటోలో జరిగిన 'హిందూ విశ్వ బంధు – స్నేహంతో ప్రపంచాన్ని ఆలింగనం చేసుకోండి' కార్యక్రమంలో, ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్, కెనడా మాజీ రక్షణ మంత్రి అల్బెర్టా, మాజీ ప్రధాని జాసన్ కెన్నీల సమక్షంలో హిందువులు, సిక్కుల ఉమ్మడి వారసత్వం, విలువలు, సామాజిక బంధాల గురించి కశ్మీర్ సింగ్ ధాలివాల్ మాట్లాడారు. ఉత్తర అమెరికా యునైటెడ్ సిక్కు హిందూ సంఘం (USAHA) తరపున ఈ రోజు మాట్లాడటం నాకు దక్కిన గౌరవం.హిందువులు, సిక్కులు వేర్వేరు ధర్మాలు, సంప్రదాయాలను అనుసరించవచ్చు, కానీ మనం ఒక అమూల్యమైన విషయాన్ని పంచుకుంటాము. మనం భాషలు, ఆహారం, సంగీతం, కుటుంబ సంప్రదాయాలు, పండుగలు, విలువలు అన్నింటికంటే ముఖ్యంగా, సమాజ సేవ స్ఫూర్తిని పంచుకుంటాము" అని తెలిపారు. "మా పూర్వీకులు కెనడాకు వచ్చినప్పుడు, వారు కేవలం హిందువులుగా లేదా సిక్కులుగా మాత్రమే కాకుండా, భారతీయులుగా, పంజాబీలుగా, దక్షిణాసియా వాసులుగా వచ్చారు. మా విశ్వాసాన్ని ఆచరించడానికి, మా వారసత్వం పట్ల గర్వంతో మా పిల్లలను పెంచడానికి కెనడా మాకు స్వేచ్ఛను ఇచ్చింది. ఈ రోజు, కెనడా బహుళ సాంస్కృతిక సమాజానికి అత్యధికంగా దోహదపడే వర్గాలలో హిందూ, సిక్కు వర్గాలు ఉన్నాయి," అని చెప్పారు. "ప్రపంచంలోనే అత్యంత పురాతన బహుళ సాంస్కృతిక దేశమైన భారతదేశంలో జన్మించి, ప్రపంచంలోనే అత్యంత నూతన బహుళ సాంస్కృతిక దేశమైన కెనడాలో నివసిస్తున్నందుకు మేము నిజంగా గర్వపడుతున్నాము" అని అన్నారు. "మా మొదటి గురువు గురునానక్ దేవ్ జీ, 'హిందువు లేదు, ముస్లిం లేదు' అనే గొప్ప మాటను పలికారు. ముందు మనిషి, ఆ తర్వాతే హిందువు, ముస్లిం, సిక్కు లేదా క్రైస్తవుడు" అని తెలిపారు. "ఆయన కులం, రంగు, మతం, లింగ వివక్షను తీవ్రంగా ఖండించారు. కెనడాలోని మా యువత పట్ల మాకు ఎంతో గర్వంగా ఉంది. వారు కులం, రంగు, మతం ,లింగపరమైన అడ్డంకులను ఛేదించి, వివిధ వర్గాల మధ్య కొత్త అనుబంధాలను ఏర్పరుస్తారు. మా యువత గురించి




# బంధు

గుర్తుచేశారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో పోలిష్ శరణార్థులు ఎదుర్కొన్న దుస్థితిని ప్రస్తావిస్తూ, వారు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వెళ్ళే వరకు జామ్‌నగర్ మహారాజు వారికి ఆశ్రయం, రక్షణ కల్పించిన వైనాన్ని వివరించారు. సంక్షోభ సమయాల్లో సహాయం అందించే భారత్ సంప్రదాయాన్ని ప్రస్తావిస్తూ, ''ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది' అని అన్నారు. ఇటీవల మధ్యప్రాచ్యంలో సంఘర్షణల సమయంలో ప్రజలను తరలించిన విషయాన్ని ప్రస్తావించారు. భారత సైనిక రవాణా విమానాలు కేవలం భారతీయ పౌరులనే కాకుండా, యుద్ధ ప్రాంతంలో చిక్కుకుపోయిన ఇతర ఏడు దేశాల పౌరులను కూడా ఎలా రక్షించిందీ వివరించారు.

ప్రపంచానికి జ్ఞానాన్ని, నాగరికతకు సంబంధించిన విలువలను అందించాలనే లక్ష్యం మన పూర్వికులకు ఉండేదని గుర్తుచేశారు. " చాలా కాలం క్రితం రోడ్లు, పడవలు, విమానాలు లేదా మోటారు వాహనాలు ఏమీ లేని, కేవలం ఎడ్లబళ్లు, గుర్రాలు మాత్రమే ఉన్న ఆ రోజుల్లో మన పూర్వీకులు మెక్సికో నుంచి సైబీరియా వరకు ఉన్న ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రజలకు జ్ఞానాన్ని అందించారు. వారు కాలినడకన హిమాలయాలను దాటి చైనా, సైబీరియా, మంగోలియా ప్రాంతాలకు వెళ్లారు. చిన్న పడవల ద్వారా ఆగ్నేయాసియాకు చేరుకున్నారు. ఆ క్రమంలో వారు ఏ దేశాన్నీ జయించలేదు. ఎవరినీ మతమార్పిడి చేయలేదు. వారు ఎక్కడికి వెళ్లినా జ్యోతిషశాస్త్రం, ఆయుర్వేదం వంటి జ్ఞానాన్ని పంచారు, నాగరికతా విలువలను అందించారు" అని చెప్పారు. హిందూ తత్వ సారాంశాన్ని వివరిస్తూ, హిందూ గుర్తింపు అనేది సంకుచిత భాషా లేదా మతపరమైన పరిధులకంటే ఉన్నతమైనదని స్పష్టం చేశారు. "నేను 'హిందువును' అని అన్నప్పుడు, ఆ పదాన్ని ఏదైనా నిర్దిష్ట భాష, నిర్దిష్ట ఆరాధనా విధానం లేదా జీవనశైలి ద్వారా నిర్వచించలేము," అని పేర్కొన్నారు. హిందువులు "అందరినీ గౌరవిస్తారని". "అందరినీ అంగీకరిస్తా రని" తెలిపారు. "అన్ని దేశాలు వర్ధిల్లుతాయి. అభివృద్ధి చెందుతాయి. పరస్పరం సహకరించు కుంటాయి, మానవాళి అలాగే సృష్టి పురోగతికి తమ వంతు కృషి చేస్తాయి అనేది హిందువులు కనే కల. మనల్ని మనం తీర్చిదిద్దుకోవాలి. ఒక పువ్వులా వికసించి, తన సువాసనను చుట్టూ ఉన్న వాతావరణం అంతటికీ పంచేలా మనం తయారవ్వాలి. తద్వారా మనం అభివృద్ధి చెందడమే కాకుండా, మానవ శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేసేవారిగా మారాలి.

హిందువు జీవన విధానం ఇదే. ఒక వ్యక్తి ఎంతటి విజయం సాధించినప్పటికీ, తన కుటుంబానికి మేలు చేయకపోతే అతన్ని మంచి వ్యక్తిగా పరిగణించరు. అలాగే, ఒక కుటుంబం ఎంత సంపన్నమైనదైనప్పటికీ, అది తన గ్రామానికి మేలు చేయకపోతే దానిని మంచి కుటుంబంగా భావించరు. సైన్యానికి ఎంతోమంది ధైర్యవంతులైన జవాన్లను, సమాజానికి ఎంతోమంది సంస్కర్తలను అందించే గ్రామాలనే ఆదర్శవంతమైన గ్రామాలుగా పరిగణిస్తారు. 'ఈ విశ్వమే నా ఇల్లు, నేనే విశ్వం, విశ్వమే నేను' అని భావించే స్థాయికి తన 'ఆత్మీయత' పరిధిని విస్తరించుకున్న వ్యక్తి భారత్‌లో అత్యంత గౌరవనీయుడిగా నిలుస్తాడు. మన చరిత్రలో ఎంతోమంది రాజులు, వారి గాథలు ఉన్నాయి. కానీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం 14 ఏళ్లు అరణ్యవాసం చేసిన రాజు కథకే మనం అత్యంత విలువనిస్తాం. మీరు ఒక్క రాత్రిలోనే భగవాన్ రాముడిలా లేదా మన పూర్వీకులలా మారిపోలేరు. అది సాధ్యం కాదు. కానీ నెలకు, వారానికి లేదా సంవత్సరానికి, మీకు కుదిరిన కాలవ్యవధిలో రెండు చిన్న అడుగులు వేయగలరు కదా? మిమ్మల్ని మీరు మరింత జ్ఞానవంతులుగా, సేవాభావం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దుకోవడానికి చిన్న చిన్న మార్పులు చేసుకోండి. ఇలాంటి పనులు చేస్తూ సమాజంలో ఎంతోమంది జ్ఞానాన్ని వెదజల్లుతున్నారు" అని అన్నారు.

మానవాళిలోని అంతర్లీన ఐక్యతను గుర్తిస్తూనే, భిన్నత్వాన్ని స్వీకరించాలని డాక్టర్ భాగవత్ పిలుపునిచ్చారు. "మనం ఈ భిన్నత్వాన్ని సేవించాలి, అంగీకరించాలి, గౌరవించాలి. ఎందుకంటే ఇది ఐక్యతకు ఒక వ్యక్తీకరణ. ఇది దానికి అందాన్నిస్తుంది. ఇది ఒక అలంకరణ. మనం దానిని వేడుకగా జరుపుకుంటాము" అని అన్నారు. భారతదేశపు ప్రాచీన సంస్కృతి భిన్నత్వాన్ని సహజమైనదిగా గుర్తిస్తూ, ఐక్యతను ప్రాథమిక వాస్తవికతగా పరిగణిస్తుందని తెలిపారు. "వాస్తవికతకు వ్యక్తీకరణ అయిన ప్రకృతి భిన్నత్వంతో కూడుకున్నది. భిన్నత్వం సహజమైనది. ఐక్యతే వాస్తవికత. అదే భారతదేశపు ప్రాచీన సంస్కృతి," అని తెలిపారు. "మన ప్రార్థనలన్నీ భారతదేశం అనే నేల నుండి ఉద్భవించాయని మనం చెబుతాము. కానీ అవి ఎప్పుడూ కేవలం భారతదేశం కోసం మాత్రమే కాదు. అవి మనకు తెలిసిన మొత్తం విశ్వం కోసం ఉన్నాయి" అని తెలిపారు.

– జాగృతి డెస్క్

మాకు నిజంగా గర్వంగా ఉంది" అని చెప్పారు.

పంజాబీ భాషలోకి మారుతూ "హిందూ, సిక్కు ధర్మాల గురించి నేను తెలుసుకున్న విషయాలన్నీ నా పాఠశాల గోడల నుండే నేర్చుకున్నాను. అక్కడ 'సభే సంజీవాల్ సదాయిన్' (అందరూ భాగస్వాములే), 'కోయి నా దిసై బాహరా జియో' (ఎవరూ పరాయివారు కారు), 'మానస్ కి జాత్ సభై ఏకై పెహచాన్బో' (మానవ జాతి అంతా ఒక్కటే అని గుర్తించాలి), 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమే ఒక కుటుంబం) వంటి వాక్యాలు రాసి ఉండేవి." అని ధాలివాల్ అన్నారు. ఇవన్నీ సమానత్వం అనే ఒకే సందేశాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. "ఒక పసిబిడ్డకు మొదటగా 'నువ్వు ఒక మనిషివి' అని నేర్పిస్తే, నేడు మతాలు, కులాలు, భాషల పేరుతో జరుగుతున్న ఘర్షణలకు ముగింపు పలకవచ్చు" అని అభిప్రాయపడ్డారు. "భారతదేశంలో జన్మించడం మన అదృష్టం. భారతదేశం మన మాతృభూమి . అది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం" అని చెప్పారు. ప్రస్తుతం తాము కెనడాలో నివసిస్తున్నామని, విస్తీర్ణంపరంగా ఇది కూడా ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలలో ఒకటని పేర్కొన్నారు. "ఈ రెండు దేశాలతో మనకున్న సంబంధాల పట్ల మనం గర్వపడాలి" అని అన్నారు. భారతదేశం చుట్టుపక్కల అనేక దేశాలలో కత్తులు, కర్రలు లేదా తుపాకుల ద్వారా ప్రభుత్వాలు మారుతుంటాయని ధాలివాల్ పేర్కొన్నారు. దీనికి భిన్నంగా, "మన దేశంలో ప్రజలు తమ ఓటు బటన్‌ను నొక్కడం ద్వారా ప్రభుత్వాలను మారుస్తారు" అని అన్నారు. "మన దేశంలో ప్రజాస్వామ్యం ఉండటం, మనం ఆ ప్రజాస్వామ్య వ్యవస్థలో జీవిస్తుండటం నిజంగా మన అదృష్టం" అని తెలిపారు.

**ఇటీవల రాజమండ్రి వద్ద గోదావరి వంతెన పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న పంచాయతీరాజ్ శాఖ ఏఈ నూకరాజు కుటుంబం ఉదంతం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపింది. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య విడివిడిగా రాసిన సూసైడ్ నోట్స్ అనేక దిగ్భ్రాంతికరమైన వాస్తవాలను వెలుగులోకి తెచ్చాయి. సాధిక్‌ఖాన్ అనే వ్యక్తి వేధింపుల వల్లే తాము తనువు చాలిస్తున్నట్లు వారు ఆ లేఖల్లో ఆవేదన వ్యక్తం చేశారు. సాధిక్‌ఖాన్, వివాహిత అయిన సౌజన్యకు మాయమాటలు చెప్పి దగ్గరై, వివాహేతర సంబంధం నెరపి, చివరికి ఆమె భర్త మరణానికి సైతం కారణమయ్యాడన్న ఆరోపణలు విస్మయపరుస్తున్నాయి.**



# లవ్ జీహాద్

ఒక కుటుంబ ఉసురుతీసిన నిందితుడు సాధిక్‌ఖాన్ కుటుంబం బాధితుల పట్ల ఎదురుదాడికి దిగడం విస్తుపరుస్తోంది. సౌజన్య ఆస్తిని చేజిక్కించుకునేందుకు నిందితుడు ఆమెను హింసించడంతో పాటు ఆమె పదేళ్ల కుమారుడిని ఉగ్రవాదులకు అప్పగిస్తామని బెదిరించడం అతని పైశాచికత్వానికి అద్దం పడుతోంది. ఒకపక్క అతని కుట్ర స్పష్టంగా కనబడుతున్నా... తమ కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని, తప్పంతా బాధితులదేనని అతని కుటుంబం ప్రత్యారోపణలకు దిగడం గమనార్హం. పైగా, తాము ఆత్మహత్య చేసుకుంటే అందుకు ప్రభుత్వానిదే బాధ్యత అన్నట్లు బెదిరింపులకు పాల్పడుతున్న తీరు ఇలాంటి శక్తులు సమాజంలో ఏ స్థాయిలో వేళ్లూనుకున్నాయో స్పష్టం చేస్తూ ఆందోళన కలిగిస్తోంది. ఒక గౌరవప్రదమైన కుటుంబం ఇలాంటి బ్లాక్‌మెయిల్‌కు బలికావడం సమాజంలో దాగివున్న అత్యంత ప్రమాదకరమైన చీకటి కోణాన్ని బట్టబయలు చేస్తోంది.

ప్రేమ పేరుతో అమాయకపు మహిళలను లోబరుచుకుని వారి జీవితాలను నాశనంచేసే అకృత్యాలకు ఈ ఘటనే సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.



సాధిక్‌ఖాన్

సౌజన్యను బుట్టలో వేసుకున్న తర్వాత, సాధిక్‌ఖాన్ ఆమెతో సన్నిహితంగా ఉన్న సమయాల్లో రహస్యంగా వీడియోలు తీసి, వాటిని బహిర్గతం చేస్తానని బెదిరించడం అత్యంత హేయమైన చర్య. ఈ బ్లాక్‌మెయిల్ పర్వంతో పాటు, తనను పెళ్లి చేసుకోవాలని, కుటుంబ ఆస్తులన్నీ తన పేరున రాయాలని చిత్రహింసలు పెట్టినట్లు ఆ లేఖల ద్వారా స్పష్టమవుతోంది. ఇలా తెలుగు రాష్ట్రాల్లో కొందరు యువకులు పథకం ప్రకారం మహిళలను లక్ష్యంగా చేసుకుని, వలపు వల విసిరి, రహస్యంగా వీడియోలు చిత్రీకరించి ఆపై వారి కుటుంబాల పరువు, ప్రాణాలతో ఆడుకుంటున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

ఈ దారుణ ఘటన నేపథ్యంలో 'లవ్‌జిహాద్', మతమార్పిడుల కోణంపై తెలుగు రాష్ట్రాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. హిందూ యువతులను వ్యూహాత్మకంగా లక్ష్యంగా చేసుకుని, ప్రేమ పేరుతో వంచించి, ఆపై మతం మారాలంటూ ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలకు ఈ ఉదంతం బలం చేకూరుస్తోంది. సౌజన్యను పెళ్లాడతానని నమ్మించి, మతం మారాలని సాధిక్‌ఖాన్ ఒత్తిడి చేయడం, తీవ్ర స్థాయి బెదిరింపులకు పాల్పడటం చూస్తుంటే, దీని వెనుక ఒక వ్యవస్థీకృత నేరాల తీరు దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళల మానసిక బలహీనతలను ఆసరాగా చేసుకుని, వారిని ట్రాప్ చేయడం, అక్రమ సంబంధాలు పెట్టుకుని వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తూ మతమార్పిడులకు పురిగొల్పడం సమాజ భద్రతకు, మత సామరస్యానికి పెనుముప్పుగా మారుతోంది. నిందితుడు సాధిక్‌ఖాన్‌ను పోలీసులు వెంబడించి ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అదుపులోకి తీసుకోవడం, అక్కడి నుంచి కాకినాడకు తీసుకువచ్చి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించడం కాస్త ఊరట నిచ్చే అంశం.

### భాస్కర్ రెడ్డి సంచలన ఆరోపణలు

తన కుమారుడు జగదీశ్వరరెడ్డికి ప్రొటీన్ పౌడర్‌లో విషం కలిపి ఇచ్చినట్లు సౌజన్య మామ భాస్కరరెడ్డి ఆరోపించారు. సౌజన్య కూడా తన లేఖలో ఈ విషయాన్ని పేర్కొంది. ఈ ఆరోపణలు కేసు తీవ్రతను మరింత పెంచుతున్నాయి. అలాగే భాస్కరరెడ్డి పదేళ్ల మనుమడు కార్తికేయరెడ్డిని తీవ్రవాదులకు అప్పగిస్తానని సాధిక్ బెదిరించినట్లు వస్తున్న వార్తలు అత్యంత కలకలం రేపుతున్నాయి. నిందితుడికి కేవలం నేర చరిత్రే కాకుండా తీవ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయనే ఆయన అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

### నిందితుడి కుటుంబం బెదిరింపులు!

ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు విచారణలో ప్రధాన నిందితుడు సాధిక్‌ఖాన్ చుట్టూ ఉచ్చు బిగుస్తున్న కొద్దీ, ఈ కేసు అనేక మలుపులు తిరుగుతోంది. ఆధారాలు, బాధితుల మరణ వాంగ్మూలాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, నిందితుడి కుటుంబ సభ్యులు తమ కుమారుడు చేసిన పనికి సమర్థించడం, బాధితులపై నేరాన్ని తప్పును నెట్టివేయడం, పైగా ప్రభుత్వాన్ని బెదిరించడం పలు విమర్శలకు తావిస్తున్నాయి. సాధిక్ ఏ తప్పూ చేయలేదని అతని తల్లి, సోదరి బహిరంగంగా వెనకేసుకు రావడం విస్మయం కలిగిస్తోంది. విచారణను ఎదుర్కోవడానికి బదులుగా, సాధిక్‌పై ఆరోపణలు చేస్తే తాము ఆత్మహత్య చేసుకుంటామని, దానికి ప్రభుత్వానిదే బాధ్యత అంటూ వారు నేరుగా దర్యాప్తు సంస్థలను, ప్రభుత్వాన్ని బెదిరిస్తుండటం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, ఈ కేసును ఉద్దేశపూర్వకంగా ''మతపరమైన కుట్ర''గా చిత్రీకరించి అసలు నేరాన్ని, విచారణను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు.



సౌజన్య, తల్లిదండ్రులు

# ...తో మతమార్పిడికి కుట్ర

సాధిక్‌ఖాన్ కుటుంబం ఎన్ని సమర్థింపులు చేసుకున్నప్పటికీ, ఈ కింది తార్కిక ప్రశ్నలకు వారి వద్ద సమాధానం లేదు. ఆ కుటుంబం చెబుతున్నట్లుగా అతనికి ఎలాంటి పాపమూ తెలియక పోతే, ఏ తప్పు చేయకపోతే కాకినాడ వదిలి మీరట్‌కు ఎందుకు పారిపోయినట్లు? పోలీసుల కళ్లుగప్పి తిరగాల్సిన అవసరం ఏమొచ్చింది?

సమాజంలో మంచి హోదా, కోట్ల రూపాయల ఆస్తులు ఉన్న నూకరాజు కుటుంబం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతూ, చివరికి పసివాడితో సహా గోదావరిలో దూకి ఎందుకు ఆత్మహత్య చేసుకుంటారు? ఆత్మహత్యకు ముందు వారు రాసిన లేఖల్లో సాధిక్‌ఖాన్ పెట్టిన మానసిక క్షోభ, బ్లాక్‌మెయిల్ గురించి స్పష్టంగా పేర్కొనడం అతని నేరానికి ప్రత్యక్ష సాక్ష్యం.

వాస్తవాలు ఇంత నిర్ద్వంద్వంగా కనిపిస్తుంటే, నిందితుడిని కాపాడుకోవడానికి అతని కుటుంబం వ్యవస్థలను బెదిరించడం, మతం కార్డు వాడటం కేవలం దర్యాప్తును నీరుగార్చే ఎత్తుగడలే. సాధిక్ పారిపోవడం, ఆస్తుల కోసం బాలుడిని తీవ్రవాదులకు అప్పగిస్తాననడం లాంటి భయానక అంశాలు అతని నేర ప్రవృత్తిని స్పష్టం చేస్తున్నాయి. నిందితుడి కుటుంబం చేస్తున్న బ్లాక్‌మెయిల్‌కు తలొగ్గకుండా ఈ కేసులో తీవ్రవాద కోణాన్ని కూడా పోలీసులు నిశితంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది.

**ఉగ్రవాద సంబంధంపై అనుమానం?**

పదేళ్ల బాలుడు క్రియాన్స్‌ను తీవ్రవాదులకు అప్పగిస్తానని సాధిక్ బెదిరించినట్లు వస్తున్న వార్తలు అత్యంత కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే పసివాడిని అడ్డుపెట్టుకుని ఇలాంటి పైశాచిక బెదిరింపులకు పాల్పడటం తీవ్రమైన నేరం. రాష్ట్రంలో కొన్నేళ్లుగా ఉగ్రవాదుల కదలికలు సంచలనం కలిగిస్తున్న విషయం, తీవ్రవాదుల కదలికలు, పోలీసులు అరెస్టులు తెలిసిందే. ఇప్పుడు సాధిక్‌ఖాన్ ఉగ్రవాదుల గురించి పేర్కొనడంతో అతనికి వాళ్లతో సంబంధాలు ఉన్నాయని హిందూ సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. నాలుగేళ్లక్రితం ఆత్మకూరులో మసీదు ఘటనలో పోలీసుస్టేషన్ వద్ద వాహనాలను దహనం చేయడం నుంచి ఏడాది క్రితం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న కారణంగా కొత్వాల్ నూర్ మహమ్మద్ అరెస్టు, అంతకుముందు విజయ నగరంలో పేలుడు పదార్థాల స్వాధీనం, కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో నిషేధిత ఉగ్రవాద సంస్థల పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ వంటి తీవ్ర వాద సంస్థలు కార్యకలాపాల వంటివి రాష్ట్రంలో ఉగ్రవాద సంసల ఉనికిని తెలియచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కార్తికేయరెడ్డిని ఉగ్రవాదులకు అప్పగిస్తానని సాధిక్‌ఖాన్ బెదిరించడంతో అతనికి ఉగ్రవాదులతో ఏమైనా సంబంధం అనే ఉందా అనే విషయంపై అనుమానులు వ్యక్తం అవుతున్నాయి.

**కార్తికేయకు రక్షణ:బాలల హక్కుల కమిషన్**

ఈ విషయంలో తగిన విచారణ చేయాల్సిందిగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటనపై కాకినాడలో పోలీసు, విద్యాశాఖాధికారులు, రైఫిల్ శిక్షణ ఇచ్చిన స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధులతో కమిషన్ ఛైర్మన్ వేటుకూరి సూర్యనారాయణరాజు సమీక్ష నిర్వహించారు. ఈ కేసు కోర్టు తదుపరి కస్టడీ విచారణకు అక్టోబర్ 2వ తేదీకి వాయిదా వేసినట్టు అధికారులు తెలిపారు. విషయాలు బయటపెడితే బాలుడిని తీవ్రవాదులకు అప్పగిస్తామని నిందితుడు బెదిరించడం వెనుక ఎవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో బాలుడికి, అతడి కుటుంబానికి రక్షణ కల్పించాలని కోనసీమ ఎస్పీని ఆదేశించారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి భద్రతపై కాకినాడలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ బెంచ్ ఆధ్వర్యంలో సమగ్ర విచారణ నిర్వహిస్తామని వేటుకూరి తెలిపారు. కమిషన్ సభ్యులు డా. కె.నాగమానస, గంగా సూర్య నారాయణ, రావులపాలెంలోని భాస్కరరెడ్డి నివాసానికి వెళ్లి బాలుడితో మాట్లాడారు. విషాద ఘటన, తదుపరి పరిణామాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ బాలుడికి భద్రత కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని, అతనికి విద్య, భవిష్యత్ అంశాలపై అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పదేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోవడం బాలుడి భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపిందన్నారు.




**తురగా నాగభూషణం**

**సీనియర్ జర్నలిస్ట్**






# ఆందోళనక

**రాష్ట్రంలో నేరాల రేటు పెరిగిపోతోంది. కొన్ని రకాల నేరాల్లో తగ్గుదల కనిపిస్తుండగా.. మరికొన్ని రకాల నేరాలు పెరిగి పోతున్నాయి. ఇటీవల జరిగిన అర్ధ వార్షిక నేర సమీక్ష సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తున్నాయి. గత మూడేళ్లుగా పెరుగుతున్న నేరాలను కట్టడి చేయడంలో హోం శాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి విఫలమవుతున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.**

రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా నేరాల రేటు దారుణంగా నమోదవుతున్నట్టు జాతీయనేర గణాంకాలు, రాష్ట్ర పోలీసు నివేదికలు స్పష్టంచేస్తు న్నాయి. రాష్ట్ర పోలీస్ శాఖ తాజాగా వెల్లడించిన గణాంకాల ప్రకారం.. జూలై 2023–జూలై 2026 మధ్య నేరాల రేటు భారీగా నమోదైంది. జూలై 2023 నుంచి జూన్ 2024 వరకు 2,65,377 నేరాలు నమోదుకాగా, జూలై 2024 నుంచి జూన్ 2025 వరకు 2,77,938 నేరాలు నమోదయ్యాయి. 2023తో పోల్చితే 2024 లో అధికంగా...అంటే.. 12,516 (4.73 శాతం) నేరాల పెరుగుదల నమోదైంది. జూలై 2025–జూన్ 2026 మధ్యం 2,84,363 నేరాలు నమోదైనట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఈ సంవత్సర కాలంలో 6,425 (2.31 శాతం) నేరాల పెరుగుదల కనిపించింది. మూడేండ్లలో 7.15% నేరాలు పెరగడం ఆందోళనకరమైన స్థాయిగా చెబుతున్నారు విశ్లేషకులు. లక్ష జనాభాకు నమోదయ్యే సగటు నేరాల రేటు కూడా 481.58 నుంచి 491.59కు పెరిగింది. హోంమంత్రిత్వ శాఖను కూడా తమ అధీనంలో ఉంచుకొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరాల కట్టడిలో విఫలమవుతున్నారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**46 శాతం మాదక ద్రవ్యాలు**

రాష్ట్రంలో నార్కోటిక్ కేసుల పెరుగుదల పోలీసు శాఖకు అతిపెద్ద సవాలుగా మారింది. 2023–24లో 2,026గా ఉన్న మాదక ద్రవ్యాల (డ్రగ్స్) కేసులు 2025–26 నాటికి 2,960కు చేరాయి. మూడేళ్ల ఇది 46.10 శాతం పెరుగుదలగా చెప్పుకోవచ్చు. లక్ష జనాభాకు డ్రగ్స్ నేరాల రేటు 3.68 నుంచి 5.12కు ఎగబాకింది. కమిషనరేట్ల వారీగా చూస్తే సైబరాబాద్‌లో 266 నుంచి 508కు కేసులు చేరి 90.98 శాతం పెరిగాయి. వరంగల్‌లో 142.31 శాతం పెరుగుదల నమోదైంది. జిల్లాల్లో ఆదిలాబాద్‌లో 57 నుంచి 219కు కేసులు పెరిగి,. నేరాల రేటు 7.22 నుంచి 26.91కు చేరింది. నిజామాబాద్‌లో 62 నుంచి 123కు చేరింది., నారాయణపేట, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల్లోనూ డ్రగ్స్ కేసులు గణనీయంగా పెరిగాయి. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సరఫరా వ్యవస్థను అడ్డుకోవాలని, ప్రత్యేక నిఘా పెంచాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు.

**వెయ్యి శాతానికి వ్యవస్థీకృత నేరాలు**

వ్యవస్థీకృత నేరాల పెరుగుదల అత్యంత దిగ్భ్రాంతికరమైన అంశం. ఇవి 25 నుంచి ఏకంగా 451కు చేరి, 1,704 శాతం ఎక్కువగా నమోదయ్యాయి. దీంతోపాటు ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు (9.48 శాతం) పెరిగాయి. సైబరాబాద్‌లో ట్రాఫిక్ కేసులు 2,882 నుంచి 3,677కు, మల్కాజిగిరిలో 3,213 నుంచి 3,673కు చేరాయి.

హైదరాబాద్‌లో స్వల్ప తగ్గుదల కనిపించగా, వరంగల్‌లో 8.27 శాతం తగ్గింది. జిల్లాల్లో కొమురం భీం ఆసిఫాబాద్‌లోఈ తరహా నేరాలు ఏకంగా 154 నుంచి 1,115కు ( 624.03 శాతం) నమోదయ్యాయి. నిర్మల్‌లో 67.92 శాతం, నల్గొండలో 34.37 శాతం, ఆదిలాబాద్‌లో 28.30 శాతం పెరిగాయి. భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, వికారాబాద్‌లలో మాత్రం తగ్గుదల నమోదైంది.

**సైబర్, ఆర్థిక నేరాల్లో ఊరట**

మొత్తం నేరాల సంఖ్య పెరిగినప్పటికీ సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గుదల కాస్త ఊరటనిస్తోంది. సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు తగ్గి 13.29 శాతం తక్కువగా నమోదయ్యాయి. ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు తగ్గి 13.28 శాతం తగ్గుదల నమోదైంది. ఈ రెండు విభాగాల్లోనూ మూడేండ్ల కాలంలో స్థిరమైన

# రంగా నేరాల రేటు...



డీజీపీ సీవీ ఆనంద్

తగ్గుదల కనిపించడాన్ని పోలీసు శాఖ సానుకూల పరిణామంగా భావిస్తోంది.

**తీవ్ర నేరాల్లో 10.33% తగ్గుదల**

గ్రేవ్ క్రైమ్‌గా పరిగణించే తీవ్ర నేరాలు గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. 2024-25లో 7,019 కేసులు నమోదుకాగా, 2025-26లో 6,294కు తగ్గాయి. ఏడాది వ్యవధిలో ఇది 10.33 శాతం తగ్గుదలగా నమోద య్యింది. లక్ష జనాభాకు నేరాల రేటు 11.21 నుంచి 10.88కు దిగివచ్చింది. హైదరాబాద్‌లో 1,483 నుంచి 1,094కు తగ్గి 26.23 శాతం క్షీణత నమోదైంది. సైబరాబాద్‌లో 656 నుంచి 613కు, మల్కాజిగిరిలో 664 నుంచి 549కు తగ్గాయి. అయితే ములుగులో 44 నుంచి 88కు, నిర్మల్‌లో 66 నుంచి 102కు, ఆదిలాబాద్‌లో 96 నుంచి 140కు తీవ్ర నేరాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. చిన్న, గిరిజన జిల్లాల్లో పెరుగుతున్న ఈ ధోరణిపై ప్రత్యేక దృష్టి అవసరమని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**సాధారణ నేరాల్లో 7.28% పెరుగుదల**

తీవ్ర నేరాలు తగ్గుతున్నా నాన్ గ్రేవ్‌గా చెప్పుకునే సాధారణ నేరాలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. 2023-24లో 2,59,201గా ఉన్న కేసులు 2025-26లో 2,78,069కు చేరాయి. మూడేండ్లలో ఇది 7.28 శాతం పెరుగుదల. ఫ్యూచర్‌సిటీలో 23.70 శాతం, సైబరాబాద్‌లో 17.32 శాతం, మల్కాజి గిరిలో 13.53 శాతం పెరుగుదల నమోదైంది. హైదరాబాద్‌లో మాత్రం 2.77 శాతం తగ్గుదల కనిపించింది. జిల్లాల్లో కొమురం భీం ఆసిఫాబాద్‌లో 70.88 శాతం, ఆదిలాబాద్‌లో 60.71 శాతం పెరుగుదల నమోదవగా, మెదక్, సంగారెడ్డి, నల్గొండ, నారాయణపేట జిల్లాల్లోనూ సాధారణ నేరాలు పెరిగాయి.

**మహిళలు, చిన్నారులపై తగ్గిన నేరాలు**

అయితే, మహిళలు, చిన్నారులపై నేరాల్లో తగ్గుదల కనిపించింది. దీనిని కూడా ఊరటనిచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. 2024-25లో ఈ తరహా నేరాలు 31,593గా ఉండగా 2025-26లో 31,108కు తగ్గాయి. ఏడాదిలో 1.54 శాతం క్షీణత నమోదైనప్పటికీ, 2023-24తో పోలిస్తే ఇవి 3.81 శాతం ఎక్కువగానే ఉన్నాయి. హైదరాబాద్, సైబరాబాద్, వరంగల్ కమిషనరేట్లలో కేసులు తగ్గగా, ఫ్యూచర్‌సిటీలో 790 నుంచి 994కు పెరిగాయి. ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబాబాద్, నారాయణ పేట, ములుగు జిల్లాల్లో ఈ నేరాలు పెరిగినట్టు గణాంకాలు వెల్లడించాయి.

**లోతైన విశ్లేషణతోనే కట్టడి:డీజీపీ**

నేరాల సమీక్షను కేవలం సంఖ్యలకే పరిమితం చేయకుండా, ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల తీరు, దర్యాప్తు నాణ్యత, కేసుల పరిష్కారాన్ని లోతుగా విశ్లేషించాలని డీజీపీ సీవీ ఆనంద్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ,నెలవారీ క్రైమ్ రివ్యూలకు ప్రాధాన్యం ఇవ్వాలని, యూనిట్ స్థాయిలో జవాబు దారీతనం, వేగవంతమైన నిర్ణయాలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తప్పనిసరి చేయాలని ఆదేశించారు. గతంలో 70 నుంచి 80 శాతంగా ఉన్న సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్ ఇప్పుడు 96 శాతానికి చేరడాన్ని ఆయన అభినందించారు. ఏఐ ఆధారిత పోలీసింగ్, సీసీటీఎన్ఎస్, టీజీ-కాప్, హాక్ఐ, ఈగల్, ఐసీజేఎస్ వంటి డిజిటల్ వ్యవస్థల పనితీరుపైనా సమీక్షించారు. కొత్త నేర చట్టాల అమలు, ఫోరెన్సిక్ ల్యాబ్ పనితీరు, పోలీసు గృహ నిర్మాణ ప్రాజెక్టులు, లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసం వంటి అంశాలపైనా చర్చించారు. యువ ఐపీఎస్ అధికారులు తమ యూనిట్లలో చేపట్టిన నూతన ఆవిష్కరణలను గురించి వివరించారు.

మొత్తంగా చూస్తే, తీవ్ర నేరాలు, సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గుదల కొంత ఊరటనిస్తున్నా.. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలు, సాధారణ నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనల్లో పెరుగుదల రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి కొత్త సవాళ్లు విసురుతోంది. అయితే, వీటికి టెక్నాలజీ సాయంతో కళ్లెం వేయాల్సిన అవసరం ఉందని డీజీపీ సీవీ ఆనంద్.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల, అన్ని ప్రాంతాల పోలీసు అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సాంకేతికత వినియోగం, డేటా విశ్లేషణ, క్షేత్రస్థాయి పర్యవేక్షణతో నేరాల కట్టడి సాధ్యమని స్పష్టం చేశారు.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068



"భయపడకే. పోలీసులు ఆ నక్సలైట్లను ఏటీ సెయ్యలేక మన మీద పడతన్నారు. పోలీసులకు సెప్పకూడదనీ నక్సలైట్లు, ఆళ్లెక్కడున్నారో సెప్పమనీ పోలీసులు మనల్ని యేపుకు తింటన్నారు. ఈళ్లిద్దరి మధ్య మనం నలిగిపోతన్నాం. మళ్లీ ఇద్దరూ మేం గిరిజనుల గురించే పోట్లాడుతున్నామంటారు. కానీ జరుగుతున్నదేటి? నక్సలైట్లు చంపెత్తారని ఒక్క ఉద్యోగి కూడా మన కొండల్లో పని చెయ్యడానికి రావటం నేదు'' అన్నాడు సోమన్న భార్యను అనునయిస్తూ.

ఆళ్ల వల్ల మనం సచ్చిపోతన్నాము. ఇప్పటికే ఈ పోలీసుల బాధ పడలేక మనోళ్లు ఎంతోమంది అన్నల్లో చేరిపోతున్నారు. మరేటి సేత్తారు. నేకపోతే... నక్సలైట్లు పోలీసులోళ్లని ఎక్కడ, ఎప్పుడు సంపినా మనల్నే పట్టుకుపోతన్నారు ఈ పోలీసులు" అన్నాడు కోపంగా.

"మరిప్పుడేటి సేత్తావు? పోలీసులకు లొంగి పోతావా?" అడిగింది ధరణి.

"నేదే! నొంగిపోతే నన్ను పిట్టని కాల్చినట్టు కాల్చెత్తారు. అసలే మనోళ్లు ఆరుగురు పోలీసోళ్లని, ఆ ఎస్సై రంగారావును సంపేసినారు. ఆ కోపంతో వాళ్లు ఉడికిపోతన్నారు. ఇప్పుడు దొరికితే నా శవాన్ని కూడా ఆనవాళ్లు లేకుండా సేసేత్తారు" అన్నాడు సోమన్న.

"మరైతే ఎక్కడికెళతావు? మనకేటి ఈ కట్టాలు?" అంది ఏడుస్తూ ధరణి.

* * *

"మావా! మేట్టూరు బాబుతో నేను సెబుతాను. అతను సెబితే పోలీసులు ఇంతారు. నువ్వు లొంగిపోతే మంచిదేమో" అంది ధరణి.

"ఇప్పుడయన్నీ అయ్యేవి కావే. కొన్నాళ్లకు ఇవన్నీ సద్దుమణిగితే అప్పుడు సెప్పొచ్చు. ఇప్పుడు ఎవురు సెప్పినా ఆ పోలీసులు ఇనరు" అన్నాడు సోమన్న.

"మావా? మళ్లీ ఎప్పుడొత్తావు? డబ్బులు నేవు. బయటకెళ్లాలంటే పోలీసుల బయం. రెండు రోజులైంది మా అక్క దగ్గర భోజనం సేత్తన్నాను." చెప్పింది ధరణి.

"భయపడకే. అన్నిటికీ ఆ మరిడమ్మే ఉంది. ఎర్రకొండ మీద గూడెంలో నక్సలైట్లున్నారు. ఆళ్లని కలిసి మన బాధలు సెబుతాను. ఇప్పుడు ఆళ్లే ఏదో ఒకటి చెయ్యగలరు. అన్నీ బాగుంటే పదిరోజుల్లో తిరిగొత్తాను నేను వొచ్చినా రాకపోయినా పిల్లని మాత్రం జాగ్రత్త. బయటకు ఎక్కడికీ ఎల్లకు. నేనెక్కడున్నా మీరు మాత్రం జాగ్రత్తగా ఉండాల" అన్నాడు సోమన్న చెమర్చిన కళ్లను తుడుచుకుంటూ.

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**





# ఏ వెలుగులకీ ప్రస్థానం? 5

"మావా! అన్నల్ని కలిస్తే ప్రమాదమేమో? ఆ యిసయం పోలీసోళ్లకు తెలిస్తే ఊరుకుంతారా సెప్పు?" అంది.

"తప్పదే నాకు యింకో దారి నేదు. అన్నిటికీ ఆ దేవుడే ఉన్నాడు'' అంటూ ధరణిని గట్టిగా కావలించుకొని ఆ తరువాత పెరట్లోంచి వెళ్లి పోయాడు.

వెళుతున్న అతడిని ధరణి బాధగా చూడసాగింది. అతను మళ్లీ ఎప్పుడొస్తాడోనన్న బాధ ఆమె ముఖంలో కనిపిస్తోంది. అలా వెళుతూ అతను చీకట్లో కలిసిపోయాడు.

* * *

ఆ మర్నాడు మరికొన్ని పోలీసు బలగాలు మన్యంలో దిగాయి. పోలీసు స్టేషన్ని ముట్టడించి ఆరుగురు పోలీసులను, ఎస్సై రంగారావుని చంపిన వాళ్ల కోసం పోలీసుల వేట ముమ్మరం అయింది.

ప్రతీ గూడెం మీద దాడిచేసి యువకులను అరెస్ట్ చెయ్యడం మొదలు పెట్టారు. దాడిలో ఇంకెవరు ఉన్నారంటూ ప్రశ్నిస్తూ హింసించడం మొదలు పెట్టారు.

ఈ విషయం నాకు తెలిసి ధరణితో చెప్పాను. ఎందుకంటే..ఒక పోలీసు కానిస్టేబుల్ కెంగువ గ్రామం వచ్చి ధరణిని అరెస్ట్ చేస్తామని నాతో అన్నాడు. ధరణిని అరెస్ట్ చేస్తే ఆ దాడిలో పాల్గొన్న వాళ్లను గురించి తెలుస్తుందని పోలీసుల ఆలోచన. అందుకే ఆ రాత్రి నేను ధరణి ఇంటికి వెళ్లి ఆమెను హెచ్చరించాను.

"ధరణీ! నీ గురించి పోలీసులు వెతుకుతున్నారు. బహుశా నేడో, రేపో వచ్చి నిన్ను అరెస్ట్ చేయవచ్చు. చాలా పోలీసు బలగాలొచ్చాయి. ఈసారి వాళ్లను ఎదిరించటం కష్టం. పైగా ప్రమాదం కూడా! ఎందుకంటే గ్రేహౌండ్స్ దళాలు వచ్చాయి. కాబట్టి నువ్వు జాగ్రత్తగా ఉండు" అని చెప్పాను.

"మేట్టారు బాబూ! ఇప్పుడు నేనేటి సెయ్యాలి? ఉజ్జోగానికెళ్లకపోతే జీతం రాదు.మా మావ కూడా ఎక్కడికో ఎల్లిపోయాడు. ఎప్పుడొత్తాడో తెలియదు. చూస్తే చిన్నపిల్ల. పోలీసులు నన్ను అరెస్ట్ చేస్తే ఈ పిల్ల గతేటి కాను? మా అక్క గౌరి నన్ను ఎన్నాళ్లు సూత్తాది సెప్పండి?" అంది ఏడుస్తూ.

"తప్పదు ధరణీ! నువ్వు నీ పిల్లని తీసుకొని ఇంకెక్కడికైనా కొన్నాళ్లపాటు వెళ్లిపో. కొన్ని రోజులు పోతే ఈ అలజడి తగ్గుతుంది. ఇప్పుడైతే పోలీసులు మీద చాలా కోపంగా ఉన్నారు. ఇప్పుడు వాళ్లను ఎదిరించి మీరేమి చెయ్యలేరు " అన్నాను.

ఇంతలో అక్కడికి గౌరి వచ్చింది.

'గౌరీ! చెల్లెలు ధరణి జాగ్రత్త. పోలీసులు అన్ని ఊళ్లనూ జల్లెడ పడుతున్నారు. ఇప్పుడు దొరికిందో పరిస్థితి మన చెయ్యి దాటిపోతుంది"అన్నాను.

"నాకు అదే బాధగా ఉంది బాబూ! ఓ పక్క దాని మొగుడు కూడా లేడు. ఇప్పుడు దీన్నెక్కడుంచాలి?పైగా దానికి చిన్నపిల్ల? మా చెడ్డ ఘోరం జరిగింది " అంది గౌరి.

"పిల్లను నీ దగ్గరే ఉంచుకొని. ధరణిని కొన్నాళ్ల పాటు మీ చుట్టాలింటికి పంపు. పరిస్థితులు సద్దుమణిగితే మళ్లీ వస్తుంది" సలహాలాంటిది ఇచ్చాను.

"మాస్టారు బాబూ! ఈ నక్సలైట్లు, పోలీసోళ్ల వల్ల మాకేటీ లాభం చెప్పండి? ఆళ్ల గొడవల్లో మేము నలిగిపోతున్నాము. నక్సలైట్లు మా కోసం పోరాడుతున్నామంతారు. పోలీసులు కూడా మా గురించే నక్సలైట్లతో యుద్ధం చేస్తున్నామంతారు. కానీ ఈళిద్దరి వల్లా మేము నట్టపోతున్నాము.

ఈళ్ల గొడవల వల్ల మా వూళ్లోని కుర్రోళ్లంతా ఎక్కడికో పారిపోనారు. ఊళ్లో ఒక్క గుంటడూ నేడు. కొందరు నక్సలైట్లలో కలిసిపోయారు. ఇలాగే పోలీసోళ్లు మమ్మల్ని అల్లరి పెడితే అందరూ అన్నల్లో కలిసి పోవడం ఖాయం" అంది ఏడుస్తూ గౌరి.

ఆ మర్నాడు పోలీసుల కూంబింగ్ మొదలైంది. గ్రేహౌండ్స్ దళాలు నక్సలైట్ల స్థావరాలపై దాడులు మొదలు పెట్టాయి. ఈసారి వాళ్లు వ్యానులు గానీ, బస్సులు గానీ వాడటం లేదు. వాడితే వాటిని పేల్చేస్తారనీ పోలీసుల భయం.

రెండు రోజుల తరువాత పోలీసులు ఒక నక్సల్స్ స్థావరం మీద దాడి చేసారు.అప్పుడు జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు నక్సల్స్, ముగ్గురు పోలీసులు చనిపోయారు. మిగతా నక్సలైట్లు పారిపోయారు.

ఒక పోలీసొచ్చి ఎస్సై గారు నన్ను స్టేషన్కి రమ్మన్నారనీ చెప్పాడు.

నన్నెందుకు పిలిచారోనన్న సందేహం నాకు కలిగింది. పోలీసుల దృష్టిలో పడటం మంచిది కాదు. వాళ్లకి గానీ అనుమానం వచ్చిందో అది పోదు. ఇంక ప్రతి కేసులో మనల్ని పిలుస్తుంటారు.

నేను స్టేషన్కి వెళ్లేసరికి కొత్తగా వచ్చిన ఎస్సై రవీంద్ర ఉన్నాడు.

"శ్రీధర్ గారూ! మీరు టీచరుగా పనిచేస్తున్న కెంగువ గ్రామంలోనే నక్సల్స్ కదలికలు ఎక్కువగా ఉన్నాయి. ఆ ఊరి యువకులే నక్సలైట్లకి మా పోలీసు బస్సు గురించి చెప్పడంవల్ల వాళ్లు దాన్ని బ్లాస్ట్ చేసారు. వాళ్లలో ముఖ్యుడు సోమన్న. వాడివల్లే



గన్నవరపు నరసింహామూర్తి

ఇదంతా జరిగింది. ఇప్పుడు వాడు ఎక్కడున్నాడో తెలియదు. మిమ్మల్ని ఎందుకు పిలిపించానంటే... వాడి ఆచూకీ మీకు తెలిస్తే చెప్పండి. మీరు చెప్పారని ఎవ్వరితోనూ చెప్పను"అన్నాడు రవీంద్ర.

“ఇనస్పెక్టర్ గారూ! నేను ఆ ఊరికి టీచరుగా వచ్చి ఆరునెలలైంది. నాకు ఆ ఊళ్లో ఎవ్వరూ పెద్దగా తెలియదు. నేను ఆ స్కూల్లో ఒంటరిగా ఉంటున్నాను. ఆ యువకులు ఎవరో... సోమన్న ఎవరో నాకు ఎలా తెలుస్తుంది చెప్పండి? కాకపోతే గౌరి అనే నర్సు, ధరణి అనే అంగన్‌వాడి టీచరు నాకు తెలుసు. ఆ ధరణి మొగుడే సోమన్న అని కూడా తెలుసు. అంతే తప్ప ఆ ఊరి యువకుల గురించి కానీ, నక్సలైట్ల గురించి కానీ ఏమీ తెలియదు. కాకపోతే ఒకటి మాత్రం చెప్పగలను. నేను ఎమ్.ఏ. బీఈడీ చదివి ఏజన్సీ ప్రాంతంలోని స్కూల్లో టీచరుగా చేరడానికి కారణం.. పేదవారు, అమాయకులు, ఏ అభివృద్ధికీ నోచుకోని గిరిజనుల పిల్లలకు చదువు చెప్పాలనే ..

కానీ ఇక్కడి పరిస్థితి నేనూహించిన దానికి భిన్నంగా ఉంది. గిరిజనులకు మేలు చేస్తున్నామనీ నక్సలైట్లు, నక్సలైట్లు సంఘ విద్రోహశక్తులనీ మీ పోలీసులు భావించుకుంటూ... ఒకరి మీద ఒకరు దాడులు చేసుకుంటూ ఈ ఏజన్సీ ప్రాంతాన్ని యుద్ధం భూమిగా మార్చేశారు.

అందుకే ఈ ప్రాంతంలో పనిచెయ్యడానికి ఏ ఒక్క ఉపాధ్యాయుడు గానీ , డాక్టరు గానీ ముందుకు రావటం లేదు. అందువల్లే స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలైనా ఈ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఏ ఊరికి రహదారి సౌకర్యాలు లేవు. తాగడానికి గెడ్డ నీరే వాళ్లకు ఆధారం. అనారోగ్యం చేస్తే రోగిని మంచం మీద పడకోబెట్టి డోలీల్లో తీసుకెళ్లవలసిందే.

ఒక పక్క దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందనీ చెబుతున్న ప్రభుత్వాలు ఈ ఏజన్సీ ప్రాంతం వెనకబాటు గురించి ఆలోచించదు. కేవలం నగరాలు, పట్నాలు మాత్రం అభివృద్ధి చెందితే సరిపోదు. ప్రతీ పల్లె, ప్రతీ గిరిజన తండా అభివృద్ధి చెందాలి. పట్నంలోని ప్రతీ పౌరుడూ పొందుతున్న అన్ని సేవలూ వాళ్లకి అంది తీరాలి. అప్పుడే అభివృద్ధి చెందినట్లు. మీరు..మిమ్మల్ని చంపుతున్న నక్సలైట్లను కాకుండా అమాయకులైన గిరిజనులను హింసిస్తున్నారు. దానివల్ల ఈ గిరిజన గ్రామాల్లో యువకులు భయపడి ఎక్కడికో వెళ్లిపోతున్నారు. కొందరు నక్సలైట్లలో కలిసిపోతున్నారు.

ఒక విధంగా మీ వల్లే.. వాళ్లు అలా తయారవుతున్నారు. ఇంకా చెప్పాలంటే వాళ్ల వైపు నెట్టబడుతున్నారు" అన్నాను ఆవేశంగా.

నా మాటలు ఆ ఇనస్పెక్టర్ మీద బాగా ప్రభావం చూపినట్లున్నాయి.

అతను లేచి నిలబడి “సారీ మిస్టర్ శ్రీధర్!



**బాబూ! ఈ చిన్నపిల్లతో ఎక్కడికి వెళ్లిపోగలను సెప్పండి? నాకా ఎవరూ నేరు. మా అత్త మామల్ది ఈ ఊరే. మేమిద్దరం ఇష్టపడి మనువాడు కున్నాము. కష్టపడి బతకుతున్నాము. మా మానాన మేము బతుకుతుంటే ఆ దేవుడు ఈ కట్టాలు మాకిచ్చాడు. నేను పిల్లతో బయటకు వెళితే దానికి పెమాదం. అలా అనీ ఇక్కడే ఉండిపోతే నన్ను బతకనివ్వరు ఆ పోలీసోళ్లు.**

ప్రభుత్వం, పోలీసులు, అభివృద్ధి, పేదరికం, హింస ఇవన్నీ ఒకదానికొకటి ఇంటర్ లింక్. అభివృద్ధి జరిగితే పేదరికం పోతుందన్నది ప్రభుత్వాల భావన. కానీ అభివృద్ధి వల్ల బాగుపడేది ధనికవర్గాలే అన్నది నక్సలైట్ల వాదన.

దేశంలో 80 శాతం సంపద కేవలం ఒక్క శాతం ఉన్న ధనవంతుల దగ్గర ఉంది. ధనవంతులున్న చోట దోపిడీ జరుగుతుంది. దానివల్ల పేదలు నష్టపోతారు. అప్పుడు నక్సల్స్ రూపంలో ఉద్యమాలు పుట్టుకొచ్చి హింస చెలరేగుతుంది.

ఇదంతా ఒక వలయం. మేము ఇందులో చిక్కుకున్నాము. బయటపడటం కష్టం. బయట పడాలంటే ఒకటే మార్గం. ఉద్యోగాన్ని వదిలేసి నక్సలైటుగా మారటం. అప్పుడు కూడా మళ్లీ పోరాటం చెయ్యవలసిందే. నక్సలైట్లు,పోలీసుల యుద్ధం 'కేట్ రేట్ రేస్' లాంటిది. ఈ పిల్లీఎలకల పోరాటంలో నలిగిపోయేది పేద గిరిజనులే. దయచేసి ఇక్కడ నుండి త్వరగా బదిలీ చేయించుకొని వెళ్లి పోండి. లేకపోతే మీరు కూడా ఈ ఊబిలో కూరుకుపోతారు" చెప్పాడు ఎస్సై రవీంద్ర.

**“రాతి గుహలు పాలరాతి భవనాలైనా**
**అడవి బతుకు మారిందా ఎన్ని యుగాలైనా?**
**అడవిలో సింహాన్ని బోనులో పెడితే**
**అది మృగరాజు అవుతుందా ?**
**పేదలపై ధనికుల దమనకాండ**
**శతాబ్దాలు చదవలేదా ఈ అరణ్య కాండ”** అనీ నేనెప్పుడో రాసుకున్న గీతం గుర్తు కొచ్చింది నాకు రవీంద్ర మాటలు విన్న తరువాత.

రవీంద్ర మాట్లాడి కెంగువ వచ్చేసాను.

ఆ రాత్రి 9 గంటలప్పుడు కూతురు వనజని ఎత్తుకొని నా దగ్గరికి వచ్చింది ధరణి. అంత రాత్రప్పుడు వచ్చిన ఆమెని చూసి నేను ఆశ్చర్యపోయాను.

“మాట్టారు గారూ! పోలీసులు నన్ను చాలా ఇబ్బంది పెడుతునారు. మా మావ గురించి చెప్పమనీ వేధిస్తున్నారు. నాకు తెలీదని సెప్పినా ఆళ్లు వినటం లేదు. చెప్పకపోతే నన్ను, నా పిల్లనూ చంపేస్తామనీ బెదిరి స్తున్నారు. ఏటి చెయ్యాలో అర్థం కావటం లేదు"అంది ఏడుస్తూ.

“ధరణీ! మీ మావ సోమన్న ఎందుకు తప్పించుకొనీ తిరుగుతున్నాడు? తను తప్పు చెయ్యనప్పుడు తప్పించుకు తిరగవలసిన అవసరం ఏముంది? అతను భయపడి పారిపోవడం వల్లే ఈ సమస్యలు వస్తున్నాయి” అన్నాను.

“బాబూ! ఆడెక్కడున్నాడో నాకు తెలియదు. మొన్న రాత్రి నన్ను సూడ్డానికి వొచ్చి ఎల్లిపోయాడు. ఆడు ఏ తప్పు చెయ్యనేదు. పోలీసులు అనవసరంగా ఆడిని అనుమానిస్తున్నారు. ఆదే అన్నలకు పోలీసోళ్ల గురించి చెప్పాడనీ ఆళ్ల అనుమానం. ఒకవేళ మా మావ దొరికితే ఆళ్లు సంపేత్తారు. అందుకే భయపడి పారిపోయాడు” అంది కళ్లు తుడుచుకుంటూ.

“మరిప్పుడేం చేస్తావు? పోలీసులు ఈ రోజు నన్ను పిలిచి సోమన్న గురించి అడిగేరు. నాకు తెలియదని చెప్పినా వాళ్లు నమ్మడం లేదు. నువ్వు మాత్రం కొన్నాళ్ల పాటు జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే ఇబ్బందుల్లో పడతావు” అన్నాను.

“బాబూ! ఈ చిన్నపిల్లతో ఎక్కడికి వెళ్లిపోగలను సెప్పండి? నాకా ఎవరూ నేరు. మా అత్త మామల్ది ఈ ఊరే. మేమిద్దరం ఇష్టపడి మనువాడుకున్నాము. కష్టపడి బతకుతున్నాము. మా మానాన మేము బతుకుతుంటే ఆ దేవుడు ఈ కట్టాలు మాకిచ్చాడు. నేను పిల్లతో బయటకు వెళితే దానికి పెమాదం. అలా అనీ ఇక్కడే ఉండిపోతే నన్ను బతకనివ్వరు ఆ పోలీసోళ్లు. ఆణ్ణి వాళ్లు తకినిచ్చేలా లేరు. ఇప్పుడు నేనేటి సెయ్యాలి“ అంది ఏడుస్తూ.

“ఊరుకో ధరణీ! పోలీసులకూ, నక్సలైట్లకూ మధ్య మీరు నలిగిపోతునారు. సమిధలుగా మారిపోతునారు. ఇంతకన్నా నీకేం చెప్పాలో తెలియటం లేదు. పోలీసులు కేవలం ఉద్యోగస్తులు. వాళ్ల డ్యూటీ వాళ్లు చెయ్యక తప్పదు. తుపాకీ చేత పట్టుకుంటే ప్రభుత్వాలు ఊరుకోవు. ఏదైనా చట్ట ప్రకారం మాత్రమే పోరాడాలి. మీరు ఆ నక్సలైట్లకు ఆశ్రయం ఇస్తున్నారనీ పోలీసుల అనుమానం. అది నిజం కాదని మనం చెప్పినా వాళ్లు నమ్మరు. ఈ పోరాటం ఇప్పట్లో ఆగేలా లేదు. దీనివల్ల ఎంతమందో పోలీసులు, మరెంతమందో నక్సలైట్లు, వాళ్ల మధ్య సమిధల్లా గిరిజనులూ చనిపోయారు. చనిపోతున్నారుకూడా. ఈ కొండల్లో ఈ అగ్గి ఇప్పట్లో ఆరేటట్టు లేదు. నువ్వు జాగ్రత్తగా ఉండు. పోలీసులకు దొరికితే ప్రమాదం. అర్ధరాత్రి అయింది. వెళ్లిపో” అన్నాను ధరణితో.

ఆమర్నాడు సాయంత్రం నేను స్కూల్లో ఉన్నప్పుడు ధరణి అక్క గౌరి వచ్చింది. **(సశేషం)**


SURYA
Shaping Structures That Shape Tomorrow
Steel is what turns plans into lasting structures. Surya provides high-quality steel solutions that support construction, infrastructure, and development. Engineered for strength and consistency, they help projects move forward with confidence.
Because the future is built on what holds firm today.
PRAKASH
SURYA
SURYA HAI TOH BHAROSA HAI
Lighting | Wires and Cables | Professional Lighting | Fans | Appliances | Water Pumps | PVC and Water Tanks | Steel Pipes
I am SURYA
50 YEARS OF TRUST
DURABLE PRODUCTS
ASSURED QUALITY
SURYA ROSHNI LIMITED | consumercare@surya.in | www.surya.co.in |
TOLL FREE
1800 102 5657




# విద్యార్థుల నెత్తి ట్రంప్ వీసా

**అమెరికా ప్రభుత్వం ఇటీవల వీసా నిబంధనలను కఠినతరం చేస్తూ, ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్ మెంట్లను తాత్కాలికంగా నిలిపివేసింది. గ్లోబల్ ట్రైనింగ్ ఇనిషియేటివ్ పేరుతో కాన్సులార్ అధికారులకు కఠినమైన స్క్రీనింగ్, వెరిఫికేషన్ పద్ధతులపై శిక్షణ ఇవ్వడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. అమెరికాకు వెళ్లే అంతర్జాతీయ విద్యార్థులలోనూ, అక్కడ పనిచేసే ఉద్యోగులలోనూ అత్యధిక శాతం ఉన్న భారతీయులపై ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది.**

అమెరికా కొత్తగా తీసుకొస్తున్న 'ఫిక్స్‌డ్ టర్మ్ వీసా' నిబంధనలు విద్యార్థులకు పెద్ద సవాలుగా మారాయి. ఇప్పటికే ఇంటర్వ్యూలు షెడ్యూల్ అయిన చాలామంది విద్యార్థుల అపాయింట్‌మెంట్లు రద్దయ్యాయి. శిక్షణ పూర్తయ్యాకే మళ్లీ కొత్త తేదీలను కేటాయిస్తారు, దీనివల్ల ప్రవేశాలు ఆలస్యం కానున్నాయి. గతంలో కోర్సు ఉన్నంతకాలం అమెరికాలో ఉండే అవకాశం ఉండేది. కానీ తాజా నిబంధనల ప్రకారం మాత్రమే వీసా కాలపరిమితి గరిష్టంగా 4 ఏళ్లు ఉంటుంది. కోర్సు పొడిగించుకోవాలంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం వెతుక్కోవడానికి లేదా స్వదేశం తిరిగి రావడానికి ఇచ్చే గ్రేస్ పీరియడ్ను 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించారు. విద్యార్థుల వీసాలను మంజూరు చేసే ముందు వారి సోషల్ మీడియా ఖాతాలను, నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ అనిశ్చితి, వీసా తిరస్కరణల భయం కారణంగా ఇప్పటికే 2026-27 విద్యాసంవత్సరానికి అమెరికా కాలేజీలకు దరఖాస్తు చేసుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య 15% మేర తగ్గడం గమనార్హం.

**డ్రాప్ బాక్స్ సదుపాయంలో కోత**

ఈ తాత్కాలిక నిలిపివేత, కఠినమైన స్క్రీనింగ్ ప్రక్రియ ఉద్యోగులపై కూడా ప్రభావం చూపుతోంది. అమెరికా వచ్చే అభ్యర్థులు అక్కడ ప్రభుత్వ ప్రయోజనాలపై ఆధారపడకుండా, సొంతంగా ఆర్థిక స్థిరత్వం కలిగి ఉన్నారా? లేదా? అని అధికారులు కఠినంగా తనిఖీ చేస్తున్నారు. గతంలో వీసా పునరుద్ధరణ కోసం ఉన్న డ్రాప్ బాక్స్(ఇంటర్వ్యూ లేకుండానే వీసా ఇచ్చే ప్రక్రియ) సదుపాయాన్ని చాలా వరకు తగ్గించారు. దీనివల్ల ప్రతి ఒక్కరూ ఇన్-పర్సన్ (ప్రత్యక్ష) ఇంటర్వ్యూకి హాజరు కావాల్సి వస్తోంది, ఇది వీసా ప్రాసెసింగ్ సమయాన్ని మరింతగా పెంచుతోంది. ఇప్పటికే గ్రీన్‌కార్డ్ కోసం వేచి చూస్తున్న భారతీయ ఐటీ నిపుణులకు ఈ అపాయింట్‌మెంట్ల నిలిపివేత, కఠిన నిబంధనల వల్ల నిరీక్షణ కాలం మరింత పెరగనుంది.

**విశ్వవిద్యాలయాలపై ప్రతికూల ప్రభావం**

వీసాల నిలిపివేత, కఠిన నిబంధనల రూపంలో ట్రంప్ యంత్రాంగం తీసుకుంటున్న నిర్ణయాలు అమెరికా ఆర్థికవ్యవస్థపై, ముఖ్యంగా అక్కడి విశ్వవిద్యాలయాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. అంతర్జాతీయ విద్యార్థుల రాక తగ్గడం వల్ల అమెరికా బిలియన్ల కొద్దీ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అమెరికాలోని ఉన్నత విద్యాసంస్థలు ఆర్థికంగా అంతర్జాతీయ విద్యార్థులపైనే ఎక్కువగా ఆధారపడతాయి. అమెరికా స్థానిక విద్యార్థులతో పోలిస్తే అంతర్జాతీయ విద్యార్థులు (ముఖ్యంగా భారత్, చైనా దేశాల వారు) 2 నుండి 3 రెట్లు ఎక్కువ ఫీజు చెల్లిస్తారు. వీసాల నిలిపివేత వల్ల కొత్త విద్యార్థుల నమోదు తగ్గడంతో యూనివర్సిటీల ఆదాయం పడిపోతోంది. అంతర్జాతీయ విద్యాసంస్థల నివేదికల ప్రకారం, 2026-27 విద్యాసంవత్సరంలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య దాదాపు 1,11,000 వరకు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల అమెరికా కాలేజీలు, స్థానిక ఆర్థిక వ్యవస్థలు 3.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.28,500 కోట్లు) ఆదాయాన్ని కోల్పోనున్నాయి. అమెరికాలోని సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ (STEM) కోర్సుల్లో రీసెర్చ్ అసిస్టెంట్లుగా, ల్యాబ్‌ల నిర్వహణలో అంతర్జాతీయ విద్యార్థులే కీలక పాత్ర పోషిస్తారు. విద్యార్థులు రాకపోతే యూనివర్సిటీల్లో పరిశోధనలు నిలిచిపోతాయి. పెద్ద ఐవీ లీగ్ కాలేజీలు ఎలాగోలా తట్టుకోగలిగినా, అంతర్జాతీయ విద్యార్థుల ఫీజులపైనే నడిచే ప్రాంతీయ యూనివర్సిటీలు, చిన్న ప్రైవేట్ కాలేజీలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

**అమెరికాలోని ప్రసిద్ధ యూనివర్సిటీల యాజమాన్యాలు, ప్రొఫెసర్లు ఈ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థులు రాకపోతే ఫీజుల రూపంలో వచ్చే బిలియన్ల డాలర్ల ఆదాయం ఆగిపోతుందని, దీనివల్ల కాలేజీలను నడపడం కష్టమవుతుందని ఆందోళన చెందుతున్నారు. 'ఫిక్స్‌డ్ టర్మ్ వీసా' లాంటి నిబంధనలను సవాలు చేస్తూ కొన్ని అమెరికన్ యూనివర్సిటీలు కోర్టులను కూడా ఆశ్రయిస్తున్నాయి.**

**40వేలమంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం**

విద్యార్థులు కేవలం ఫీజులే కాకుండా అమెరికాలో ఉంటూ చేసే ఖర్చులు అక్కడి స్థానిక వ్యాపారాలకు జీవనాడి. అంతర్జాతీయ విద్యార్థుల తగ్గుదల కారణంగా యూనివర్సిటీల్లో నిధుల కొరత ఏర్పడి, అమెరికా వ్యాప్తంగా విద్యారంగం, దానిపై ఆధారపడిన సేవల రంగంలో దాదాపు 40,000 ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. విదేశీ విద్యార్థులు అమెరికాలో ఇళ్లు/అపార్ట్‌మెంట్లు అద్దెకు తీసుకోవడం, సరుకులు, రవాణా, గ్యాడ్జెట్స్ కొనుగోలు చేయడం ద్వారా బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తారు. విద్యార్థులు లేకపోతే కాలేజీలు ఉన్న నగరాల్లోని స్థానిక వ్యాపారాలు నష్టపోతాయి. అమెరికా టెక్నాలజీ రంగం (సిలికాన్ వ్యాలీ) ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులపైనే ఆధారపడుతుంది. కఠిన నిబంధనలు దీర్ఘకాలంలో అమెరికా ఆవిష్కరణల, టెక్ రంగాన్ని వెనక్కి నెట్టేస్తాయి. మొత్తంగా చూస్తే, వలసలను అరికట్టాలనే ట్రంప్ వ్యూహం అమెరికా సొంత విద్యా వ్యవస్థను, ఆర్థిక ప్రగతిని దెబ్బతీసే "సెల్ఫ్ గోల్" లాంటిదని విద్యావేత్తలు, ఆర్థిక నిపుణులు విమర్శిస్తున్నారు.

**ట్రంప్ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు**

ట్రంప్ యంత్రాంగం తీసుకున్న వీసా నిలిపివేత కఠిన నిబంధనల నిర్ణయాల పై అమెరికా ప్రజలలో, వివిధ వర్గాలలో తీవ్రమైన భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ మద్దతుదారులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా, వ్యాపార, విద్యా రంగాలు, హక్కుల సంఘాలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ట్రంప్ రాజకీయ సిద్ధాంతాలను



న

# ‘బాంబు’!!

నమ్మే అమెరికన్లు ఈ కఠిన నిర్ణయాలను సమర్థిస్తున్నారు. విదేశీయులకు వీసాలు తగ్గించడం వల్ల ఐటీ తదితర రంగాలలో స్థానిక అమెరికన్లకే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వీరు నమ్ముతున్నారు. వీసాదారులు అమెరికాకు వచ్చి అక్కడి ప్రభుత్వ ఉచిత సదుపాయాలు, నిధులపై ఆధార పడకుండా నిరోధించడాన్ని వీరు సరైన నిర్ణయంగా చూస్తున్నారు.

**యూనివర్సిటీల ఆగ్రహం**

అమెరికాలోని ప్రసిద్ధ యూనివర్సిటీల యాజమాన్యాలు, ప్రొఫెసర్లు ఈ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థులు రాకపోతే ఫీజుల రూపంలో వచ్చే బిలియన్ల డాలర్ల ఆదాయం ఆగిపోతుందని, దీనివల్ల కాలేజీలను నడపడం కష్టమవుతుందని ఆందోళన చెందుతున్నారు. ‘ఫిక్స్‌డ్ టర్మ్ వీసా’ లాంటి నిబంధనలను సవాలు చేస్తూ కొన్ని అమెరికన్ యూనివర్సిటీలు కోర్టులను కూడా ఆశ్రయిస్తున్నాయి. సిలికాన్ వ్యాలీలోని గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్‌వంటి దిగ్గజ టెక్ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు ఈ ఆంక్షలను తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఫీజులను భారీగా పెంచడం, వీసాలను ఆలస్యం చేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉండే అత్యుత్తమ ప్రతిభావంతులు అమెరికాకు దూరం అవుతారని హెచ్చరిస్తున్నారు. వలసదారుల హక్కుల కోసం పోరాడే అమెరికన్ సంస్థలు ట్రంప్ విధానాలను ఖండిస్తున్నాయి. సాధారణ అమెరికన్ కార్మికులు తమ ఉద్యోగాల రక్షణ కోసం ఈ నిర్ణయాన్ని కొంతవరకు సమర్థిస్తున్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థను నడిపే విద్య, వ్యాపార రంగాలు మాత్రం ట్రంప్ నిర్ణయం వల్ల అమెరికా స్వయంగా నష్టపోతుందని గట్టిగా హెచ్చరిస్తున్నాయి.

**రెండు మిలియన్ ఉద్యోగాలు ఖాళీ**

అమెరికా తన సొంత అవసరాలకు సరిపడా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ గ్రాడ్యుయేట్లను తయారు చేసుకోలేకపోతోంది. అమెరికా తయారీ రంగాలు, డెలాయిట్ నివేదికల ప్రకారం, దేశంలో దాదాపు 3.5 మిలియన స్టెమ్ ఉద్యోగాల అవసరం ఉండగా, సరైన నైపుణ్యాలు లేకపోవడం వల్ల అందులో 2 మిలియన్ల (20 లక్షలు) ఉద్యోగాలు ఖాళీగా ఉండిపోయే ప్రమాదం ఉంది. అమెరికా యూనివర్సిటీలలో కంప్యూటర్ సైన్స్, ఇంజనీరిం గ్, మ్యాథ్స్ విభాగాలలో మాస్టర్స్, పీహెచ్‌డీ చేసే వారిలో 40% పైగా అంతర్జాతీయ విద్యార్థులే ఉం టారు. గతంలో ఒబామా, బైడెన్ ప్రభుత్వాలు అమెరికాలోని ఈ ప్రతిభా కొరతను గుర్తించి భిన్నమైన విధానాలను అనుసరించాయి. విదేశీ విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత అమెరికాలోనే ఉండి 3 సంవత్సరాల పాటు పని చేసుకునేలా నిబంధనలను సరళతరం చేశారు. విదేశీ నిపుణులు సిలికాన్ వ్యాలీలోని గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలలో కీలక ఆవిష్కరణలు చేయడం వల్ల అమెరికాకు భారీగా సంపద, పేటెంట్లు లభించాయి. ట్రంప్ చర్యల వల్ల అమెరికా తన సొంత కాళ్లపై నిలబడటం పక్కన పెడితే, భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తోంది.

**రాబోయే పదేళ్లలో 480బిలియన్ డాలర్ల నష్టం**

కొన్నినివేదికల ప్రకారం, విదేశీ విద్యార్థులు, నిపుణులపై ఆంక్షలు విధించడం వల్ల రాబోయే పదేళ్లలో అమెరికా ఏటా 240 బిలియన్ల నుండి 480 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టాన్ని మూటగట్టు కోనుంది. అమెరికాలో నమోదయ్యే మొత్తం పేటెంట్లలో 36% పేటెంట్లు అంతర్జాతీయ విద్యార్థులు, వలస నిపుణుల ద్వారానే వస్తున్నాయి. వీరు లేకపోతే కొత్త టెక్నాలజీల ఆవిష్కరణలో అమెరికా వెనుకబడి పోతుంది. స్థానిక పాఠశాలల్లో గణితం, సైన్స్ ప్రమాణాలు పడిపోతున్న తరుణంలో, విదేశీ నిపుణులను రాకుండా అడ్డుకుంటే ఆ లోటును భర్తీ చేసే ప్రత్యామ్నాయ శక్తి ప్రస్తుతానికి అమెరికా దగ్గర లేదు.

**భారత్‌కు లాభనష్టాలు**

ట్రంప్ యంత్రాంగం తీసుకున్న ప్రస్తుత వీసా విధానాల వల్ల మన దేశానికి లాభనష్టాలు రెండూ ఉన్నాయి. ప్రస్తుతం ఇది భారతీయ ఐటీ నిపుణులకు, విద్యార్థులకు భారీ ఎదురుదెబ్బగా అనిపించినప్పటికీ, దీర్ఘకాలంలో ఇది భారత్‌కి కొన్ని సానుకూల అవకాశాలను కూడా తెచ్చిపెట్టడం ఖాయం. అమెరికా వీసాల నిలిపివేత, కొత్త నిబంధనల వల్ల వేలాది మంది భారతీయ విద్యార్థుల విద్యా సంవత్సరం ఆలస్యమవుతోంది. చదువు పూర్తి కాగానే 30 రోజుల్లోనే వెనక్కి వచ్చేయాలనే నిబంధన విద్యార్థులపై మానసిక, ఆర్థిక ఒత్తిడిని పెంచుతోంది. అమెరికాలోని భారతీయ టెక్ ఉద్యోగులు ప్రతి సంవత్సరం బిలియన్ల కొద్దీ డాలర్లను భారతదేశానికి పంపుతారు (రెమిటెన్స్).

వీసా ఆంక్షల వల్ల కొత్త ఉద్యోగులు అమెరికా వెళ్లలేకపోతే, దేశానికి వచ్చే విదేశీ మారక ద్రవ్యం తగ్గుతుంది. ఇప్పటికే అమెరికాలో ఉన్న లక్షలాది మంది భారతీయులకు వీసా పునరుద్ధరణ కష్టతరంగా మారింది. డ్రాప్‌బాక్స్ సౌకర్యం తగ్గించడం, కఠినమైన ఇన్-పర్సన్ ఇంటర్వ్యూల వల్ల నిపుణులు తమ సొంత దేశానికి సెలవులపై రావడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడింది. భారతదేశానికి చెందిన అత్యుత్తమ ప్రతిభా వంతులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు అమెరికా వెళ్లలేక స్వదేశంలోనే ఉండిపోతారు. దీనివల్ల భారతీయ స్టార్టప్స్, పరిశోధనా సంస్థలు మరియు టెక్ కంపెనీలకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం కలిగిన మేధావులు తక్కువ ధరకే లభిస్తారు. అందువల్ల గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు భారతదేశంలోని హైదరాబాద్, బెంగళూరు, పూణే వంటి నగరాల్లో తమ కార్యాలయాలను భారీగా విస్తరిస్తున్నాయి. దీనివల్ల భారత్‌లోనే ఉండి అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాలు, జీతాలు పొందే అవకాశం స్థానిక యువతకు లభిస్తుంది. విదేశీ విద్యార్థులు అమెరికా యూనివర్సిటీలకు ఫీజుల రూపంలో చెల్లించే వేల కోట్లు భారతదేశంలోనే మిగిలిపోతాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి భారతీయ కంపెనీలు అమెరికాకు మనుషులను పంపే పాత పద్ధతిని మార్చుకుని, పూర్తిగా డిజిటల్, క్లౌడ్, ఏఐ ఆధారిత సేవలను భారత్ నుంచే అందించేలా తమ వ్యూహాలను మార్చు కుంటున్నాయి. ఇది భారత్‌లో మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తుంది. ట్రంప్ వీసా పాలసీ వల్ల అమెరికా వెళ్లాలనుకునే వ్యక్తిగత అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతున్న మాట వాస్తవమే. అయితే, సమష్టిగా చూస్తే ఈ విధానం భారత్‌ని గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా, కేంద్రంగా మార్చడానికి ఒక భారీఅవకాశాన్ని ఇస్తోంది.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్



# అరాచక

**యువత అంటే శక్తి, ధైర్యం, సాహసం, వీరత్వం, సర్వస్వాన్ని త్యాగం చేయడానికి సిద్ధపడే గుణం. అందుకే, యువత నోట పలికే పాటలు ఆ దేశ భవిష్యత్తును సూచిస్తాయని విశ్లేషకులు తరచుగా అంటుంటారు. అవి కేవలం పాటలు మాత్రమే కాదు. అవి యువత కలలు, ఆశయాలు, వారు నమ్మే విలువలు, వారి ఆదర్శాలు, వారి దృక్పథానికి ప్రతీకలు. ఒకవేళ ఆ పాటలు దేశభక్తి, ధైర్యం, నూతన ఆవిష్కరణలు, ఐక్యతకు సంబంధించినవి అయితే, అవి యువత పట్ల దేశం కనే కలలకు, దేశ భవిష్యత్తుకు సానుకూలంగా ఉంటాయి. కానీ, ఆ పాటలు తిరుగుబాటు, ద్వేషం, స్వార్థం, నిరాశ, ఉదాసీనతతో కూడినవి అయితే, దేశ భవిష్యత్తు సురక్షితంగా ఉండదు. ఈ నేపథ్యంలో, జాతీయ దృక్పథంతో యువత మధ్య పనిచేసే సంస్థల ప్రాముఖ్యత, ఆవశ్యకత మరింత స్పష్టమవుతుంది.**

ఇటీవల ముగిసిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ ఒక 'కేస్ స్టడీ' (అధ్యయన అంశం)గా సరిగ్గా పరిశీలించాల్సిన అవసరం ఉంది. సీజేపీ ఉద్యమం ప్రజల దృష్టికి ఇటీవలే ప్రముఖంగా వచ్చినప్పటికీ, వాస్తవానికి ఇది గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఒక పరిణామం. దీనిని అధ్యయనం చేయడానికి, దాని వెనుక ఉన్న భావజాలంతో పాటు దాని పరిణామక్రమం, పని విధానం, మద్దతు వ్యవస్థ, వినూత్న ప్రయోగాలను మనం పరిశీలించాల్సి ఉంటుంది. ఆ ఉద్యమ స్వభావం ఎలా మారింది? ఏయే సంస్థలు దానితో జతకట్టాయి? విద్యార్థి ఉద్యమంగా మొదలై రాజకీయ ఉద్యమంగా ఎలా పరిణామం చెందింది? అలాగే అది దేశవ్యాప్తంగా, విదేశాలలో కూడా సమన్వయం ఎలా సాధించింది? అనే విషయాలను మనం అర్థం చేసుకోవాలి. అలాగే, ఆ ఉద్యమం వెనుక ఉన్న తత్వాన్ని విశ్లేషించి, అది మొదలైన తర్వాత ఏం జరిగిందో తెలుసుకోవాలి. ఈ మొత్తం ప్రక్రియ నుండి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయి.

**కాలక్రమం-మద్దతు వ్యవస్థ**

సీజేపీ కాలక్రమాన్ని పరిశీలిస్తే, మరాఠ్వాడాకు చెందిన అభిజిత్ దీప్కే సీజేపీ ఉద్యమాన్ని ప్రారంభించారు. మొదటి రెండు మూడు రోజుల్లోనే ఆయనకు భారీ మద్దతు లభించింది. ఆ తర్వాత ఆయన ఢిల్లీకు వచ్చారు. జూన్ ఆరో తేదీన ఆ నగరానికి చేరుకోగా, ఏడవ తేదీన ఒక ఉద్యమ కార్యక్రమం జరిగింది. ఆ దశలో, దానికి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. జూన్ 7 నుండి 19 వరకు, ఈ ఉద్యమం దేశంలోని వివిధ నగరాల గుండా సాగింది. అక్కడ కూడా ఉద్యమాలను నిర్వహించడానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ పెద్దగా స్పందన లభించలేదు. అయితే, జూన్ 20 నుండి జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్ష ప్రారంభమైంది. ఆ తర్వాత ఉద్యమ స్వభావం క్రమంగా మారింది. ఈ మార్పునకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? ఈ ఉద్యమానికి ఎలాంటి మద్దతు వ్యవస్థ తోడైంది? అనే విషయాలను మనం పరిశీలించాలి. దీనిని అర్థం చేసుకోవడానికి, ఇందులో భాగమైన సంస్థలను గమనించడం అవసరం. తద్వారా ఆ ఉద్యమ మద్దతు వ్యవస్థపై ఒక అవగాహన కలుగుతుంది. ఇది ప్రధానంగా యువత, విద్యార్థుల ఉద్యమం కావడంతో, అనేక విద్యార్థి సంఘాలు దీనితో మమేకమయ్యాయి. ఈ వేదికలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ సంస్థలలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (AISA), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SFI) ఉన్నాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ వాచ్, పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్, సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ వంటి అనేక మానవ హక్కుల సంస్థలు కూడా ఈ ఉద్యమంలో భాగమయ్యాయి. వీటితో పాటు, ఆల్ ఇండియా యూనియన్ ఆఫ్ ఫారెస్ట్ వర్కింగ్ పీపుల్ (AIUFWP), బిర్సా అంబేద్కర్ ఫూలే స్టూడెంట్స్ అసోసియేషన్ (BAPSA), ఆల్ అస్సాం ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్ (AATSU) వంటి అనేక గిరిజన (జనజాతీయ) సంఘాలు కూడా ఈ ఉద్యమంలో చేరాయి. అనేక మహిళా సంఘాలు కూడా దీనితో అనుబంధం ఏర్పరచుకున్నాయి. పింజ్రా తోడ్ కలెక్టివ్ వాటిలో ఒకటి. గత కొన్ని సంవత్సరాలుగా సుమారు 50 విశ్వవిద్యా లయాలలో పింజ్రా తోడ్ ఉద్యమం జరిగిందని, పింజ్రా తోడ్ కలెక్టివ్ పేరుతో ఒక వేదిక ఏర్పాటు చేసిన సంగతిని మనం గుర్తుంచుకోవాలి. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్, మెన్ ఎగైనెస్ట్ సెక్సువల్ వయలెన్స్ అండ్ స్టేట్ రెప్రెషన్, జెండర్ జస్టిస్ కలెక్టివ్ కూడా దీనితో అనుబంధం కలిగి ఉన్నాయి. స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్, ముస్లిం స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ కలెక్టివ్, మైనారిటీ అండ్ బహుజన్ రైట్స్ ఫోరమ్, యునైటెడ్ క్రిస్టియన్ ఫోరమ్, ఆల్ ఇండియా క్యాథలిక్ యూనియన్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చ్స్ ఇన్ ఇండియా (NCC-I) సహా అనేక ముస్లిం, క్రైస్తవ సంస్థలు కూడా ఈ ఆందోళనలో

# వాద ప్రత్యామ్నాయం

పాలుపంచుకున్నాయి. చట్టపరమైన, పర్యావరణ సమస్యలపై, అలాగే జర్నలిజంపై పనిచేస్తున్న సంస్థలు కూడా పాల్గొన్నాయి. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, రిపోర్టర్స్ విదౌట్ బోర్డర్స్ వాటిలో కొన్ని. రైతుల ఆందోళన నిర్వహణలో పాత్ర పోషించిన సంయుక్త కిసాన్ మోర్చా, భారతీయ కిసాన్ యూనియన్ సహా రైతు సంఘాలు కూడా ఇందులో చేరాయి. ఈ ఆందోళనలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) సహా పలు కార్మిక సంఘాలు కూడా పాలుపంచుకున్నాయి. అంతర్జాతీయ మానవ హక్కుల సమాఖ్యతో సహా అంతర్జాతీయ సంస్థలు కూడా చేరాయి.

**ఆందోళన వెనుక నెట్‌వర్క్**

ఇంత విస్తృత శ్రేణి సంస్థలు ఏకమవ్వడం చూశాక, మనం అడగాల్సిన ప్రశ్న. వీరందరినీ ఎవరు ఏకం చేశారు? అని. ఆందోళన పద్ధతిని, మద్దతు వ్యవస్థను అర్థం చేసుకోవాలంటే, ఈ సంస్థలను ఎవరు ఏకం చేశారో మనం పరిశీలించాలి. ఆందోళన వేదిక నుండి ఏమి మాట్లాడారు? ఎలాంటి నినాదాలు చేశారు? ఏ వ్యక్తులు అక్కడ కనిపించారు? అనే విషయాలను పరిశీలిస్తే మరింత స్పష్టమైన చిత్రం ఆవిష్కృతమవుతుంది. ఆ వేదిక నుండి హిందువులకు వ్యతిరేకత ఎందుకు తలెత్తింది? "భారత్ తేరే టుక్డే హోంగే" వంటి నినాదాలు చేస్తూ, వాటికి మద్దతు ఇచ్చే వ్యక్తులు అక్కడ ఎందుకు కనిపించారు? ఆ వేదిక వామపక్షాల పూర్తి నియంత్రణలోకి ఎలా వచ్చింది? అనే ప్రశ్నలను మనం లేవనెత్తాలి. వివిధ రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి ఎలా వచ్చాయి? ఆ ఉద్యమం విద్యార్థుల ఉద్యమం నుండి రాజకీయ ఉద్యమంగా ఎలా మారింది? అనే ప్రశ్నలను కూడా మనం పరిశీలించాల్సి ఉంది. ఇది కేవలం ఢిల్లీకే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాల్లో ఇలాంటి ఉద్యమాలను నిర్వహించడానికి ఒక వ్యవస్థ కూడా ఏర్పాటు అయ్యింది. ఈ కార్య కలాపాలను ఎవరు సమన్వయం చేశారు? అలాగే విదేశీ సంస్థలు, విదేశాల్లోని ఉద్యమాలు ఈ ప్రక్రియలో ఎలా భాగమయ్యాయి? అనే ప్రశ్నలకు కూడా మనం సమాధానం తెలుసుకోవాలి. ఈ నేపథ్యంలో, ఉద్యమం తర్వాత సామాజికవేత్తగా చెప్పుకునే యోగేంద్ర యాదవ్ చేసిన వ్యాఖ్యను సరిగ్గా అర్థం చేసుకోవడం అవసరం. "ఇకపై ప్రజాస్వామ్య భవిష్యత్తును పార్లమెంటు నిర్ణయించదు, వీధులే నిర్ణయిస్తాయి. ఎన్నికలు నిర్ణయించవు, ప్రతిఘటనే నిర్ణయిస్తుంది" అని ఆయన అన్నారు. మనం ఈ వ్యాఖ్యను జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే దీని వెనుక ఉన్న భావన ఆ ఉద్యమాన్ని వివరించడంలో సహాయ పడుతుంది. ఉద్యమానికి కారణం నిజమైనదే కావచ్చు. కానీ ఆ ఉద్యమం ఎలా దారి తప్పింది? చివరికి దానిపై ఎవరు పట్టు సాధించారు? అనేది మనం అర్థం చేసుకోవాలి. అప్పుడే మనం దాని అసలు అర్థాన్ని సరిగ్గా గ్రహించగలము.

**ప్రత్యామ్నాయ రాజకీయాల విశ్లేషణ**

ఈ ఉద్యమం నుండి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. దీనికి సంబంధించిన విస్తృతమైన ముగింపును పరిశీలిస్తే, వామపక్ష వర్గాలు ఇటువంటి ఉద్యమాన్ని ప్రత్యామ్నాయ రాజకీయాలలో ఒక విజయవంతమైన ప్రయోగంగా భావిస్తాయి. అసలు ప్రత్యామ్నాయ రాజకీయాలు అంటే ఏమిటి? ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారానే ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడం అనే భావన చుట్టూ ఒక సిద్ధాంతం రూపొందింది. ఇటాలియన్ తత్వవేత్త ఆంటోనియో గ్రామ్‌షి "సాంస్కృతిక ఆధిపత్యం" (cultural hegemony) అనే సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ సిద్ధాంతం ప్రకారం, కేవలం ఆర్థిక ప్రాతిపదికన ఒక దేశంలో విప్లవాన్ని తీసుకురాలేము. విప్లవాన్ని సాధించాలంటే, సమాజాన్ని ఏకం చేసే సాంస్కృతిక ఆధిపత్యాన్ని ధ్వంసం చేయాలి. కాబట్టి, ఆ సంస్కృతిని నిర్మూలించే ప్రయత్నాలు జరగాలి. "డీకన్‌స్ట్రక్షన్" (విచ్ఛిన్నం లేదా పునర్విశ్లేషణ) సిద్ధాంతాన్ని పరిశీలిస్తే, రాముడిని, వివిధ భారతీయ ఆదర్శాలను విచ్ఛిన్నం చేసే ధోరణి కనిపిస్తుంది. ఈ విధానంలో, రాముడిని స్త్రీలకు వ్యతిరేకిగా, భార్యను వదిలివేసిన వ్యక్తిగా చిత్రీకరించి, ఆయనను ఆదర్శప్రాయుడిగా ఎలా పరిగణించవచ్చని ప్రశ్నలు లేవనెత్తుతారు. అలాగే, శంభూక వధను ఉదహరిస్తూ రాముడిని దళిత వ్యతిరేకిగా చిత్రీకరిస్తారు. ఈ పనితీరును మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి. ప్రత్యామ్నాయ రాజకీయాల గురించి మాట్లాడేటప్పుడు రెండు విషయాలు ప్రస్తావనకు వస్తాయి. ప్రస్తుతం ఉన్న వ్యవస్థ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. దీనిని మనం అంగీకరించాము. ఈ వ్యవస్థ పరిధిలోనే ఉంటే విప్లవాన్ని సాధించలేమని వాదిస్తారు. కాబట్టి, పార్లమెంటుతో పాటు న్యాయవ్యవస్థ, పోలీసు, పరిపాలన వంటి వ్యవస్థకు సంబంధించిన అన్ని సంస్థలను సవాలు చేయాల్సి ఉంటుంది. దీన్ని చేయడానికి రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి, ఎన్నికల ప్రక్రియలోకి ప్రవేశించి, ఎన్నికల ద్వారా నియంత్రణ సాధించి, ఆపై వ్యవస్థను మార్చడం. ఈ దృక్పథం ఉన్నవారు ఇటువంటి ప్రయోగాలు చేయడానికి ప్రయత్నించారు. కానీ ఎన్నికలలో విజయం సాధ్యం కానప్పుడు, మరో మార్గాన్ని అనుసరించారు. ఆ మార్గాన్ని "ప్రజాస్వామ్య మార్గాల ద్వారా ప్రజాస్వామ్యాన్ని కూల్చివేయడం"గా వర్ణించారు. ఈ ప్రయోజనం కోసం ప్రజాస్వామ్యం కల్పించిన హక్కులను ఉపయోగించుకోవాలి. ప్రజాస్వామ్యం మనకు భావప్రకటనా స్వేచ్ఛను, నిరసన తెలిపే స్వేచ్ఛను ఇస్తుంది. ఈ హక్కులను తదుపరి పనులు చేయడానికి ఉపయోగించుకోవాలి. ఈ చట్రంలో, ఐదు దశలను గుర్తించారు. మొదటిది "చొరబాటు, వ్యూహాత్మక భాగస్వామ్యం". అంటే న్యాయవ్యవస్థ, విద్యావ్యవస్థ, అధికార యంత్రాంగం సహా వివిధ వ్యవస్థలలోకి చొరబడటం. విద్యలో కొత్త సిద్ధాంతాలను ప్రవేశపెట్టి, విమర్శనాత్మక సిద్ధాంతాన్ని బోధించడం. వైవిధ్యం, సమానత్వం, సమ్మిళితత్వం (DEI) కూడా కార్పొరేట్ రంగంలోకి ప్రవేశిస్తుంది. దీనిని మరో రకమైన కూల్చివేతగా వర్ణించారు. తదుపరి దశ సంస్థలను బలహీనపరచడం, వాటిని



సవాలు చేయడం, ప్రజలు వాటిపై విశ్వాసం కోల్పోయేలా చేయడం. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం, పోలీసులు, పరిపాలనపై రకరకాల ప్రశ్నలు లేవనెత్తడం ద్వారా వారిపై నమ్మకాన్ని దెబ్బతీయాలి. ఏ వ్యవస్థ పనిచేస్తున్నా, తప్పులు జరగడం సహజం. ఆ తప్పులను ఒక సమస్యగా మార్చవచ్చు. దీనిని "స్థానం కోసం జరిగే యుద్ధం" అని, ఒక భావజాల పరమైన "కథనం కోసం జరిగే యుద్ధం" అని వర్ణిస్తారు. వేరొక రకమైన సంస్కృతిని స్థాపించడానికి సినిమాలు, సాహిత్యం, విశ్వవిద్యాలయాలను ఉపయోగించుకోవచ్చు. స్త్రీల పట్ల భారతదేశపు సాంస్కృతిక దృక్పథాన్ని చూడటం ద్వారా మనం దీని పరిణామాలను గమనించవచ్చు. అది మనకు వేరొకరి భార్యను తల్లిగా చూడమని బోధిస్తుంది. ఈ ఆందోళన జరిగినప్పుడు, అక్కడ మోహరించిన కొంతమంది పోలీసు అధికారులతో నేను మాట్లాడాను. వారు కొంతమంది అమ్మాయిలు ప్రవర్తించిన తీరు, ధరించిన బట్టలు, ఉపయోగించిన భాష గురించి ప్రస్తావించారు. దీనిని సహించడం కష్టమని చెప్పారు. ఇది సంస్కృతిని కించపరిచే ప్రయత్నానికి సంకేతం. సహజీవనం కూడా ఆమోద యోగ్యంగా మారింది. ఇది సాంస్కృతిక పతనానికి మరో నిదర్శనం. చివరగా, వీధి ఆందోళనలను ఒక ఆయుధంగా ఉపయోగిస్తారు. సిద్ధాంతం ప్రకారం ప్రజాస్వామ్యాన్ని కూల్చివేయ డానికి ఈ విభిన్న పద్ధతులను ఉపయోగిస్తారు.

**అంబేద్కర్ చేసిన మూడు హెచ్చరికలు**

బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఈ ప్రమాదాల గురించి చాలా కాలం క్రితమే మనల్ని అప్రమత్తం చేశారు. మనం మన గొప్ప నాయకుల సందేశాన్ని సరిగ్గా అనుసరించని కారణంగా గందరగోళం తలెత్తుతుంది. నవంబర్ 25,1949న రాజ్యాంగ పరిషత్‌లో చేసిన తన ముగింపు ప్రసంగంలో (దీనినే "మూడు హెచ్చరికల ప్రసంగం అని పిలుస్తారు) ఆయన మూడు ముఖ్యమైన హెచ్చరికలు చేశారు. ఒకప్పుడు మనం విదేశీ పాలనలో, బ్రిటీష్ వారి అధికారంలో ఉన్నాము. ఆ సమయంలో మనకంటూ సొంత న్యాయవ్యవస్థ లేదు. అలాగే మన అభిప్రాయాలను తెలియజేయ డానికి పార్లమెంటరీ వేదికలు కూడా అందుబాటులో లేవు. అందువల్ల, ఆ కాలంలో వివిధ ఉద్యమాలు, సత్యాగ్రహాలు, విప్లవాత్మక కార్యకలాపాలు సమర్థనీయ మైనవిగా ఉండేవి. కానీ పరిస్థితి మారిపోయింది. మనం రాజ్యాంగాన్ని అంగీక రించాం. రాజ్యాంగాన్ని అంగీకరించిన తర్వాత, విప్లవాత్మక, హింసాత్మక ఉద్యమాలను విడనాడాలి. మనం అటువంటి పద్ధతులను అంగీకరిస్తూనే ఉంటే, ప్రజాస్వామ్యం నిలదొక్కుకో లేదు. దీనికి బాబాసాహెబ్ "అరాచకత్వ వ్యాకరణం" అనే పదాన్ని ఉపయోగించారు. మనం ఈ అరాచకత్వ వ్యాకరణాన్ని పూర్తిగా తిరస్కరించాలి. రాజ్యాంగ సభలో, ఆయన కమ్యూనిస్టులు, సోషలిస్టులు అనే రెండు శక్తుల గురించి కూడా మనల్ని హెచ్చరిం చారు. కమ్యూనిస్టుల గురించి ఆయన మాట్లాడుతూ వారికి రాజ్యాంగం పట్ల, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేదని, హింసా మార్గాన్ని నమ్ముతారని అన్నారు. అందువల్ల, అవకాశం దొరికినప్పుడల్లా, హింస లేదా మరే ఇతర మార్గాల ద్వారా రాజ్యాంగాన్ని కూల్చివేయడానికి ప్రయత్నిస్తారని చెప్పారు. సోషలిస్టులు వివిధ రూపాల్లో ఆందోళన లకు పాల్పడతారని, అపరిమిత హక్కులను కోరుకుంటారని అన్నారు. వారు ప్రభుత్వాన్ని కూల్చివేసే హక్కును కూడా కోరుకున్నారు. ఆ ఉద్దేశ్యంతో ఆందోళన చేయాలని భావించారు.

**యువత- దేశ నిర్మాణం**

భారత్ ఒక అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి దేశ యువత భాగస్వామ్యం అత్యవసరం. కానీ మనకు ఎలాంటి యువత కావాలి? వారు ఎలాంటి విలువలను కలిగి ఉండాలి? వారికి ఎలాంటి కలలు ఉండాలి? వారి పెదవులపై ఎలాంటి పాటలు ఉండాలి? మనం ఈ విషయాలను జాగ్రత్తగా నిర్ధారించుకోవాలి. అందువల్ల, మనం ఈ ఆందోళనను కేవలం రాజకీయ కోణంలో చూడకూడదు. దీనిని "బీజేపీ వ్యతిరేక" దృష్టితో చూడకూడదు. దీనిని రాజ్యాంగానికి వ్యతిరేకంగా, ఒక ఆయుధంగా ఉపయోగించిన ఆందోళనగా, దేశానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంగా చూడాలి. అంబేద్కర్ మనల్ని హెచ్చరించిన శక్తులను అర్థం చేసుకోవాలి. అరాచకత్వపు వ్యాకరణాన్ని గుర్తించి, విశ్లేషించాలి. అలాగని విశ్లేషించడంతో సరిపోదు. సమాధానాన్ని కూడా కనుక్కోవాలి. ఆ క్రమం మన సానుకూల కార్యకలాపాలను మరింత విస్తృతపరచాలి. యువతరంతో విస్తృతమైన సంబంధాలను ఏర్పరచుకోవాలి. ఒక గొప్ప ఆశయానికి అంకితం కావాలనే సంకల్పం యువతలో ఉంది. ఈ యువశక్తి దేశ నిర్మాణానికి పాటుపడాలి. మన యువత కలలు, విశ్వసించే విలువలు, పాడే పాటలు దేశభక్తి, సేవ, ఐక్యత, నూతన ఆవిష్కరణల స్ఫూర్తిని ప్రతిబింబించేలా మనం చూడాలి. నేటికీ యువతలో దేశభక్తి, సేవ పట్ల అపారమైన ఆకర్షణ ఉంది. మనం ఆ ఆకర్షణను మేల్కొల్పాలి. వారి మనసుల్లో దేశభక్తి భావనను బలోపేతం చేయాలి. వారిని ఉన్నత జాతీయ లక్ష్యంతో అనుసంధానించాలి. ఈ విలువల స్ఫూర్తితో, స్పష్టమైన జాతీయ దార్శనికతతో వారు పనిచేయాలి. అప్పుడు అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించడంలో ఒక సమున్నతమైన శక్తిగా యువతరం మారుతుంది.

భారత్ ఒక అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి దేశ యువత భాగస్వామ్యం అత్యవసరం. కానీ మనకు ఎలాంటి యువత కావాలి? వారు ఎలాంటి విలువలను కలిగి ఉండాలి? వారికి ఎలాంటి కలలు ఉండాలి? వారి పెదవులపై ఎలాంటి పాటలు ఉండాలి? మనం ఈ విషయాలను జాగ్రత్తగా నిర్ధారించుకోవాలి. అందువల్ల, మనం ఈ ఆందోళనను కేవలం రాజకీయ కోణంలో చూడకూడదు. దీనిని "బీజేపీ వ్యతిరేక" దృష్టితో చూడకూడదు. దీనిని రాజ్యాంగానికి వ్యతిరేకంగా, ఒక ఆయుధంగా ఉపయోగించిన ఆందోళనగా, దేశానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంగా చూడాలి.

**భవిష్యత్ భారతదేశ శక్తి**

భారత్ ప్రజాస్వామ్య వ్యవస్థ ఇంతకంటే క్లిష్టమైన పరిస్థితులను కూడా ఎదుర్కొన్నదన్నదానికి చరిత్రే సాక్ష్యం. దీని మనుగడకే ముప్పు వాటిల్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ ప్రతి సంక్షోభం తర్వాత ఇది మరింత బలంగా పుంజుకుంది. యువత ఆలోచనల్లో దేశానికి అగ్రస్థానం లభించినప్పుడు, భారత్ భవిష్యత్తు సురక్షితంగా, ఉజ్వలంగా ఉంటుంది. సరిగ్గా ఈ భావనను ప్రతిబింబించే ఈ కింది వాక్యాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.

**సౌఖ్య ఫులేనహీ, విపదా రోవేనహీ,**
**కంటకోం కే మార్గ్ పర్ ధైర్యబల్ ఖోవేనహీ**
**శత్రు జిస్‌కా దేఖ్ సాహస్, హాథ్ బస్ మల్‌తా రహే**
**హై వహీ పురుషార్థీ, జో సంఘపథ్ చల్‌తా రహే**

(అతను సంపదలో పొంగిపోడు, ఆపదలో కుంగిపోడు. ముళ్లబాటలో నడిచేటప్పుడు కూడా తన ధైర్యసాహసాలను కోల్పోడు. తన ధైర్యంతో శత్రువును నిరాశతో చేతులు పిసుక్కునేలా చేసేవాడే, సమిష్టి ప్రయోజనాల మార్గంలో స్థిరచిత్తంతో సాగే నిజమైన కార్యశీలి అవుతాడు.)

**– అతుల్ లిమాయే, ఆర్ఎస్ఎస్ సహసర్‌కార్యవాహ**
**(ఇటీవల మహారాష్ట్రలో ఏబీవీపీ కార్యక్రమంలో చేసిన ప్రసంగం)**



# మన(ను) స్మృతిలో మహిళ

భారతీయ సమాజంలో స్త్రీ స్థానం ఒకే రీతిగా నిలిచిపోలేదు. యుగయుగాల నుంచి మహిళ ప్రాధాన్యత రూపాంతరం చెందుతూనే వస్తోంది. సత్యయుగం నుండి కలియుగం వరకు ఉన్న ప్రాచీన స్మృతులు,వేదోపనిషత్తులు, నేటి ఆధునిక చట్టాలు, రాజ్యాంగ హక్కుల వరకు స్త్రీ ప్రయాణం ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. సత్య, త్రేత, ద్వాపర, కలియుగంలో స్త్రీ గౌరవం పెరిగిందే తప్ప తరగ లేదు. సత్యయుగంలో గృహలక్ష్మిగా, త్రేతాయుగంలో చట్టపరమైన ఆస్తి హక్కులు ఉన్న ధర్మపత్నిగా, ద్వాపరయుగంలో కుటుంబ సంస్కార రక్షకురాలిగా, కలియుగంలో అనేక హక్కు లు పొందిన ఆచరణాత్మక స్త్రీగా... భారతీయ సమాజం స్త్రీని రకరకాల కోణాల్లో నిర్వచించింది.

ప్రాచీన స్మృతుల్లో ఆమె కుటుంబం, రక్షణలకు ప్రాధాన్యతను ఇస్తే... నేటి ఆధునిక డిజిటల్ యుగంలో స్త్రీ సొంతంగా సాంకేతిక విప్లవాన్ని, స్వతంత్ర రంగాన్ని నడిపించే నాయకురాలిగా నిలుస్తోంది. పరాశర స్మృతి ప్రత్యేక పరిస్థితుల్లో మహిళ పునర్వివాహానికి అనుమతించడం ఒక విప్లవాత్మక మార్పు అయితే... నేటి ఆధునిక రాజ్యాంగం స్త్రీకి అందించిన పూర్తి స్వేచ్ఛ, విద్య, సమాన హక్కులు నారీ విప్లవానికి బాటలు వేశాయి. హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం నాలుగు యుగాలకు ప్రామాణికంగా చెప్పిన మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, శంఖ-లిఖిత స్మృతి, పరాశరస్మృతులలో మహిళల స్థానం మరింత పెరుగుతూనే వచ్చింది. మనుస్మృతిలో స్త్రీల ప్రాముఖ్యత, వారి గౌరవం గురించి చెప్పే అత్యంత ప్రసిద్ధమైన శ్లోకాలు, అభిప్రాయాలు ఉన్నాయి.

**“యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః ।**
**యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలాః క్రియాః॥”**

ఎక్కడైతే స్త్రీలను గౌరవిస్తారో, పూజిస్తారో అక్కడ దేవతలు సంతోషిస్తారు. స్త్రీలను గౌరవించని చోట చేసే పూజలు, యజ్ఞాలు లేదా శుభకార్యాలు నిష్ఫలమవుతాయి. స్త్రీ బాధపడే లేదా కన్నీరు కార్చే ఇల్లు త్వరలోనే నాశనమవుతుందని మనుస్మృతి పేర్కొంది. గృహలక్ష్మిగా స్త్రీ ఇచ్చే ఆనందం కుటుంబంలోని సకల శుభాలకు, అభివృద్ధికి కారణమవుతుంది. మనుస్మృతిలోని కొన్ని ఇతర భాగాలు స్త్రీల స్వాతంత్ర్యం, రక్షణపై భిన్నమైన అభిప్రాయాలను కూడా కలిగి ఉన్నప్పటికీ, సామాజిక గౌరవం, గృహంలో స్త్రీల స్థానానికి సంబంధించి యత్రనార్యస్య పూజ్యంతే వంటి శ్లోకాలు అత్యున్నత ప్రాధాన్యతను ఇస్తాయి.

**“పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే ।**
**రక్షన్తి స్థవిరే పుత్రా న స్త్రీ స్వాతన్త్ర్యమర్హతి ॥”**

మనుస్మృతిలోని ఈ శ్లోకాన్ని విమర్శకులు ‘స్త్రీ అణచివేతకు’ సంకేతంగా చూస్తే, సాంప్రదాయ పరిరక్షకులు, మేధాతిథి, కుల్లుకభట్ట వంటి ప్రాచీన వ్యాఖ్యాన కర్తలు దీనికి రక్షణ, సామాజిక భద్రత కోణంలో అనుకూల అర్థాన్ని ఇస్తారు. ఈ శ్లోకం స్త్రీ స్వేచ్ఛను హరించడానికి కాదని, పురుషులకు (తండ్రి, భర్త, కుమారులకు) స్త్రీ సంరక్షణను తప్పనిసరి బాధ్యతగా విధిస్తుందని చెబుతారు. ఏ వయస్సులోనూ స్త్రీని అనాథగా, ఒంటరిగా, ఆర్థికంగా లేదా శారీరకంగా రక్షణ లేకుండా వదిలేయకూడదనేది దీని ప్రధాన ఉద్దేశం.

**“నాస్తి స్త్రీణాం పృథగ్ యజ్ఞో న వ్రతం నాప్యుపోషితమ్।**
**పతిం శుశ్రూషతే యేన తేన స్వర్గే మహీయతే ॥”**

స్త్రీలు కఠినమైన యజ్ఞాలు, ఉపవాసాలు, శ్రమతో కూడిన ఆధ్యాత్మిక వ్రతాలు చేయాల్సిన అవసరంలేదు. గృహస్థాశ్రమంలో భర్తకు, కుటుంబానికి అండగా ఉంటే చాలు వారికి మోక్షం లభిస్తుందని చెబుతూ ఆమెను కష్టాల నుండి మినహాయించారని అంటారు. మనుస్మృతిని పరిశీలించినప్పుడు ఒకే గ్రంథంలో ధర్మం, రక్షణ, కుటుంబ గౌరవానికి సంబంధించిన ఉన్నత భావాలు ఎంత ఉన్నాయో... నాటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రాసిన కఠినమైన సామాజిక పరిమితులు కూడా అంతే స్పష్టంగా కనిపిస్తాయి.

అయితే భారత రాజ్యాంగం, ఆధునిక చట్టాలు ప్రాచీన స్మృతుల్లోని పరిమితులను తొలగించి, సమానత్వాన్ని ప్రాథమికహక్కుగా గుర్తించాయి. స్త్రీలకు స్వతంత్ర పౌరులుగా పూర్తి స్వేచ్ఛ, ఓటు హక్కు, నిర్ణయాధికారం కల్పించాయి.

**“న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి”**

“స్వాతంత్ర్యం” అంటే ఇక్కడ నేటి అర్థంలో ఉన్న హక్కులు కాదని, రాహిత్యంతో విడిచిపెట్టడం అన్నది వ్యాఖ్యానం. కుటుంబ వ్యవస్థలో ఆమెకు నిరంతరం సామాజిక, ఆర్థిక భద్రత ఉండాలనేది వాదన. ప్రాచీన కాలంలో వెలుపలకి వెళ్లి సంపాదించడం, యుద్ధాలు లేదా భౌతిక ప్రమాదాలను ఎదుర్కోవడం పురుషుని బాధ్యత. ఆ కష్టాలు, ఆర్థిక ఒత్తిడులు స్త్రీపై పడకుండా, కుటుంబంలోని పురుషులే ఆ భారమంతా మోయాలనే సద్భావన ఇందులో ఉందన్నది భావం.

ఇక, ఉపనిషత్తులు, భగవద్గీత, ఇతిహాసాలలో కూడా స్త్రీల పాత్ర అత్యున్నతంగా, స్వతంత్రంగా కనిపిస్తుంది. ముఖ్యంగా భగవద్గీత ఆత్మకు లింగభేదం లేదని, భక్తి, జ్ఞాన మార్గాల్లో అందరికీ సమానహక్కు ఉందని స్పష్టం చేస్తుంది. వేద కాలంలో స్త్రీలకు ఉపనయనం, వేదాధ్యయన హక్కులు ఉండేవి. గార్గి, మైత్రేయివంటి బ్రహ్మవాదినులు యాజ్ఞవల్క్య మహర్షితో తత్త్వ విచారణలో శాస్త్రార్థం చేసి తమ మేధస్సును నిరూపించుకున్నారు.

మన ప్రాచీన సంస్కృతి, ధర్మశాస్త్రాలలో స్త్రీకి ఉన్న మొదటి స్థానం కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాలేదు. సనాతన సంప్రదాయంలో స్వామివారి కంటే ముందే అమ్మవారి పేరును చేర్చి పిలవడం ఒక గొప్ప ఆచారం.పరమశివుడు తన శరీరంలో సగభాగాన్ని పార్వతీదేవికి ఇచ్చి అర్ధనారీశ్వరుడుగా మారాడు. ఇది పురుషునితో పాటు స్త్రీకి సమానమైన స్థానం ఉందనడానికి అతిపెద్ద ప్రతీక.ఏ పూజ, యజ్ఞం లేదా ధర్మకార్యం జరగాలన్నా ధర్మపత్ని పక్కన ఉండాల్సిందే. సామాజిక నిబంధనలు లేదా స్మృతులు ఏవైనా చెప్పినప్పటికీ... మన భాష, ఆచారం, ఆధ్యాత్మిక పునాదులలో స్త్రీకి ఎప్పుడూ తొలి స్థానమే అందించాయి.



**జయశ్రీ ఆచంట, సీనియర్ జర్నలిస్ట్**

# శివాలయమే




**విశ్వేశ్వర శివాచార్యుడు 13వ శతాబ్దంలో అపారమైన మత రాజకీయ ప్రభావాన్ని కలిగిన శైవ పండితుడు. కాకతీయ చక్రవర్తి గణపతిదేవునికి, అతని కుమార్తె రాణి రుద్రమదేవికి రాజకీయ గురువు. కాకతీయ రాజ కుటుంబానికి పరమ ధార్మిక గురువుగా సేవ చేశారు. వీరిని గురించి మల్కాపురం శాసనం అతని 'వంశం' అతని తత్వం, కాకతీయ రాజుల నుండి పొందిన విస్తారమైన భూముల దానాలు గురించి వివరిస్తుంది.**

**ఆం**ధ్రప్రదేశ్‌లోని తూళ్లూరు మండలం మల్కాపురంలో దొరికిన రాతిశాసనం ద్వారా మనకు కొన్ని విషయాలు తెలుసు. 13వ శతాబ్దంలో రాణి రుద్రమదేవి జన్మించిన సందర్భంలో ఈ రాతి శాసనం వేశారు తండ్రి గణపతిదేవుడు (1199–1261). ఈ శాసనంలో 182 వాక్యాలు సంస్కృత, తెలుగు భాషలలో లిఖించారు. గణపతి దేవుడు తన కుమార్తె జన్మించిన శుభ సందర్భంలో అక్కడ గల విశ్వేశ్వర దేవాలయానికి భూమిని దానం చేశాడు. దీని నుండి వచ్చే ఆదాయంతో ఒక ప్రసూతి కేంద్రం, ఆసుపత్రి వీటితోపాటు ఒక వసతి గృహం (సత్రం) నడపమని ఆదేశించాడు.

అలాగే, తమ రాజగురువైన శివాచార్యునకు మందడం, వెలగపూడి గ్రామాలను దానం చేస్తూ, మందడం గ్రామంలో గోళకీ మఠం నడపడానికి కావలసిన వసతులు ఏర్పాటు చేశారు. ఆ మఠం ఆధ్వర్యంలో ఆసుపత్రిని నిర్వహించాలన్న నిర్ణయంతోపాటు, కులవర్ణ వర్గ విచక్షణ లేకుండా అందరికీ ఉచిత వైద్యం, భోజనం, రోగులకు, వారి కూడా వచ్చే సహాయకులకు కూడా సౌకర్యాలు అందించాలని నిర్ణయించారు.

ఈ శాసనంలో మరో విశేషమేమంటే ఇక్కడ ఒక విద్యాలయం (కాలేజీ) నిర్వహించాలి. ఆ విద్యాలయంలో సంస్కృతం, శైవ సాహిత్యాన్ని బోధించాలి. ఈ గురువులను తయారుచేసింది గోళకీ మఠం.

కాలముఖ (నల్లని బొట్టు ధరించేవారు) లేదా గోళకి మఠం శైవ సిద్ధాంత సాంప్రదాయాలతో నడుస్తున్నది. దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి కెక్కిన ఆధ్యాత్మికవ్యవస్థతోపాటు, సామాజిక భద్రత, దాతృత్వ సంస్కరణలు, ప్రగతిశీల సంక్షేమ సౌకర్యాల స్థాపన మున్నగు ఎన్నో కార్యక్రమాలను నిర్వహించింది.

ఆంధ్రప్రదేశంలోని శైవ మతంలో అనేక సాంప్రదాయ రీతులున్నాయి. వాటిలో కాలముఖులు, పాశుపతం, కాపాలికము, బసవ సంప్రదాయం. ఆంధ్రాలో కాలముఖులు, పాశుపతం బాగా ప్రసిద్ధి కెక్కారు. ఇది పూర్వ చాళుక్య యుగం నుండి దాదాపుగా అభివృద్ధి చెందింది. వీరు సుమారు 180 శివాలయాలు కట్టించారు. 2వ విజయాదిత్యుని కాలం నుండి కాలముఖులు, పాశుపతుల స్థానం ఆక్రమించి రాజగురువులుగా విలసిల్లారు. 7వ శతాబ్దంలో పల్లవరాజైన మహేంద్రవర్మ తన మత్తవిలాస ప్రహసనంలో కాలముఖ సంప్రదాయాన్ని పేర్కొన్నాడు. ఈ సాంప్రదాయాన్ని ఎక్కువగా ఆదరించింది కుంతలేశ్వరులైన పశ్చిమ చాళుక్యులని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తున్నది.

వివాహం చేసుకోకపోవడం శివారాధకులైన కాలముఖుల ప్రత్యేకత. అహింసను పాటిస్తారు. శాకాహారులు, యజ్ఞయాగాదులను నిరసిస్తారు. శివ భక్తులతో అవినాభావ సంబంధం కలిగి ఉంటారు. లింగాన్ని ధరిస్తారు, నల్లని బొట్టు పెట్టుకుంటారు. అందువలన వీరిని కాల ముఖులని పిలుస్తారు. శ్రీనాథుడు హరవిలాసంలో, "కలిసి కాటుక గీర్చొట్టు పలగు పేరు / జాతిగా దాల్చి నెఱమిండ జంగ మనుచు" అని ఉంది. కాలముఖాచార్యులకి మహా వ్రతులని పేరు. పండితారాధ్య చరిత్రలో సోమన ప్రమథగణాలన్నీ 'మహావ్రతులను' పేర్కొన్నాడు.

గోళకీ మఠం (సర్కిల్ లాడ్జ్) ప్రారంభదశలో శక్తి ఆరాధనకు, తాంత్రిక విద్యలకు నిలయంగా ఉండేదనే అభిప్రాయం ఉంది. కానీ, ఈ మఠానికి కాలచూరి రాజులు సుమారు 10వ శతాబ్దంలో (975–1025) 3 లక్షల గ్రామాలను దానం చేశారు. జబల్‌పూర్‌లో ఛాన్సాత్ యోగిని ఆలయం/ భేదా ఘాత్ ఆలయం ఈ వాదనకు సాక్ష్యంగా నిలుస్తుంది. ఈ ఆలయంలో శివుడు, దుర్గామాత, అరవై నాలుగు యోగినులు కొలువై ఉన్నారు. ఇక్కడ తాంత్రిక విద్యలుగా భావించే కుండలిని స్థానాల ఆధారంగా వివిధ యోగినుల పేర్లతో అరవై నాలుగు ఆలయ గదులున్నాయి. ఇవన్నీ తంత్ర సాధనకు ఉపయోగ పడ్డాయని ఆర్.ఎస్.శర్మ అభిప్రాయపడ్డారు. గోళకి మఠం మతాచారం ఎలా ప్రారంభమైనా, ఒక గొప్ప రాజకీయ, సామాజిక మార్పునకు ఆధారమయిందనేది ఒక చారిత్రక సత్యం.

అది కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రా ప్రాంతాలలో విస్తరించినప్పుడు ఇక్కడ శైవ సాంప్రదాయాన్ని ప్రభావితం చేసింది. తనకు గల కఠినమైన తాంత్రిక విధానాలను వదిలి సమాజంలోని ప్రజలందరూ సమానమనే సిద్ధాంతాన్ని ఉద్బోధించిన ఉత్తమ సంప్రదాయంగా గుర్తింపు పొందింది. శ్రీకృష్ణ దేవరాయలు వైష్ణవుడైనా ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా హిందువుల సంఘటిత పరచగలిగిన ఒక మత సంప్రదాయంగా అంగీకరించి ప్రోత్సహించాడు.

శివాచార్యుడు కులాలతో సంబంధం లేకుండా భక్తులందరికీ ప్రవేశం కల్పించాడు. (మల్కాపుర శాసనంలో కూడా బ్రాహ్మణులు మొదలు చండాలుర వరకు అందరికి ఉపయోగపడే సత్రం నిర్మాణం చేశారు (ఇక్కడ అందరికి ఉచిత వసతి భోజనం). బసవేశ్వరుని బోధనలుగా చెప్పే అంశాలన్నీ అప్పటికే అమలులో ఉన్న గోళకీమఠ సాంప్రదాయాలుగా వేటూరి ప్రభాకరశాస్త్రి అభిప్రాయపడ్డారు. ప్రతాప రుద్రుని మరణానంతరం కాకతీయ సామ్రాజ్యం కూలిపోయినప్పుడు ఈ గోళకీ మఠస్తులు ఆంధ్రా నుండి కర్ణాటకకు వలసవెళ్లారు. విద్యారణ్యస్వామి ఆశీర్వాదాలతో హరిహర బుక్కరాయల సారథ్యంతో విజయ నగరం సామ్రాజ్యాన్ని నిర్మించారు.

గోళకి మఠం శైవమతానికి చెందిన ఒక ధార్మిక మఠం. దీని ప్రధాన కేంద్రం నర్మదా, గంగానదుల మధ్య గల "త్రిపురి" (తివూరు) పట్టణం. ఇది నేడు జబల్‌పూర్ దగ్గర ఉంది. 10వ శతాబ్దంలో "సద్భవ శంభు" గోళకి మఠానికి ప్రధాన గురువు. సద్భవ శంభు తరువాత వచ్చిన "సోమశంభు" అనే గురువు "సోమశంభు పద్ధతి" అనే పేరుతో గోళకి మఠ నిర్వహణ విధానాలను, సాంప్రదాయ పద్ధతులను రచించారు.

సోమశంభు పద్ధతి అనేది శైవ సిద్ధాంతానికి, శైవ ఆగమాలకు సంబంధించిన అత్యంత ప్రాచీనమైన, ప్రామాణికమైన పూజా విధానాన్ని వివరించిన గ్రంథం. కశ్మీర్ శైవానికి చెందిన సోమశంభుడు రచించాడు. దీనిలో శివలింగపూజా విధానం, దీక్ష, నిత్య నైమిత్తిక అర్చనలు, ఆలయ పూజారి (ఆచార్యుడు) అనుసరించాల్సిన నియమాలను వివరించారు.

**గ్రంథంలోని ముఖ్యాంశాలు:** ఆచార్య లక్షణాలు అంటే (1) పూజ చేసే వ్యక్తి ఎలాంటి నియమాలు పాటించాలి. శివదీక్ష ఎలా పొందాలి. (2) ఆత్మశుద్ధి ఎలా అలవర్చుకోవాలి. పూజ ముందు శరీరాన్ని, మనస్సును ఎలా పవిత్రం చేసుకోవాలి. (భూత శుద్ధి, ప్రాణాయామం) గురించి వివరించింది. (3) పూజా



# విద్య, వైద్యాలయాలు

విధానం: శివునికి షోడశోపచార పూజ, అర్ఘ్య సమర్పణ, అభిషేకం గూర్చిన వివరణ ఉంది. (4) మంత్రోచ్ఛారణ, ప్రతీ పూజా కార్యక్రమానికీ అవసరమైన బీజాక్షరాలు, తంత్ర మంత్రాల ప్రయోగం ఉంటుంది. దీక్షా విధానాలు ముఖ్యంగా నయన దీక్ష, స్పర్శ దీక్షలు, శివభక్తులు, సన్యాసులకు భోజనం పెట్టడం మహేశ్వర దీక్ష. ఇది పితృకార్యాలకంటే గొప్పదని ఈ పద్ధతి నొక్కి చెబుతుంది. ప్రదక్షిణ విధానాల ప్రక్రియ గూర్చి చెప్పింది. ఉదయాన నిద్రలేచి, తలస్నానం చేసుకొని, రోజంతా ఉపవాసం వుండి, సాయంత్రం వేళ శివునికి అభిషేకం జరిగాక పూజ పూర్తి చేయాలి. దివంగతుల ఆత్మలకోసం చేసే కర్మకాండలను కూడా వివరిస్తుంది, ఫ్రెంచ్ ఇండాల జిస్టు హెలెన్ బ్రన్నర్ లాచాక్స్ చేసిన పరిశోధనలవలన సోమశంభుడు కశ్మీరీ పండితుడని తెలిసింది.

గోళకీ మఠానికి చెందిన ప్రముఖులలో (1) 12వ శతాబ్దంలో కాలచూరి వంశానికి చెందిన బిజ్జల దేవునికి దీక్ష ఇచ్చిన కాలచూరి క్షంపాల, దీక్ష గురువు. (2) కేరళకు చెందిన ఈశాన శివాచార్య రాజరాజ చోళునకు దీక్ష గురువు (3) కాకతి గణపతి దేవునకు దీక్షనిచ్చిన విశ్వేశ్వర శివ, ఇతనిని గణపతి దేవుడు తండ్రిలా చూసుకున్నాడు. ఈయన కృష్ణాజిల్లా మందడంలో ఆశ్రమం కట్టుకొని స్థిరపడ్డాడు. విశ్వేశ్వర శివుడు కాకతీయ రాజులకు, చోళులకు, మాళవులకు, కాలచూరి రాజుల గురవని ఇంకా వందలాది వీరశైవ ఆచార్యులకు అధిపతి అని ప్రసిద్ధి.

పుష్పగిరి మఠాన్ని స్థాపించిన "సోమశివాచార్య" గోళకీ సంప్రదాయానికి చెందిన గురువు. ఇతని విగ్రహం వెడికల్లిలో ఉంది. పుష్పగిరి చెన్న కేశవాలయ శిఖరాన్ని నిర్మించినది శివాచార్య అని 1501 నాటి శాసనం తెలియజేస్తున్నది.

శ్రీనాథుని చేతిలో పాండిత్య పోటీలో ఓడిన డిండిమభట్టు గోళకి శాఖకు చెందిన ప్రముఖుడు. విరూపాక్ష, పుష్పగిరి అద్వైత మఠాలను గోళకి పరం పరకు చెందినవారే నిర్మించారు. ఆంధ్రప్రాంతంలో పుష్పగిరి, త్రిపురాంతక ఆలయాలలో గోళకి మఠాలుండేవి. విజయనగర సామ్రాజ్య స్థాపనకు కారకుడైన విద్యారణ్య గోళకి మఠ సంప్రదాయానికి చెందిన వ్యక్తి. గోళకి మఠాలను అనేక శతాబ్దాలు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం, కాళేశ్వరం ఆలయాలలో తమ మఠాలను నెలకొల్పి తమ సాంప్రదాయాలను ప్రచారం చేసుకున్నారు.

కనిపించే ప్రపంచం మిధ్య, ఇప్పుడు ఉంటుంది మరికొంత కాలానికి నాశనమవుతుంది. ఎప్పుడూ ఉండేవాడు సత్యవంతుడు, భగవంతుడు. "యద్దృశ్యం–సద్దృశ్యం" కనిపించేది ఒకరోజు కనిపించకపోతుంది అని చెపుతుంది. అద్వైతం, ఈ సృష్టి సముద్రంపై నీటి బుడగ లాంటిది, ఎప్పుడైనా పగిలిపోతుంది.

విశ్వేశ్వర శివాచార్యుడు కాకతీయ రాజ కుటుంబానికి పరమ ధార్మిక గురువుగా సేవ చేశారు. పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్న ఒక అరుదైన చారిత్రక కాకతీయ రాజవంశ శిల్పంలో గణపతిదేవ మహారాజు. ఆయన భార్య సోమలాదేవితోపాటు గురువు విశ్వేశ్వరశివాచార్యుడు పూజలు అందుకుంటున్నట్లుగా చిత్రించారు.

తెలుగు సాహిత్యంలో 1100 నుండి 1225 వరకు శివకవియుగం అంటారు. ఈ యుగం నన్నయ్య, తిక్కనకు సంధికాలము. దక్షిణ భారతంలో శైవం ప్రబలిన కాలమిది. ఆంధ్రాపథంలో కాకతీయులపాలన సుస్థిరమవుతున్న కాలమిది. నన్నెచోడుడు, పాల్కుర్కి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుడు ఈ యుగంలో శివ కవిత్రయం. ఈ కాలంలో రచనా వస్తువు శివయుగమయం. భాషలో సంస్కృత ప్రాబల్యం తగ్గి తెలుగు వాడుక హెచ్చింది.

ఈ సమయానికి చాళుక్య, చోళరాజ్యం క్షీణ దశకు చేరుకుంది. తెలంగాణప్రాంతంలో పశ్చిమ చాళుక్యుల రాష్ట్ర కూటుల బలం అధికంగా ఉంది. తీరాంధ్రంలో సరైన కేంద్రపాలన కొరవడిందని, వేంగీరాజ్యంలో రాష్ట్రకూటులు, పశ్చిమ చాళుక్యులు, చోళులు ఎడ తెరిపిలేకుండా యుద్ధాలు జరిపారని తెలుస్తుంది. ఈ కాలంలో చాళుక్యులకు సామం తులుగా ఉన్న కాకతీయులు స్వతంత్రులై తెలంగాణా ప్రాంతంలో బలపడసాగారు. వీరు శైవాన్ని పరిరక్షించారు. ఈ కవులు వాఙ్మయాన్ని మత బోధనకు వాడుకున్నారు. అయితే వారిది బహుజన వాదం, మరీ ముఖ్యంగా పాల్కుర్కి సోమనాథుడిది బహుజన ఇతి వృత్తాలు.

శివభక్తులైన వారందరూ సమానులే, వారికి కూడా వేదాధికారం ఉంది అని చెప్పాడు సోమన. వర్ణవ్యవస్థ లేని కారణంగా ఆనాడు ప్రజలంతా శైవభక్తులై నారు. వారిలో కాలుకోటడు (గొల్ల) మడివాలు మాచయ్య (చాకలి) కుమ్మరి గుండయ్య (కుమ్మరి) ఉడుమూరి కన్నప్ప (భక్త కన్నప్ప) (ఎరుకుల) లేడర దాసయ్య, చెన్నయ్య, కెంబాని భోగయ్య, శివనాగుమయ్య గుడవ్వ, గొడగూచి హరిజనులు ఇలా వారిపై సోమనగారు సుమారు నూరుకథలు రాశారు. శివుడిని సైతం మైరపించే అచంచలమైన ముగ్ధ మూఢ భక్తుల కథలు. వీరందరూ శివుడి కోసం అవసరమైతే ప్రాణాలు వదలడానికి సిద్ధపడ్డవారే.



డా. కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

# యూనివర్సిటీ కోఆర్డినేటర్‌గా మాజీ మావోయిస్టు



మొన్నటికి మొన్న తుపాకులను విసర్జించి, లొంగిపోయిన మహిళా నక్సలైట్లు చేనేత దినోత్సవం సందర్భంగా ర్యాంప్ వాక్ చేయగా, నేడు మరొక లొంగిపోయిన మావోయిస్టు నాయకుడు మల్లోజుల వేణుగోపాల్‌రావ్ అలియాస్ భూపతి మహారాష్ట్రలోని గడ్చిరోలీలో గిరిజన హక్కులకు సంబంధించి పాలనాపరమైన పనిని నిర్వహించేందుకు గోండ్వానా యూనివర్సిటీ చేపట్టిన 'ఏకల్' కార్యక్రమ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టినట్టు అధికారులు వెల్లడించారు. ఒకప్పుడు అందరినీ గడగడలాడించే నక్సల్ కమాండర్‌గా పేరుగాంచి, గత సంవత్సరం ఆయుధాలు విడిచిపెట్టిన భూపతి, తాను ఒకప్పుడు పూర్తిగా భిన్నమైన దృష్టితో చూసిన ప్రాంతాలలో గిరిజన వర్గాలకు చట్టపరమైన హక్కులను కల్పించడానికి తన కృషిని అంకితం చేయనున్నారు. ఆయనను మూడు నెలల కాంట్రాక్టుపై రూ.30వేల జీతంతో నియమించారు. క్షేత్రస్థాయి గురించి అవగాహన కలిగిన ఆయన ఉపాధిని కోరుతూ ఒక ఉద్యోగానికి దరఖాస్తు చేసినట్టు గడ్చిరోలీ ఎస్పీ ఎం.రమేష్ తెలిపారు. స్వయంగా ఎస్పీ సూచించడంతో, యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ఆయనను ఇంటర్వ్యూ చేసి ఉద్యోగాన్ని ఇచ్చారు. భూపతి గడ్చిరోలీలోని ట్రైబల్ రీసెర్చ్ సెంటర్‌లో పని చేస్తూ, పరిశోధనా పనికి తోడ్పడతారు. జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించడంలో కూడా తోడ్పడనున్నట్టు పోలీసు అధికారి తెలిపారు. తలపై రూ.6 కోట్ల రివార్డు ఉన్న భూపతి, గత ఏడాది అక్టోబర్‌లో గడ్చిరోలి పోలీసుల ఎదుట మరో 60 మంది నక్సలైట్లతో కలిసి లొంగిపోయాడు. నిషేధిత సీపీఐ పొలిట్‌బ్యూరో కేంద్ర కమిటీ సభ్యుడైన ఆయన, ఆ నిషిద్ధ ఉద్యమంలో అత్యంత ప్రభావవంతమైన వ్యూహకర్తలలో ఒకరిగా, మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు వెంబడి దాని కార్యకలాపాలను చాలాకాలం పర్యవేక్షించారు. భూపతి ఇకపై గ్రామసభలు, గ్రామస్థులు, పరిపాలనా యంత్రాంగం మధ్య వారధిగా పనిచేస్తారు. 'ఏకల్' కార్యక్రమం కింద, పంచాయతీ విస్తరణ చట్టం, అటవీ హక్కుల చట్టం క్రింద కల్పించిన హక్కుల గురించి గ్రామ సభలకు తెలియజేయడం, అటవీ హక్కుల క్లెయిమ్‌లను దాఖలు చేయడానికి అవసరమైన పత్రాలను పూర్తి చేయడంలో సహాయపడటం, క్లెయిమ్‌లలోని తప్పులను సరిదిద్దడం, వాటిని పరిపాలనా యంత్రాంగానికి సమర్పించడాన్ని సమన్వయం చేయడం వంటి బాధ్యతలు ఆయన నిర్వహించనున్నారు.

# పురాతన విగ్రహాల పట్టివేత



ప్రభుత్వాల, హిందువుల అలసత్వం కారణంగా తమిళనాడులోని ఆలయ వారసత్వ సంపద, విగ్రహాలు విదేశాలకు తరలిపోతున్నాయి. వ్యాపారం ముసుగులో దుండగులు ఈ విగ్రహాలను అంతర్జాతీయ మార్కెట్లో కోట్లాది రూపాయలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, ఇటీవలే తమిళనాడు పోలీసుల విగ్రహాల అక్రమ రవాణా నివారణ విభాగం చెన్నైలోని గిండిలో ఉన్న వ్యాపారవేత్త రణ్‌వీర్ షా కార్యాలయంలో సోదాలు నిర్వహించి, అతడి కార్యాలయంలో ఏనుగు, నంది, సింహంతో సహా ఐదు భారీ విగ్రహాలను విగ్రహాలను కనుగొంది. వాటిని పరీక్ష కోసం తీసుకువెళ్లారు. 2016 నాటి ఒక పాత విగ్రహాల స్మగ్లింగ్ కేసుకు సంబంధించి ఈ దాడులు జరిగాయి. ఆ సంవత్సరంలో, విగ్రహాల స్మగ్లింగ్‌లో ప్రమేయం ఉన్నందుకు పోలీసులు చెన్నైకి చెందిన దీనదయాళన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు దీనదయాళన్‌తో సంబంధాలున్న వ్యాపారవేత్త రణ్‌వీర్‌షా వద్దకు చేరుకున్నారు. పొన్‌మణికవేల్ నేతృత్వంలోని విగ్రహాల అక్రమ రవాణా నివారణ విభాగం, షా, అతని వ్యాపార భాగస్వామి కిరణ్ రావులపై విచారణ జరిపింది. తదనంతరం, 2018లో, ఈ యూనిట్ కాంచీపురం, తంజావూరు జిల్లాల్లోని షా ఫామ్‌హౌస్‌లపై దాడి చేసి, దాదాపు 100 కోట్ల విలువైన 91 పురాతన వస్తువులను స్వాధీనం చేసుకుంది. అక్టోబర్ 2018లో జరిగిన మరో చర్యలో, దర్యాప్తు అధికారులు రావుకు చెందిన తేనంపేట్ నివాసంలో సుమారు 23 విగ్రహాలను వెలికితీశారు, వాటిలో కొన్నిటిని ఆమె పెరట్లో పాతిపెట్టినట్లు సమాచారం. దీనదయాళన్ బతికి లేనందున, ఈ యూనిట్ ఇప్పుడు రణ్‌వీర్ షా, కిరణ్ రావులపై కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడానికి సిద్ధమవుతోంది. 2018లో షా, రావులపై జరిగిన దాడుల అనంతరం, షా, రావు ముందస్తు బెయిల్ కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారికి ఒక్కొక్కరికి రూ.1 లక్ష పూచీకత్తుపై, వారి పాస్‌పోర్ట్‌లను అప్పగించాలనే షరతుతో పాటు, కుంభకోణం/తిరుచిలోని విగ్రహాల విభాగం కార్యాలయంలో క్రమం తప్పకుండా హాజరు కావాలనే నిబంధనతో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

# 1,643మంది విద్యార్థుల ప్రాణదాత

ఒక స్కూల్ ప్రిన్సిపాల్ సమయ స్ఫూర్తి సుమారు 1650 మంది పిల్లల ప్రాణాలను కాపాడింది. నేపాల్‌లోని త్రిశూలి లోయలో ఉన్న త్రిభువన్ త్రిశూలి సెకండరీ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేంద్ర దవాడికి, బుధవారం ఉదయం 9:20 గంటలకు ఒక స్నేహితుడి నుంచి ఆకస్మిక వరద ముప్పు గురించి సమాచారం అందింది. ఆ మూడు అంతస్తుల పాఠశాలలో, దాని చుట్టుపక్కల 1,643 మంది పిల్లలు ఉన్నారు. సమాచారం అందిన వెంటనే అప్రమత్తమయ్యాడు. వరద నీరు వేగంగా



# జంతువులపై ఎన్జీవోల వ్యాపారం!



ఎన్జీవోల ముసుగులో జరుగుతున్న కార్యకలాపాలు ఎలాంటివో ఇటీవలి కాలంలో వెలుగులోకి వస్తున్న తీరు ఆశ్చర్యాన్ని కలిగించకమానదు. మతాంతరీకరణ నుంచి హవాలా లావాదేవీలు, పురాతన విగ్రహాల స్మగ్లింగ్, అక్రమ మానవరవాణా వరకు వారు చేస్తున్న పనులు ఇటీవలి కాలంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే, వారు జంతువులను కూడా వదలడం లేదని మధ్యప్రదేశ్‌లో జరిగిన తాజా ఘటనతో బయటపడింది.

మధ్యప్రదేశ్‌లో 'వైల్డ్‌లైఫ్ ఎస్ఓఎస్' అనే ఎన్జీఓతో కుమ్మక్కైన నేరస్తులు ప్రాజెక్ట్ చీతా ఉన్న కూనో నేషనల్ పార్క్ సమీపంలోని  చిరుతలను వేటాడినట్లు అటవీ శాఖ తెలుసుకుంది. శాఖకు చెందిన అధికారుల సమాచారం ప్రకారం, జూలై 23న ఆగ్రాకు చెందిన పోలీసు, అటవీ శాఖ సంయుక్త బృందం 10 చిరుతచర్మాలతో నలుగురిని పట్టుకుంది. ఆ తర్వాత వసీం, భగవాన్ సింగ్ అనే మరో ఇద్దరు అనుమానితులను అరెస్టు చేశారు.

వసీం, సింగ్‌లు వైల్డ్‌లైఫ్ ఎస్ఓఎస్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ కార్తీక్ సత్యనారాయణ్‌తో సంప్రదింపులు జరిపినట్లు డిజిటల్ ఆధారాలు లభించడంతో అటవీ శాఖ జూలై 30న కేసు నమోదు చేసింది.

మధ్యప్రదేశ్ అటవీ శాఖ, వన్యప్రాణులపై పనిచేస్తున్న ఒక ప్రముఖ ఎన్జీవో మధ్య ఇటీవలి పరస్పర ఆరోపణల వివాదం, ఈ రంగంలోని వారందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఆ ఎన్జీవోలోని అత్యున్నత అధికారికి వన్యప్రాణి నేరాలలో ప్రమేయం ఉందని అటవీ శాఖ ఆరోపించింది. కాగా, సదరు ఎన్జీవోకు వన్యప్రాణి రంగంలో బలమైన అనుభవం ఉండటం ఈ వివాదాన్ని మరింత జటిలంచేస్తోంది.

పెరుగుతుండటంతో, 47 ఏళ్ల ఆంగ్ల ఉపాధ్యాయు డైన దవాడికి స్పందించడానికి కేవలం కొన్ని నిమిషాల సమయం మాత్రమే ఉంది. ఆ ఉదయం వరద ప్రభావిత నువాకోట్‌లోని పాఠశాలలోని పిల్లల బాధ్యత అతనిదే, వారి భద్రత ఇప్పుడు అతని నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

దవాడి మొదట్లో ఆ పాఠశాల సురక్షితమని భావించాడు. కాంక్రీట్‌తో నిర్మించి, నదికి సుమారు 60 మీటర్ల ఎత్తులో ఉన్న ఆ పాఠశాల, గ్రామాన్ని తూర్పు ఒడ్డుకు కలిపే ఉక్కు వంతెన ఉన్న ఎత్తులో ఉందని 'ది టైమ్స్' పత్రిక నివేదించింది. అదే సమయంలో ఒక తల్లి పరుగునవచ్చి, నీటి ప్రవాహంవేగంగా పెరుగుతోందని సమాచారం ఇవ్వడంతో తక్షణమే బెల్లుకొట్టి టీచర్లను క్లాస్‌రూంలను ఖాళీ చేయమని చెప్పి, స్కూల్‌కు వస్తున్న బస్ డ్రైవర్లను వెనక్కి వెళ్లమని చెప్పారు. అయితే, ఒక బస్సు తిరిగి వెళ్లలేక మాయమైంది. తాము ప్రమాదంలో ఉన్నట్టు గ్రహించిన పిల్లలు వెనుక ఎత్తుగా ఉన్న ప్రదేశానికి పరుగులుతీశారు. అక్కడ ఉన్న ఒక బోధి వృక్షం కింద ఆశ్రయం పొందిన వారు తమ పాఠశాల భవనాలకు నీరు తీసుకుపోవడం కళ్లారాచూశారు. ఆయన ఉపాధ్యాయుడి సమయస్ఫూర్తి 1643 మంది పిల్లల, బోధనా సిబ్బంది ప్రాణాలను కాపాడింది. అయితే, నదికి సమీపంలో ఉంటున్న ఒక యువ అధ్యాపకుడు ఇంట్లోనే ఉండడంతో కొట్టుకుపోయాడు. అలాగే, తలుపులు మూయడానికి వచ్చిన పాఠశాలవాచ్‌మన్ కూడా ప్రాణాలు కోల్పోయాడు.



# హిందూ పద్ధతిలో విదేశీయుల వివాహం



మన దేశంలో అనేకులు ఆధునికత పేరుతో పాశ్చాత్య సంప్రదాయాలను అందిపుచ్చుకుంటున్న తరుణంలో, భారతీయ సంస్కృతి, హిందూ వివాహ సంప్రదాయాలపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటూ ఆస్ట్రేలియాకు చెందిన ఓ జంట విశాఖపట్టణంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకుంది. స్నేహితుడి వివాహం జరుగుతున్న అదే వేదికపై, అదే సమయంలో తాము కూడా ఒక్కటై సన్నిహితులను ఆశ్చర్యపరిచింది.

శ్రీకాకుళం జిల్లాకు చెందిన రణసూర్య ఆస్ట్రేలియాలో జైళ్ల శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. అదే విభాగంలో ఆస్ట్రేలియాకు చెందిన బ్రాడీ కూడా పనిచేస్తుండటంతో ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. బ్రాడీకి ఇటీవల ఆస్ట్రేలియాకు చెందిన ఎమిలీతో నిశ్చితార్థం జరిగింది.

ఈ నెల 28న విశాఖపట్నంలో రణసూర్యకు సృజనతో వివాహం జరగనున్న విషయం బ్రాడీ, ఎమిలీకి తెలిసింది. దీంతో భారతీయ వివాహ సంప్రదాయాలపై ఆసక్తి కనబరిచిన ఈ జంట, తమ వివాహాన్ని కూడా అదే వేదికపై నిర్వహించుకోవాలని నిర్ణయించుకుంది.

కుటుంబ సభ్యులతో కలిసి ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు చేరుకున్న బ్రాడీ, ఎమిలీ.. రణసూర్య, సృజనల వివాహ వేడుకలోనే హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. హిందూ ఆచారాలు, సంప్రదాయాల మధ్య జరిగిన తమ వివాహం ఎంతో ప్రత్యేకంగా అనిపించిందని కొత్త జంట ఆనందం వ్యక్తం చేసింది. భారతీయ వివాహ వేడుకల్లో కనిపించే ఆధ్యాత్మికత, సంప్రదాయ పద్ధతులు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని వారు తెలిపారు. స్నేహితుడి పెళ్లి రోజునే తాము అదే వేదికపై వివాహం చేసుకోవడం జీవితాంతం గుర్తుండిపోయే మధురానుభూతిగా అభివర్ణించారు.

# జ్ఞాన భాండాగారం

**ఒక 16 ఏళ్ల కుర్రవాణ్ణి నీవేం చేస్తున్నావంటే ఇంటర్మీడియట్, ఎం.పి.సీ లేదా బై.పీ.సీ. అన్న సమాధానం తరచుగా వింటుంటాం. కానీ, ఇంజనీర్లు, డాక్టర్లుగా మారే క్రమంలో యువత ఎదుర్కొంటున్న తీవ్ర ఒత్తిడి నేడు చర్చనీయాంశమైంది. మరోవైపు, నైతికపు విలువలు మరచి మాదకద్రవ్యాలకు, లైంగిక ఆకర్షణలకు మధ్య కొట్టుమిట్టాడుతున్న యువత సంఖ్యా బాగానే కనబడుతోంది. ఎన్నో కొత్త కొత్త 'షిప్పు'లను సృష్టించుకొని జీవిస్తున్న యువతి యువకులు మరెందరో!**

మరి ఇన్నాళ్లుగా చదువుకున్న చదువు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతోందా? సంస్కారాన్నీ, సంస్కృతినీ బోధించే చదువు అవసరమని విద్యవేత్తల అభిప్రాయం. అయితే, ఈ రకమైన విద్యను ఇవ్వగలిగేది సంస్కృతభాష ఒక్కటే అనేది సత్యం. 'సంస్కృతం' అంటేనే చక్కగా, సరిగ్గా చేసినది అని అర్థం. వేదాలు, శాస్త్రాలు మాత్రమే సంస్కృతంలో ఉన్నాయి, వాటివల్ల నేటి సమాజానికి ఏం ఉపయోగం అనడం కేవలం అజ్ఞానం మాత్రమే. సామాజికం, రాజకీయం, విజ్ఞానం, చారిత్రకం, ఆర్థిక వ్యవహారాలు, నైతికమూల్యాలు - ఇలా ఎన్నెన్నో విషయాలు ఎన్నో వేల ఏళ్ల క్రితమే సంస్కృత భాషలో తెలిపారు. ప్రతి సంవత్సరం శ్రావణ పూర్ణిమనాడు సంస్కృత భాషాదినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

'జనని సంస్కృతంబు సకలభాషలకును - దేశభాషలందు తెలుగు లెస్స', అని అన్నారు పెద్దలు. తెలుగు మన అమ్మభాష అయితే, సంస్కృతం అమ్మమ్మ భాష. అమ్మను జాగ్రత్తగా చూసుకోవడంతో పాటు, అమ్మమ్మను విస్మరించకూడదు కదా! అందుకని, రాబోయే యువతరమైనా సరైన దారిలో నడవాలంటే సంస్కృత భాషలోని విషయాలను నేర్పడం ఎంత అవసరమో ఈ క్రింది విధంగా చూడవచ్చు

**నైతిక విలువల నిర్మాణం**

బాల్యంలో రామాయణం, యౌవనంలో భారతం చదవాలని, వృద్ధాప్యంలో భాగవతం చదవాలని అనాదిగా వస్తున్న సూచన. చిన్నతనంలోనే రామాయణంలోని శ్లోకాలను, ఘట్టాలను పిల్లలకు తెలియచేయడం ద్వారా రాముడు మొదలైన ఆదర్శపాత్రల సద్గుణాలు, ఆచార వ్యవహారాలు పెంపొందుతాయి. ఇక, మహాభారతం 'ఎలా ఉండ కూడదో' తెలియజేస్తుంది. యౌవనంలో మహా భారతాన్ని అధ్యయనం చేయడం ద్వారా జీవితంలో దంపతులకు, వైయక్తికంగా వచ్చే అనేక సమస్యలను ఎలా ఎదుర్కోవాలో, తద్వారా కుటుంబంలో శాంతి సౌకర్యాలను ఎలా నెలకొల్పుకోవచ్చో తెలుస్తుంది.

శ్రీరాముడు మితభాషి, స్మితభాషి, ప్రియభాషి, పూర్వభాషి, మృదుభాషిగా రామాయణంలో వర్ణిస్తూ, యువత పెద్దవారితో, తోటివారితో ఏ విధంగా సంభాషించాలో నేర్పుతోంది సంస్కృతం. సీతాదేవిని అన్వేషించడంలో సహాయ పడితే, జటాయువును శ్రీరాముడు ఎంతగా గౌరవించాడో, వానరరాజు సుగ్రీవుడిని ఎంతగా ఆదరించాడో గమనించి నట్లయితే తోటివారిని ఏ విధంగా గౌరవించాలో యువత తప్పక నేర్చుకుంటారు.

సమాజంలో మనఃస్పర్ధలు, విడాకులు అధికమై, దంపతులు సతమతమవుతున్న ప్రస్తుత పరిస్థితిలో ఈ అధ్యయనం ఎంతో ఉపకరిస్తుంది. అదేవిధంగా, భాగవతంలో, కేవలం ఐదేళ్ల వయస్సుగల ప్రహ్లాదుడు తనకు ఎంతమంది ఎన్ని రకాలుగా చెడు ఆలోచనలు కలిగించినా వాటికి లోను కాకుండా, ఎలా లక్ష్యాన్ని సాధించగలిగాడు అనే విషయాన్ని విద్యార్థులు తెలుసుకుంటే వారి విద్యాభ్యాసంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా, వాటిని అధిగమించి ముందుకు వెళ్లే శక్తిని పుంజుకుంటారు. అలాగే, భగవద్గీతలోని శ్లోకాలు, నీతి సందేశాన్ని ఇచ్చే సుభాషితాలు చిన్నతనం నుండే పిల్లలకు నేర్పించడం ద్వారా వారికి ఉచ్చారణ, భాషణ నైపుణ్యం అలవడి, ఎటువంటి సభలలోనైనా ప్రసంగించి, రాణించగలిగే శక్తి ఏర్పడుతుంది. భావవ్యక్తీకరణలో ఇబ్బంది పడేటటువంటి నేటి యువతకు ఇదొక గొప్ప ఉపాయం.

"మాతృవత్ పరదారేషు పరద్రవ్యేషు లోష్ఠవత్, ఆత్మవత్ సర్వభూతేషు యః పశ్యతి స పండితః" - సాటి స్త్రీలను తల్లిగాను, ఎదుటివారి సొమ్మును మట్టిగాను, అన్ని ప్రాణులను తానుగా ఎవరైతే భావిస్తారో వారే నిజమైన జ్ఞానులని, విదేశాలకి వెళ్లి పెద్ద చదువులు చదువుకున్నంత మాత్రాన జ్ఞానులనిపించుకోలేరన్న సత్యాన్ని చెప్పిన ఈ సంస్కృత శ్లోకాన్ని యువత తెలుసుకుంటే దురాచారాల నుండి బయటపడతారు. విశేషించి, శ్లోకం ద్వారా ఒక సందేశాన్ని తెలపడం సంస్కృతంలోని ప్రత్యేకత. విద్యార్థి శ్లోకాన్ని కానీ పద్యాన్ని గాని ఒకసారి ఇష్టపడి నేర్చుకుంటే, దాన్ని జీవితాంతం మరచిపోలేడు. అందుకే వారికి ఎప్పుడు తప్పు చేయాలని అనిపించినా, ఈ శ్లోకమే గుర్తుకు వస్తుంది. ఇలాంటి నీతిశ్లోకాలు సంస్కృతంలో కోకొల్లలు. ఇవన్నీ నేటి యువతలో నైతికపు విలువలను పెంచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాయి.



**విజ్ఞాన భాండాగారం**

సంస్కృతం ఎన్నోరకాల విజ్ఞాన శాస్త్రాలకు ఆటపట్టు. జ్యోతిషశాస్త్రం అంటే కేవలం జాతకాలు, హస్తసాముద్రికలు బూటకాలు అనుకుంటే పొరపాటే. ఖగోళశాస్త్రంలోని అనేక అంశాలు, గ్రహాల స్థితి గతులు, నక్షత్రాలు కదలికలు వీటన్నింటి గురించి విశదీకరించి రుషులు 'బృహత్సంహిత' మొదలైన అనేక గ్రంథాలలో తెలియజేశారు. భరద్వాజ మహర్షి విమానశాస్త్రంలో విమానాన్ని ఎలా తయారు చేయాలో, విమానం నడిపే వ్యక్తికి ఉండవలసిన

# సంస్కృతం



లక్షణాలు వివరంగా ఉంది. పరాశరమహర్షి వ్యవసాయశాస్త్రం ఎటువంటి పంటలు ఏ కాలంలో పండించాలో తెలియజేస్తుంది. సుశ్రుత, చరక మహర్షుల ఆయుర్వేద సంహితలు – మొదలైన అనేక సంస్కృత గ్రంథాలలో మానవుడు ప్రస్తుతం విస్మరించే, విస్తుపోయే ఆరోగ్యసూత్రాలు ఉన్నాయి. అదేవిధంగా, సంగీతం సాహిత్యం లాంటి కళల విజ్ఞానాన్ని తీసుకుంటే, భరతమహర్షి నాట్యశాస్త్రంలో మానవుడి భావోద్వేగాలను గురించి, మనోభావనల గురించి మనోవిజ్ఞాన శాస్త్రపరమైన చర్చ చేశారు. సంగీత రత్నాకరం, సంగీత దర్పణం మొదలైన గ్రంథాలలో ప్రకృతిలో ఏ జంతువులు ఏ యే శబ్దాలను చేస్తాయో వివరిస్తూ, మనిషి శరీరంలో, కంఠంలో ఉండే అనేక అవయవాల గురించి, వాటి పనితీరు గురించి చెప్పారు. ఏ దేశ చరిత్రను, సామాజిక పరిస్థితులను తెలుసుకోవాలంటే, ఆ దేశానికి సంబంధిం చిన సాహిత్యాన్ని వారి భాషలోనే అధ్యయనం చేయడం ఎంతైనా అవసరం.

ప్రాచీనకాలంలో సంస్కృతమే వ్యావహారిక భాషగా, అగ్రగామిగా, దేశానికీ దేశానికి మధ్య అనుసంధానభాషగా ఉన్నందున అనేక చారిత్రక అంశాలు సంస్కృతంలోనే రచించారు. వాటిని అధ్యయనం చేయాలంటే సంస్కృతభాషా జ్ఞానం తప్పనిసరి. ఈనాటికి ఇంకా కనుక్కోలేని వైజ్ఞానిక అంశాలు సంస్కృత వాఙ్మయంలో అంతర్నిగూఢంగా ఉన్నాయి. వాటిని పరిశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**కుటుంబ బాంధవ్యాలు, సంస్కృతి పరిరక్షణ**

‘భారతస్య ప్రతిష్ఠే ద్వే సంస్కృతం సంస్కృతిస్తథా’ అంటే, భారతదేశానికి రెండు కీర్తి ప్రతిష్ఠలు ఉన్నాయి – ఒకటి సంస్కృతం, రెండు సంస్కృతి. ఎందుకని? మొదట సంస్కృతిని చెప్పి రెండవదిగా కూడా సంస్కృతాన్ని చెప్పి ఉండవచ్చు కదా! అనే సంశయం కలగవచ్చు. మన సంస్కృతి అంతా కూడా సంస్కృతం ద్వారానే వ్యక్తమవుతుందని, అందుకు మొదట సుకృత భాష తెలిస్తేనే సంస్కృతి తెలుస్తుందనే భావనతోనే పెద్దలు ఈ విధంగా చెప్పారు. సంస్కృతమే కాదు ఏ భాష అయినా ఎందుకు అధ్యయనం చేయాలి? ప్రధానంగా సంస్కృతిని తెలుసుకోవడం భాష ద్వారానే సాధ్యం కనుక. తెలుగు భాష తెలుసుకుంటే తెలుగు వారి సంస్కృతి తెలుస్తుంది. కానీ సంస్కృత భాష తెలుసుకుంటే మొత్తం భారతదేశ సంస్కృతి తెలుస్తుంది. ‘ఆ నోభద్రాః క్రతవో యంతు విశ్వతః’ – మనకు అన్ని వైపులనుండి శ్రేష్ఠమైన భావనలు వచ్చుగాక అనే ఉదాత్తమైన సందేశాన్ని ఇస్తూ, అందరికీ మేలు చేయాలనే సంస్కృతిని నేటి యువతకు బోధిస్తోంది సంస్కృతభాష. ‘లోకాః సమస్తాః సుఖినోభవంతు’ అని అన్ని లోకాలు అన్ని మతాలవారు సుఖంగా ఉండాలని కోరుకున్నది ఒక్క సంస్కృత వాఙ్మయమే తప్ప, ఇక ఏ వాఙ్మయంలోనూ ఇటువంటి ఉదార భావన కానరాదు.

ఒక పావురం కోసం శిబిచక్రవర్తి తన తొడ మాంసాన్ని ఇవ్వడానికి సిద్ధపడ్డాడు, ఒక గోవును కాపాడడం కోసం దిలీప మహారాజు తనను తాను సింహానికి అర్పించుకోవడానికి సిద్ధపడ్డాడు – ఈ సందేశాత్మకమైన చారిత్రక విషయాలన్నీ కాళిదాసు సంస్కృతంలో రచించిన రఘువంశం మొదలైన కావ్యాలలో ఉన్నవే. ఎంతటి ఆపద వచ్చినా, ఎదుట ఉన్నది ఒక పశువే అయినా సరే, కాపాడడానికి ముందుండాలని నేటి యువతను పరోపకారం వైపు, లోక సంక్షేమం వైపు నడిపిస్తోంది సంస్కృతం. “షోడశే వయసి ప్రాప్తే పుత్రం మిత్రవదాచారేత్” – 16 ఏళ్లు వచ్చాక తన కొడుకును మిత్రుడిలాగా తండ్రి భావించి, మెలగాలి అని కుటుంబంలో పరస్పరం సంబంధ బాంధవ్యాలు ఎలా ఉండాలని మనో వైజ్ఞానికశాస్త్ర దృష్ట్యా వివరించిన సంస్కృత వాఙ్మయం, నేడు ఛిన్నాభిన్నమై పోతున్న కుటుంబాలను కలపడానికి, భారతీయ కుటుంబ వ్యవస్థను చక్కదిద్దడానికి ఒక గొప్ప సాధనం. “ఏక స్తపః ద్విర ధ్యాయే”– అంటే తపస్సును ఒంటరిగా చెయ్యి, విద్యాభ్యాసాన్ని నలుగురితోనూ కలిసి చేయి అని. విద్యాభ్యాసంలో విద్యార్థులు ఒకరికొకరు తోడుగా ఉంటూ అధ్యయనం చేసి, పరిశ్రమను మాత్రం ఎవరికి వారు వ్యక్తిగతంగా చేసుకుంటూ ఉన్నతిని సాధించాలని దిశానిర్దేశం చేస్తోంది సంస్కృతం. “నేయం సజ్జనసంగే చిత్తం, దేయం దీన జనాయ చ విత్తం” – మంచి వారితోనే సాంగత్యం చేయాలి, దీనజనులకు దానధర్మాలను కచ్చితంగా చేయాలి అని ఆదిశంకరాచార్యులు చేసిన ఉపదేశం–నేటి యువత చేస్తున్న చెడు సాంగత్యాలను నిరసిస్తుంది. ఈ రకంగా లోకానికే సంస్కృతిని, సంప్రదాయాన్ని నేర్పిన భాష మన సంస్కృత భాష.

**ఒత్తిడిని అధిగమించే ఉపాయం**

నేటి యువత, ఉద్యోగస్థులు ‘ఒత్తిడి’వల్ల సతమత మవుతున్నారు. సంస్కృతంలో మాట్లాడడం, సంస్కృతంలోని పద్యాలను వినడం, పాడడం మొదలైన క్రియాకలాపాల ద్వారా మనసుకు రసానుభూతి, ఆనందానుభూతి కలుగుతుంది. తద్వారా



**శతావధాని**
**ఉప్పలధడియం భరత్ శర్మ**
91828 55546, తిరుపతి

పనిలోని ఒత్తిడిని దూరంచేసుకుని ప్రశాంతమైన మనస్థితిని పొందడం సాధ్య మవుతుంది. సంస్కృత భాషలో ఉన్న శ్లోకాలు, మంత్రాలను వినడం వల్ల, వాటిలో ఉండే అక్షర రమ్యత, శ్రావ్యత, వీనులవిందుగా ఉండే గుణం మనస్సుకు మెదడుకు ఆనందాన్ని ఆహ్లాదాన్ని ప్రశాంతతను కలిగించి, మానసిక పరిస్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అదే విధంగా, సంస్కృత పద్యాలను అల్పప్రాణ, మహాప్రాణ అక్షరాలను సరైన రీతిలో బిగ్గరగా ఉచ్చరించడం ద్వారా మనిషికి జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. తద్వారా ఆరోగ్యం ఆయుష్షు రెండూ వర్ధిల్లుతాయి.

**ఎన్నో భాషలకు తల్లి**

భారతదేశంలోనే కాదు, ప్రపంచంలో అనేక భాషలకు మూలం సంస్కృత భాష అని విద్యావేత్తలు, భాషావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆవును ఆంగ్లంలో 'కౌ'అంటారు. అదే సంస్కృతంలో 'గౌ' అంటారు. ఆంగ్లంలో 'దే' – సంస్కృతంలో 'తే', ఆంగ్లంలో 'ఐయామ్', సంస్కృతంలో 'అహం'. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. మన ప్రజల పేర్లలో దాదాపుగా అన్నీ సంస్కృతం పేర్లే. ఈ విధంగా, మనం మాట్లాడే భాషలో దాదాపు సగం పైన పాత్రను పోషించే సంస్కృతాన్ని మనం విస్మరించడం అంటే తల్లిని అగౌరవపరచడమే అవుతుంది.




నేడు కేవలం మార్కులను సాధించడమే లక్ష్యంగా సంస్కృతాన్ని బోధిస్తే, పిల్లలకు సంస్కృతం ద్వారా ఏ లాభము చేకూరదు అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. సంస్కృతాన్ని పాఠశాలలో నుండే కాక, ఇంటిలో తల్లిదండ్రుల నుండే పిల్లలు నేర్చుకోవడం మొదలు పెట్టినట్లయితే, వారి బుద్ధి కుశలత, ఆలోచన విధానం, సమాజం పట్ల వారికి ఉండే బాధ్యత, భావవ్యక్తీకరణ నైపుణ్యం అలవడి తాము ఎంచుకున్న రంగంలో, ఎంచుకున్న చదువులో కూడా ఉత్తమంగా రాణించే అవకాశం కలుగుతుంది. సంస్కృతాన్ని సంస్కృతంలోనే నేర్చుకొన్నప్పుడే ఈ భాష ఎంత సరళంగా ఉంటుందో తెలుస్తుంది. సంస్కృతభారతి అనే స్వచ్ఛందభాషా ప్రచారసంస్థ సంస్కృతం అందరికీ అనే లక్ష్యంతో దానిని సరళంగా మాట్లాడే విధానాన్ని తెలుగు రాష్ట్రాలలో అలాగే, భారతదేశవ్యాప్తంగా గడిచిన 45 సంవత్సరాలుగా విశేషమైన ప్రచారం చేస్తూ, విద్యార్థులకు ఎన్నో రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుండడం గమనార్హం. అదేవిధంగా, తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం తదితర సంస్థలు కూడా సంస్కృతాన్ని విశేషంగా వ్యాప్తిచేస్తున్నాయి. కానీ వాటిలో తమ పిల్లలను చేర్పించడానికి ఎంతమంది తల్లిదండ్రులు సిద్ధంగా ఉన్నారనేది ఆలోచించవలసిన విషయం. సంస్కృత భాషలో ఉన్నంత సాహిత్యం, వ్యాకరణ నిర్మాణం, భాషాసౌందర్యం మరి ఏ భాషలోనూ పరిపూర్ణత్వాన్ని సంతరించు కోలేదు. అట్టి మన చరిత్రకు అద్దం పట్టే సంస్కృత భాషను నేర్చుకోవడానికి, నేర్పించడానికి, ముందుకు తీసుకువెళ్లడానికి, విద్యార్థులు ఆచార వ్యవహారాలను, ఒత్తిడిని అధిగమించి, తమ రంగాలలో ఉత్తమ ఫలితాలను సాధించి భారతదేశాన్ని విశ్వగురువుగా 'వికసిత భారతం'గా నిలపడానికి నేటి యువతరం అంతా కదలి రావాలి!

**వదతు సంస్కృతం జయతు భారతమ్**



## వివేకానంద కేంద్ర అధ్యక్షుడు

# బాలకృష్ణన్ కన్నుమూత



యావత్ జీవితాన్ని వివేకానంద కేంద్ర ద్వారా దేశానికి అంకితం చేసిన బాలకృష్ణన్ ఆగస్టు 27వ తేదీన పరమపదించారు. కర్మయోగిగా ప్రశంసలు అందుకున్న ఆయన ఆధ్యాత్మిక దృక్పథంతో సేవలు అందించారు. వివేకానంద కేంద్రను ప్రారంభించడానికి వెనుక ఏకనాథ్ రానడేకు గల దార్శనికతను సాకారం చేసేందుకు వారు ఎనలేని కృషి చేశారు.

రానడే స్వయంగా శిక్షణఇచ్చిన తొలి తరం'జీవనవ్రతుల'లో బాలకృష్ణన్ ఒకరు. ఎవరూ సాధారణంగా పర్యటించని ఈశాన్య ప్రాంతం, అండమాన్‌లలో బాలకృష్ణన్ వివేకానంద కేంద్ర పనికి శ్రీకారం చుట్టి పాఠశాలలను స్థాపించారు. తన పనిని విస్తరింపజేయడంలో అవిశ్రాంతంగా కృషి చేసిన కర్మయోగి. దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా వివేకానంద కేంద్ర కోసం పని చేసిన ఆయన తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొన్నారు. అయితే, అందరు కార్యకర్తలఆమోదం, మద్దతు కారణంగా ఆ సవాళ్లను అధిగమించి వివేకానంద కేంద్రను దేశంలోనే అతి శక్తిమంతమైన సేవా కేంద్రంగా ఆయన తీర్చిదిద్దారు.

అవిశ్రాంతంగా పనిచేసే తత్త్వం కారణంగా దేశం నలుమూలలకు ప్రయాణించి వివేకానంద కేంద్ర పనిని వ్యాప్తి చేశారు. ఈ క్రమంలో ఆయన పదే పదే ఆసుపత్రి పాలైనా తన పనిని ఆపలేదు. గత నెలలో ఆయన అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో చేరినప్పుడు ఆర్‌ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్‌జీ కలిశారు. అపుడు తాను త్వరగా కోలుకుని, పర్యటనను ప్రారంభిస్తానని బాలకృష్ణన్ చెప్పారు. ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ, ఏడు దశాబ్దాలుగా నిరంతరం శ్రమించిన వ్యక్తి ఆయన, మళ్లీ పనిచేయడానికి తాను సిద్ధంగా ఉంటాననే ఆశను కోల్పోలేదు. వయసు, మూత్ర పిండాల వైఫల్యం వలన సవాళ్లను అధిగమించి పనిచేయాలన్న ఆయన తీవ్రమైన కోరిక నెరవేరలేదు. అయితే, పనిచేస్తూ జీవించడానికి ఆయన చేసిన తీవ్ర పోరాటం ముగిసింది. ఎనభై ఏళ్ల బ్రహ్మచారి శివైక్యం చెందారు. కర్మయోగానికి ప్రతిరూపంగా నిలిచిన వీరు స్వామి వివేకానందుల విశ్వ సౌభ్రాతృత్వం, మానవసేవ సందేశాలను ప్రచారంచేయడంతోపాటు దేశం,సమాజంకోసం జీవితాన్ని అంకితం చేశారు.

**ఆర్‌ఎస్ఎస్ నివాళి:** బాలకృష్ణన్ నిరాడంబర జీవనశైలి, నిస్వార్థ సేవ, త్యాగభావం, హిందుత్వంపట్ల అచంచలమైన నిష్ఠ సామాజిక కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. స్వామి వివేకానందుల ధ్యేయాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కన్యాకుమారిలోని వివేకానంద కేంద్రంలో జీవితాంతం అంకితభావంతో పనిచేసిన తొలి తరం 'జీవనవ్రతి' కార్యకర్తల్లో బాలకృష్ణన్ ఒకరు. వారి మృతితో మన దేశం, సమాజం ఒక శ్రద్ధాళువుని కోల్పోయింది. దివంగత బాలకృష్ణన్‌కు వినమ్ర శ్రద్ధాంజలి ఘటిస్తూ, ఆ పుణ్యాత్మకు పరమాత్మ సద్గతిని, మోక్షాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాం అంటూ ఆర్‌ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ డా. మోహన్ భాగవత్, సర్‌కార్యవాహ్ దత్తాత్రేయ హొసబళే నివాళులు అర్పించారు. బాలకృష్ణన్ మరణంతో, వ్యవస్థాపకుడు రానడే కన్నుమూసిన తర్వాత సంస్థను ఐక్యంగా నిలబెట్టిన ఆదర్శ కార్యకర్తను వివేకానంద కేంద్ర కోల్పోయింది. అలాగే, భారత్ కోసం సాగించిన ఉమ్మడి కార్యాచరణలో నేను ఒక ప్రియమైన సహ కార్యకర్తను కోల్పోయానంటూ చెన్నైలోని తుగ్లక్‌పత్రిక ఎడిటర్ ఎస్.గురుమూర్తి సంతాపం వ్యక్తం చేశారు. ★




(గతవారం తరువాయి)

**బృ**హత్ భారతదేశం–అఖండ భారత్‌కు ముస్లిం వేర్పాటువాదం ముప్పుగా పరిణమించడంతో పాటుగా పెరుగుతున్న ఇస్లామిక్ రాజకీయాల నేపథ్యంలో "వీ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్" (మనం లేదా మన జాతీయత నిర్వచనం) అనే పుస్తకం వచ్చింది. పైన పేర్కొన్న పరిణామాలు చివరికి బృహత్ భారతదేశాన్ని భారత్, పాకిస్తాన్‌గా విభజించాయి. విషయాలు తమ అభిప్రాయం గానీ, గురూజీ అభిప్రాయంగానీ ఎన్నడూ కాదని, అది జీడీ సావర్కర్ మరాఠీ గ్రంథం 'రాష్ట్ర మీమాంస'కు సంక్షిప్త ఆంగ్ల రూపమని, ఇదే విషయాన్ని గురూజీ కూడా స్వయంగా స్పష్టం చేశారని ఆర్‌ఎస్‌ఎస్ పేర్కొంది. నిందారోపకులు ఈ కీలక వ్యాఖ్యలను కనీసం చిన్న అక్షరాలతో కూడా ముద్రించలేదు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంత ప్రచారకర్తగా గురూజీ ప్రస్థానం జూన్, 1940లో ఆయన ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘచాలక్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాతే ప్రారంభమైంది. జూన్, 1973లో ఆయన తుదిశ్వాస విడిచే వరకు ఈ ప్రస్థానం 33 ఏళ్లపాటు కొనసాగింది. ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడిగా ఉన్న మూడు దశాబ్దాల కాలంలో, గురూజీ చేసిన సిద్ధాంత వివరణలలో 'వీ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్' పుస్తకంలోని అంశాలకు మద్దతునిచ్చేలా ఏ ఒక్క వ్యాఖ్యనూ ఆయనపై నిందలు మోపే వారు చూపలేకపోయారు. ఇది ఆర్‌ఎస్‌ఎస్



# గురూజీ రచనల వక్రీకరణ

అలీగఢ్ ఉద్యమం రూపుదిద్దుకోవడంతో, 1938లో బ్రిటిష్‌వారు ముస్లింల కోసం ప్రత్యేక పౌర చట్టాన్ని అమలు చేయడంతో, విభజనవాద ముస్లిం రాజకీయాలు అత్యంత దూకుడుగా మారాయి. ఆ చేదు సంఘటన నేపథ్యంలో వచ్చిన ఈ పుస్తకం ఒక తీవ్రమైన ప్రతిస్పందనగా ఉంది. "గందరగోళంతో, పలాయనవాదంతో కూడుకున్న జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలు ఈ పుస్తకంలోని విషయాలను కచ్చితంగా ప్రభావితం చేశాయి" అని ఆర్‌ఎస్‌ఎస్ పేర్కొంది. అంటే, ఆ పుస్తకం సందర్భానికి పరిమితమైనది. కనుక దాని ప్రాసంగికత ఆ చేదు సందర్భానికి మించి నిలవదని ఇది సూచిస్తుంది. అందులోని

> ముస్లింలు సహ భారతీయులందరినీ ఏకం చేసే 'సమ్మిళిత హిందూ సాంస్కృతిక జాతీయవాదం' గురించి గురూజీ దశాబ్దాల తరబడి ఎంతో విస్తృతంగా, అదే సమయంలో స్థిరమైన దృక్పథంతో ప్రచారం చేశారు. అయినప్పటికీ, గురూజీ వ్యక్తం చేసిన స్థిరమైన, సందర్భాతీతమైన అభిప్రాయాలను దుష్ప్రచారం చేసేవారు ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారు. ఇప్పటికీ దాచిపెడుతూనే ఉన్నారు.

సమర్థవంతంగా వాదించిన విషయం. ముస్లింలు సహ భారతీయులందరినీ ఏకం చేసే 'సమ్మిళిత హిందూ సాంస్కృతిక జాతీయవాదం' గురించి గురూజీ దశాబ్దాల తరబడి ఎంతో విస్తృతంగా, అదే సమయంలో స్థిరమైన దృక్పథంతో ప్రచారం చేశారు. అయినప్పటికీ, గురూజీ వ్యక్తం చేసిన స్థిరమైన, సందర్భాతీతమైన అభిప్రాయాలను దుష్ప్రచారం చేసేవారు ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారు. ఇప్పటికీ దాచిపెడుతూనే ఉన్నారు. ఒక నిర్దిష్ట సందర్భంలో చేసిన వ్యాఖ్యల ప్రాముఖ్యత ఆ సందర్భానికే పరిమితమని తెలిసినప్పటికీ, వారు వాటిని సందర్భం లేకుండా, దురుద్దేశపూర్వకంగా ప్రస్తావిస్తుంటారు. గురూజీ విషయంలో అనుసరించినట్లుగానే సందర్భాన్ని విస్మరిస్తే, హిట్లర్ గురించి గాంధీ, చర్చిల్, బోస్, ఇతరులు చేసిన వ్యాఖ్యలను కూడా మరింత కఠినంగా ప్రశ్నించాల్సి ఉంటుంది. కాబట్టి, గురూజీ చేసిన సందర్భోచిత వ్యాఖ్యలను మాత్రమే ఉదహరిస్తూ సాగించే ప్రచారం అత్యంత అన్యాయమైనది, నిజాయతీ లేనిది. అందువల్ల, గురూజీపై న్యాయమైన చర్చ జరగాలంటే, 'వీ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్' పుస్తకంలోని సందర్భోచిత అంశాలను సందర్భం లేకుండా ప్రస్తావించే ధోరణిని ఖండించాలి. గురూజీ ఆలోచనలు కాలం, ప్రాంతం, నాటి పరిస్థితుల పరిమితులను ఎలా అధిగమించాయో, అలాగే ఆయన తదనంతరం కూడా అవి ఎలా సరైనవని నిరూపితమయ్యాయో అర్థం చేసుకోవడానికి, దశాబ్దాలుగా సాగుతున్న ఈ ఉద్దేశపూర్వక తప్పుడు ప్రచారాన్ని తొలగించడం అత్యవసరం.

**(ఎస్.గురుమూర్తి రచించిన "గోల్వాల్కర్ ది మోడరన్ రిషి విత్ మిల్లేనియల్ విజన్" పుస్తకం నుంచి)**

## వివేకానంద సూక్తిశతి

**we now mostly need ideal of hero with the tremendous spirit of Rajas whose armour is renunciation, whose sword is wisdom we want now the spirit of brave warrior in the battlafield of life**

త్యాగబుద్ధి నీవు ధరియించు కవచము
జ్ఞానఖడ్గమును కరానబూను
ధైర్యసాహసాలు ధర నిన్ను గెలిపించు
వినుడి స్వామి సద్వివేక వాణి!!





బండిరాజుల శంకర్
ఆలేరు,
9948050608

## కథ

ఒక రూపూ రేఖా లేని దెయ్యాల్లాంటి భయాలు పిచ్చికుక్కల్లా నా మీద పడి నిర్దాక్షిణ్యంగా కరిచేస్తున్నాయి!

కన్ను మూయాలంటే భయం! మాగన్నుగా నిద్రపడితే చెప్పలేనంత భయాందోళన!

మూసుకుపోతున్న కనురెప్పలకు దారం కట్టి బలవంతంగా నిద్ర ఆపుకుంటున్నాను. రెప్పవాలితే చాలు కళ్ల ముందు పిచ్చిగా నర్తించే భయంకర దృశ్యాలు!

"అమ్మాయ్!"

తీయని పిలుపు అమృతంలా వినిపించింది. సందేహం లేదు. అది అమ్మదే. తుళ్లిపడి చూశాను.

గది గుమ్మంలో వెన్నెల నవ్వులు చిందిస్తూ అమ్మ!

నెలలు నిండిన మనిషినన్న సంగతి మరచి గబుక్కున మంచం దిగి అమ్మ దగ్గరకు దూసుకెళ్లాను. 'జాగ్రత్త జాగ్రత్త' అని అమ్మ హెచ్చరిస్తున్నా పట్టించుకోకుండా వెళ్లి అమ్మని వాటేసుకున్నాను.

"నీ ఆరోగ్యం ఎలా వుంది తల్లీ!"

''బాగుంటే నిన్నెందుకు రమ్మని పోరు పెడతానమ్మా !" నిష్ఠూరంగా అన్నాను.

"ఏమైంది తల్లీ!" నా బుగ్గలు నిమిరి లాలనగా అడిగింది.

కళ్లల్లో కన్నీటి కుండలు భళ్లున పగిలాయి. అమ్మని కావలించుకుని బావురుమన్నాను.

"ఏమైందే ...!" కంగారు పడింది.

"నాకేదో అయిపోతున్నట్టు పిచ్చి కలలు! బిడ్డ ఎలా ఉంటుందోనని ఒక్కటే ఆందోళన!"

చెంపల మీంచి జల జల జారిపోతున్న కన్నీళ్లు తుడిచి నవ్వింది.

"నా బాధలూ, భయాలూ ఏకరువు పెడుతోంటే అదేదో గొప్ప సంగతైనట్టు అపురూపంగా నవ్వుతావేంటమ్మా!" విసుక్కున్నాను.

"తొలికాన్పు కదా! అలాగే ఉంటుందిలే. నేను వచ్చేశానుగా. అమ్మ రాక్షసిలా నిన్ను కాపలా కాస్తాను. నీకేం కాదు. కానివ్వను!'' అరచేత్తో ముఖం నిమిరింది.

నన్ను మెల్లగా నడిపించి మంచం మీద కూర్చోబెట్టింది.



గోపాలకృష్ణ

**భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది**

# అమ్మ మనసు

సింహ ప్రసాద్

"నీ కిష్టమైనవన్నీ చేసి తెచ్చాను. తెస్తానుండు..." అమ్మ వెళ్లబోతే ఆపి కూర్చోబెట్టి ఆమె ఒడిలో తలపెట్టుకున్నాను.

శేషతల్పం మీద పవళించిన అనుభూతి కలిగింది!

ఇంక నాకేం ఫరవాలేదు. నా పక్కన కొండంత అమ్మ ఉంది! నిశ్చింతగా నిట్టూర్చాను.



"ఇంకొద్ది రోజుల్లో అమ్మ కాబోతున్న దానివి. మరీ ఇంత బేల అయితే ఎలాగే. సుఖప్రసవం జరగటానికీ, పాలు బాగా పడటానికీ నేను చెప్పిన జాగ్రత్తలన్నీ పాటిస్తున్నావా?"

అవేంటో కూడా గుర్తు లేవు.ఫోన్ చేసిన ప్రతిసారీ ఏవో జాగ్రత్తలు చెబుతూనే ఉంది. ఆ మాట చెప్పలేక తలాడించాను.

నెత్తిమీద చిన్నగా మొట్టింది. "నీ ముఖం. అవన్నీ పాటిస్తే ఇంత నీరసంగా ఎందుకుంటావు? ఇది చాలా ముఖ్యమైన దశ. నువ్వు బలంగా ఉండాలి. నీ బిడ్డా బరువు తూగాలి. వాడి చిన్ని బొజ్జకు సరిపడే పాలు పడాలి!"

"ఇంకా నాకు పురుడు రాలేదనీ, నేను గండం గడిచి గట్టెక్క లేదనీ మరచి నువ్వు చాలా దూరం వెళ్లిపోతున్నావు!"

"అది గండం కాదే పునర్జన్మ. స్త్రీత్వాన్ని సార్థకం చేసే పావన మాతృ అవతారం!"

చిత్రంగా చూశాను. మనసులో ఆనందపు చిరుగంటలు గణగణమని మోగాయి !

"అమ్మా! నాలాగానే కడుపులోని బిడ్డా భయాలతో అశాంతితో అలమటిస్తుంటుందా?"

"నీ పిచ్చి అనుమానాలకి నవ్వొస్తోంది. ఉండు అన్నం కలిపి తెస్తాను. ఇవాళ నా చేతులతో తినిపిస్తాను"

''అయితే అమాంతం చిన్నపిల్లని అయిపోతాను" అల్లరిగా నవ్వాను.

"నా కళ్లకు నువ్వెప్పుడూ పసిపాపవే!"

మంచం మీద కూర్చునే అన్నం తినిపిస్తూంటే మైమరచిపోతూ అమ్మ ముఖాన్నే తనివితీరా చూస్తూ తింటున్నాను.

"ఇందాక అడిగిందానికి జవాబు చెబుతున్నా. దేవుడి గర్భగుడిలో నిలబడ్డ వారికెవరికైనా భయాలూ ఆందోళనలూ ఉంటాయా!"

తల అడ్డంగా ఊపాను.

"నీ బిడ్డ ఇప్పుడు ఈ మాతృదేవత గర్భగుడిలో నిశ్చింతగా ఉంది. చీకటి భయాలు గాని భవిష్యత్తు భయాలు గాని ఏమీ ఉండవు. నన్నడిగితే మనిషి మనిషిగా ఉండేది ఆ తొమ్మిది నెలలే. పిల్లలూ దేవుడూ చల్లనివారే అని ఓ సినిమా పాట. చిన్నప్పుడు పిల్లలంతా అత్యాశలూ, స్వార్థాలూ లేకుండా త్యాగ పరోపకార గుణాలతో ఉంటారు. పెద్దయ్యే కొద్దీ వికృతంగా తయారవుతారు!"

"చాలా చక్కగా విశ్లేషించావు. ఇవన్నీ నీకెలా తెలుసమ్మా?" అమాయకంగా అడిగాను.

నవ్వింది. ''ఇక నుంచి నీకూ చాలా తెలుస్తాయిలే!" నుదుటి మీది జుట్టును సరిచేస్తూ అంది.

నా హబ్బీ అజయ్ ఆఫీసు నుంచి వచ్చారు. అత్తగార్ని చూసి ఆశ్చర్యానందాలతో అన్నారు

"థాంక్ గాడ్! ఎప్పట్నుంచో రిక్వెస్ట్ చేస్తుంటే ఇప్పటికొచ్చారన్నమాట!"

"మీ మావగారికి సమయానికి అన్నీ అమర్చి పెట్టడానికి నా కజిన్ని ఇంట్లో పెట్టి వచ్చాను. బరువు బాధ్యతలు పెరిగేక ఎక్కడికి వెళ్లాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి గదయ్యా!"

"ఇదీ బాధ్యతే కదా...!"

"అందుకే వచ్చేశాను. అయినా మీ అమ్మగార్ని పిలుచుకోమని చెప్పానుగా"

"పిలిచాను. ఈటైంలో కన్నతల్లే పక్కనుండాలి అన్నారు"

"అదీ నిజమేలే. తల్లితోనే అన్నీ చెప్పుకోగలరు"

టీ తాగుతూ, "మీకేమనిపిస్తోంది ఆంటీ. సుజిత కడుపులో ఉన్నది ఎవరనుకుంటున్నారు?" నా వంక చిలిపిగా చూసి ఆసక్తిగా అడిగారు అజయ్.

"ఎవరైనా ఈ అమ్మ ప్రసాదమే" నవ్వి అంది.

''మనం ఏదేదో ఊహించుకుని తృప్తి పొందుతాం గాని, కొడుకైనా కూతురైనా ఒకటేనయ్యా!"

"తేడా ఏం లేదంటారా?"

"ఒకేలా పుడతారు. ఒకే పాలు తాగుతారు. ఒకే తల్లి కన్నవాళ్లు గనుక ఒకేలా పెరుగుతారు. పెద్ద చదువులు చదువుతారు. ఆ తరువాత వారు ఎన్ని మెట్లు ఎక్కినా మీరు ఆగిపోయేది మొదటి మెట్టు దగ్గరే!"

అమ్మ లేచి లోపలికెళ్లగా అన్నారు "ఆంటీ అలా మాట్లాడుతున్నారేంటి. మీ అన్నయ్య సరిగా పట్టించుకోవట్లేదా!"

"మీరే అడక్కపోయారా!"

"పరిహాసాలొద్దు. సీరియస్‌గా చెప్పు"

"మనిషి ఎదిగే కొద్దీ స్వార్థం పెరిగి మనసు కుంచించుకుపోతుందిట! అత్తయ్య మామయ్యలను మనం ఎలా చూస్తున్నామో మనకు తెలీంది కాదుగా! అది మనకు ఇంకా బాగా తెలియాలంటే మన పిల్లలకు పెళ్లిళ్లవ్వాలి!" గల గలా నవ్వేశాను.

"బిడ్డకి బొడ్డు కోయకుండానే పెళ్లి పీటలు

ఎక్కించేస్తున్నావన్నమాట. ఎంతైనా మీ అమ్మలు అమ్మలే. మీకు వందనం!" చేతులు జోడించి దణ్ణం పెడుతోంటే వారించాను.

అమ్మ వచ్చాక నా మనశ్శరీరాలు రెండూ తేలికపడ్డాయి. హాయిగా కంటి నిండా నిద్రపోతున్నాను.

పాలక్ పన్నీరు, వెల్లుల్లి పాలకూర, పాలకూర వేసిన పప్పు, బంగాళదుంప మెంతికూర, కొబ్బరిపాలతో వండిన కూరలు, మునగాకు కూర ఎక్కువగా వండేస్తోంది అమ్మ.

తినలేక పోతున్నానన్నా వినటం లేదు. "రేపు పాలు బాగా పడాలంటే ఇవాళ్టి నుంచే ఇవి ఎక్కువగా తినాలి" అంటూ క్లాసు పీకుతోంది!

"అయ్యిందా నీ పెళ్లి" అన్నట్టు చూస్తున్నారు అజయ్.

''ఇడిడి దగ్గరపడింది. డాక్టర్ వెంటనే జాయినవ్వమంటుందేమో" అనుకుంటూ ఆసుపత్రికి వెళ్లాం.

డాక్టర్ స్టెత్తో నా కడుపు మీద చెక్ చేసింది. మరే మనిపించిందో గాని మళ్లీ మళ్లీ చూసింది.

"ఏమైంది డాక్టర్" ఆందోళనపడ్డాను.

"కంగారు పడాల్సిందేమీ లేదు గాని బిడ్డ కదలికలు ఎక్కువయ్యాయా లేదా!"

"ఈ మధ్య కొంచెం తగ్గాయి..." జవాబిచ్చాను. నా స్వరం ఎందుకో నాకే వింతగా అన్పించింది!

"రేపే జాయిన్ చెయ్యండి. సిజేరియన్ చేయాల్సొచ్చేలా ఉంది"

''అదేవిటి డాక్టర్. ఇడిడికి ఇంకా పది రోజులుందిగా" వెంటనే అన్నారు అజయ్.

"చూద్దాం... ముందైతే జాయినవ్వండి..."

"బిడ్డ ఎదుగుదల సక్రమంగానే ఉందిగా!" అమ్మ లోగొంతుతో అడిగింది.

"ఇప్పుడే ఏం చెప్పలేను. రేపొస్తారుగా. మరిన్ని టెస్టులు చేద్దాం"

మరో మాటకు అవకాశం ఇవ్వలేదు.

"తొలికాన్పు. బిడ్డ బాగా భయపడుతోంది..." ఇంకేదో అనబోయి ఆగింది అమ్మ.

''ఆ మాత్రం టెన్షన్ ఉంటుంది. అది సహజం....!"

డాక్టర్ ఏదో దాస్తున్నట్టుగా అనిపించింది. బహుశా అమ్మకీ, ఆయనకీ అలాగే ఉందేమో కాని ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

ముగ్గుర్లోనూ ఆకలి, ఉత్సాహం అమాంతం చచ్చిపోయాయి.

నా చిన్ని బుజ్జికి ఏం కాదు కదా! "దేవుడా చల్లగా చూడు! బిడ్డతో నీ కొండకొస్తాం. మా తలనీలాలు సమర్పిస్తాం!" మూగగా మొక్కుకున్నాను.

కళ్ల నుంచి ధారలు కట్టడం చూసి కలవరపడింది అమ్మ.

"ఏదేదో ఊహించుకుని భయపడతావేంటి పిచ్చి పిల్లా. ఇప్పుడేమైందని!" కళ్లు తుడుస్తూ అంది.

"ఏమీ కాదని నా మీద ఒట్టేసి చెప్పమ్మా" నా వంక కించిత్తు భయంగా చూసి కళ్లు మూసుకుని నా తల మీద చెయ్యేసింది అమ్మ "నీకు ఏమీ అవ్వదు. నీ బిడ్డకూ ఏమీ కాదు. దేవుడు మనల్ని చల్లగా చూస్తాడు!"



అమ్మ చెయ్యి పట్టుకుని లాగి, "నిజం చెప్పమ్మా. ఎలాంటి వార్త అయినా సరే తట్టుకోగలను. ధైర్యంగా వుంటాను. ప్రామిస్... చెప్పమ్మా" అర్థించాను. నా తల నిమురుతూ ఎటో చూస్తుండిపోయింది! సిజేరియన్ చేశారు. నాకింకా మగతగానే ఉంది. "పాపా బాబా...!" ఆత్రుత అణచుకోలేకుండా ఉన్నాను. "పాప..." "ఏదీ ఎక్కడుంది నా చిన్నారి...!" చుట్టూ వెతుకుతోంటే, "చనిపోయింది..." బాధగా చెప్పింది నర్సు. "నో... అలా జరగదు. జరగడానికి వీల్లేదు...!" అరచి గోల చేస్తోంటే డాక్టరొచ్చి సెడటివ్ ఇచ్చింది. మత్తుగా పడుకుండి పోయాను.

కించిత్తు భరోసా చిక్కింది. కాని పాత భయాలన్నీ ఒక్కసారిగా నిద్రలేచి ఒళ్లు విరుచుకోసాగాయి!

మర్నాడే ఆసుపత్రిలో జాయినయ్యాను. ఏవో టెస్టులు చేశారు. అమ్మ, అజయ్లతో ఏవో మంతనాలాడారు.

"ఇవాళే సిజేరియన్ చేసేస్తారట....!"

"నొప్పులు రావట్లేదు కదా!"

"అందుకనే" నిర్లిప్తంగా అంది అమ్మ. అజయ్ ముఖం చాటేశారు .

అమ్మ చెయ్యి పట్టుకుని లాగి, "నిజం చెప్పమ్మా. ఎలాంటి వార్త అయినా సరే తట్టుకోగలను. ధైర్యంగా వుంటాను. ప్రామిస్... చెప్పమ్మా" అర్థించాను.

నా తల నిమురుతూ ఎటో చూస్తుండిపోయింది!

సిజేరియన్ చేశారు. నాకింకా మగతగానే ఉంది. "పాపా బాబా...!" ఆత్రుత అణచుకోలేకుండా ఉన్నాను.

"పాప..."

"ఏదీ ఎక్కడుంది నా చిన్నారి...!" చుట్టూ వెతుకుతోంటే, "చనిపోయింది..." బాధగా చెప్పింది నర్సు.

"నో... అలా జరగదు. జరగడానికి వీల్లేదు...!" అరచి గోల చేస్తోంటే డాక్టరొచ్చి సెడటివ్ ఇచ్చింది. మత్తుగా పడుకుండి పోయాను.

నా బిడ్డను ఎవరో కత్తితో కసబిసా పొడుస్తున్నట్టు కల వచ్చింది. చటుక్కున లేచాను. చుట్టూ పిచ్చిగా చూశాను. ఏ పక్క నుంచైనా నా బిడ్డ 'అమ్మా' అంటూ వస్తుందేమోనన్న ఆశతో వెదికాను. పిమ్మట నోరు నొక్కుకున్నాను. ఆ పైన జీవచ్ఛవం అయ్యాను!

మాకెవరికీ ఆకళ్లు లేవు. మాటలసలే లేవు. అందరం తలో పక్కన కన్నీరు మింగుతూ కూర్చున్నాం.

తెల్లవారు జామున రొమ్ములు బరువెక్కాయి. కాస్సేపటికే ఎంతో నొప్పిగా ఏదో సలపరంగా అనిపించింది. అమ్మకు చెప్పి, ఏదైనా మందు ఇస్తారేమో కనుక్కోమన్నాను.

నా వంక జాలిగా చూసి బాత్రూంకి తీసుకెళ్లింది.

"గోడ మీదకు పిండేసెయ్"

కన్నీళ్లు కన్పించకుండా తల తిప్పుకుని గబగబా బయటికి నడిచింది.

దిగ్భ్రమగా నిలబడిపోయాను. నొప్పి ఎక్కువవుతోంది. రిలీజ్ చేసుకోక తప్పదని, గుండె దిటవు చేసుకుని గోడవైపు తిరిగి పిండాను.

చివ్వున చిమ్మాయి చనుపాల ధారలు!

నా బిడ్డ కడుపు నింపాల్సినవి వృథాగా డ్రైనేజ్లోకి...!

దుఃఖం ఆగలేదు. కాస్సేపటికి ఏదో అనుమానం రాగా పాల వంక చూశాను. పచ్చగా ఉన్నాయి.

కంగారుపడ్డాను. తెల్లగా లేవేం? ఇదేమీ రోగం కాదు కదా? ఇవే నా బిడ్డని పొట్టన పెట్టుకో లేదు కదా?

తిరిగొస్తూనే అమ్మని నిలదీశాను.

"బాలింత పాలు అలాగే ఉంటాయి. వాటిలో రోగ నిరోధక యాంటీ బాడీలు ,మరెన్నో ఔషధాలు, పోషకాలు ఉంటాయి. అవి బిడ్డ సక్రమ ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడతాయి. అందుకే తల్లి పాలను మించింది లేదని చెప్పేది! చూశావా భగవంతుడి లీల. పిల్లలకు రెడీమేడ్ ఆహారాన్నే కాదు ప్రాథమిక ఔషధాలూ ఇస్తోంది తల్లి!"

వెక్కి వెక్కి ఏడ్చాను. "ఇక్కడ ఉండలేను. మనింటికి వెళ్లిపోదాం..."

"కుట్లు విప్పాలి కదే. 4,5 రోజులు తప్పదు..."

"ఇది ఆసుపత్రి కాదు నా బిడ్డను చంపిన వధ్యశాల!" కసిగా అన్నాను.

"అదిగో ఆ తొట్టెల్లోని చంటి పిల్లలంతా ఇక్కడ పుట్టినవారే. మన దురదృష్టానికి ఇంకొకర్ని నిందించడం మంచిది కాదు"

ఆ తొట్టెల వంక అసూయగా చూశాను. నా

బిడ్డ పోయాడు. కాని వారంతా చక్కగా బతికే ఉన్నారు! దేవుడా, నాకింత అన్యాయం చేశావేంటి! ఒకేసారి అందర్నీ మింగేసి నీ కక్ష తీర్చుకోలేక పోయావా!

నేను రోదిస్తోంటే నా వేదన చూడలేక అజయ్ బయటికెళ్ళిపోయారు .

నర్సు వచ్చింది. సందేహిస్తూ చూస్తోంటే, "టాబ్లెట్సా? నాకేం వద్దు. ఇంకేం మిగిలిందనీ!" ఏడుస్తూనే అరిచాను.

"అది కాదు. రెండ్రోజుల క్రితం పుట్టిన ఈ బిడ్డ తల్లికి పాలు పడలేదు. బయటి పాలు పట్టిస్తే వెంటనే కక్కేసుకుంటున్నాడు. మీరేమైనా కానిని పాలిస్తారేమోనని తీసుకొచ్చాను...!"

కయ్మని మీద పడి కరిచేశాను. "నా బిడ్డపోయి నేనేడుస్తోంటే, నా బిడ్డ తాగాల్సిన పాలను ఇంకొకరికి పట్టనా? అలా అడగటానికి సిగ్గుగా లేదూ? ఫో ఫో అవతలికి...!"

"డొక్కలు ఎగరేస్తున్నాడు. పాలు పట్టించక పోతే...!"

"చస్తాడు. అంతేగా. చావనీ. నా బిడ్డ చావలేదూ! ఫో!"

ఉరిమేసరికి భయపడి పారిపోయింది. అమ్మ వచ్చి నా పక్కలో కూర్చుని అనునయించింది. "నీ పాలు ఆ పిల్లాడికిచ్చి బతికించు. వృథాగా బాత్రూంలో పోయే కన్నా... ఆలోచించు. అమ్మపాల దానం మహా పుణ్యం. భగవంతుడు మెచ్చుకుంటాడు. నీకింతకింతా కలిసొస్తుంది...!"

సాలోచనగా అమ్మ ముఖంలోకి చూశాను. తలాడించింది. సైగ అర్థమై నేనూ తలాడించాను.

అమ్మ వెళ్లి నర్సునీ బిడ్డనీ తీసుకొచ్చింది. గుక్క పెట్టి ఏడవడానికి కూడా శక్తి లేక డొక్కలు ఎగరేస్తూ వెక్కిళ్లు పెడుతున్నాడు!

వాడిని చేతుల్లోకి తీసుకున్నాను. నా బిడ్డా ఇలాగే ఉండి ఉంటుందా?!

పళ్ల బిగువున దుఃఖోధృతికి ఆనకట్ట వేసి వాడి నోటికి చన్ను అందించాను. ఒక నిమిషం కుమ్మి మెల్లగా తాగాడు.

ఆ చిన్నారి పెదాలు నా రొమ్ముని తాకేసరికి నాలో మాతృత్వం జలజల పారింది. పాలు మరింతగా పొంగి వచ్చాయి. వాడినే అపురూపంగా చూస్తూ తల నిమురుతూండిపోయాను. వాడి పొట్టనిండగానే నిద్రలోకి జారుకున్నాడు.

నర్సుకి అందించాను. ఆ బిడ్డ తల్లి పరుగున వచ్చి కాళ్లకు దణ్ణం పెట్టింది. "నువ్వు మా దేవతవి!" పొగిడేసింది.

చిత్రం! నా రెండో రొమ్ములో సలపరం మొదలైంది. బ్లౌజు పాలతో తడవసాగింది!

అమ్మకు చెప్పాను. అయిదు నిమిషాల్లో మరో బిడ్డను తీసుకొచ్చారు.

**ఆ చిన్నారి పెదాలు నా రొమ్ముని తాకేసరికి నాలో మాతృత్వం జలజల పారింది. పాలు మరింతగా పొంగి వచ్చాయి. వాడినే అపురూపంగా చూస్తూ తల నిమురుతూండిపోయాను. వాడి పొట్టనిండగానే నిద్రలోకి జారుకున్నాడు. నర్సుకి అందించాను. ఆ బిడ్డ తల్లి పరుగున వచ్చి కాళ్లకు దణ్ణం పెట్టింది. "నువ్వు మా దేవతవి!" పొగిడేసింది.**

ఆడపిల్ల. క్యూట్‌గా ఉంది. నా బిడ్డ పాలు వీళ్లకు ప్రాప్తం!

ఆ సాయంత్రం నన్ను నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లోకి తీసుకెళ్లి అక్కడున్న శిశువుల్లో ముగ్గుర్ని చూపించారు. వారిలో ఇద్దరు తల్లిపాలు తాగే భాగ్యానికి నోచుకో లేదుట . మూడో శిశువుకి కామెర్లు వచ్చాయిట. కడుపునిండా పాలు తాగితేనే మూత్రం ద్వారా కామెర్లు తొలగిపోతాయట. ఆ తల్లిపాలు సరిపోవట్లేదని ఫొటోథెరపీ ద్వారా తెలిసిందిట!

నాకు ఆ ముగ్గురిలో త్రిమూర్తులు కనిపించారు.

మరుక్షణం అనసూయగా మారాను!

రోజూ ఆ అయిదుగురికీ పాలుపడుతున్నాను. నాకెంతో తృప్తిగా ఉంది. వారి గొంతులో పాలు కాదు అమృతం పోస్తున్న అనుభూతి కలుగుతోంది . పరమానందపడ్డాను. చిత్రంగా నా బిడ్డ పోయిన వేదన చేత్తో తీసేసినట్టు పోయింది!

నా బిడ్డకు అమ్మని కాలేకపోతేనేం, ఎందరో పిల్లలకు ప్రాణం నిలబెట్టి వారికి పెద్దమ్మనయ్యాను!

అమ్మ, అజిత్ వేనోళ్ల అభినందించారు. డాక్టర్లూ నర్సులూ కొత్త అమ్మలూ సరే సరి!

డిశ్చార్జ్ చేశారు. వెళ్లే ముందు డాక్టర్ రూంలోకి వెళ్లాను.

"డాక్టర్! నాకు పాలు ఎక్కువగా పడ్డాయి. క్రిటికల్‌గా ఉన్న పిల్లలకు అవసరమంటే నా పాలు పిండి పంపిస్తాను..."

గబుక్కున లేచొచ్చి హత్తుకుంది.

"అమూల్యమైనవి తల్లిపాలు. వాటి ఆవశ్యకత నవజాత శిశువులకు ఎంతో ఉంది. అవి దొరక్క నానా ఇబ్బంది పడుతున్నారు. తల్లిపాలతో పిల్లలు ఎంతో త్వరగా కోలుకోగలుగుతారు. అందుకనే తల్లిపాలు దొరకక ఇబ్బంది పడుతున్న పిల్లల కోసం మదర్ మిల్క్ బ్యాంక్ ప్రారంభిస్తున్నాం. దానికి నీతోనే శ్రీకారం చుడతాం. నువ్విక్కడికి రానవసరం లేదు. మేమిచ్చే పాకెట్స్ లేక బాటిల్స్‌ల్లో పట్టి వాటిని డీప్ ఫ్రిడ్జ్‌లో భద్రపరిస్తే చాలు. మా ప్రతినిధులొచ్చి కలెక్ట్ చేసుకుంటారు. నీలాగే తల్లిపాల విలువ తెలిసిన బాలింతలంతా ముందుకొచ్చి తమ బిడ్డకు సరిపోగా మిగిలిన చనుపాలను మా బ్యాంకుకి దానం చేస్తే ఎందరో నవజాత శిశువులకు ప్రాణదానం చేసిన వారవుతారు! "

కారు ఎక్కుతోంటే అంది అమ్మ. "అసలైన అమ్మవి అనిపించుకున్నావు. ఇవి బాలింతలు తప్ప ఇంకెవరూ చెయ్యలేని భగవత్సేవ. ఈ పుణ్యం నీకు శ్రీరామరక్ష అవుతుంది. మూడు నెలలు తిరక్కుండానే నీళ్లోసుకుంటావు. ఏడాది తిరక్కుండానే ఇదే ఆసుపత్రిలో పండంటి బిడ్డని కంటావు చూడు!"

సాక్షాత్తు అలివేలు మంగమ్మే కొండదిగి వచ్చి ఆశీర్వదించినట్టనిపించింది!

అమ్మ చేతిని నా చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాను.

"నేను పొగడకూడదు గాని, నువ్వు జగన్మాత వయ్యావు తల్లీ!" ★



# పర్యావరణ హితైషి గజాననుడు

**అర్చనలు, ఆరాధనుల, యజ్ఞయాగాదులు వినాయకుడి తొలిపూజతోనే ప్రారంభం కావడం సనాతన సంప్రదాయం. ప్రమథగణాలకు ఆధిపత్యం పొందినందున గణపతిగా,విఘ్నాలను నివారించే విఘ్నేశ్వరుడిగా పూజలందు కుంటున్నాడు. భాద్రపద శుద్ధ చతుర్దశిని అభయవరద చతుర్థి అంటారు. తాము తలపెట్టిన కార్యాలు నిర్విఘ్నంగా కొనసాగాలని అభయం కోరుతూ, దేవతల నుంచి సామాన్యుల దాకా ఆ రోజున గణనాథుని అర్చిస్తారు.**



గజాననుడు ఆధ్యాత్మిక, సామాజిక, విజ్ఞాన, ఆరోగ్యాది అంశాల సమాహారం. ఆయనను ప్రణవనాద స్వరూపుడిగా, శబ్ద బ్రహ్మ ఆకృతిగా ముద్గల పురాణం, లోకరక్షకుడిగా గణేశ పురాణం, సమస్తలోకానికి ఆధారశక్తిగా గణేశ గీత చెబుతున్నాయి. గణాధిపతిగా సర్వసమర్థుడిగా వినుతికెక్కిన అంబికానందనుడి నుంచి దేవతలు, మహర్షులూ ఏదో ఒక సందర్భంలో, ఏదో ఒక రూపంలో సహాయసహకారాలను అందుకున్నవారే. పంచమవేదంగా కీర్తినందుకున్న మహాభారత రచనకు వ్యాసమహర్షి ఆయనను లేఖకుడిగా నియమించుకోవడం అందుకు ఒక ఉదాహరణ.

గణేశ, ముద్గల, బ్రహ్మ, బ్రహ్మాండ పురాణాలు విఘ్నేశ్వరుని విభూతులను విశదీకరిస్తున్నాయి. వేదాలు, ఉపనిషత్తులు, శతకాలు, ప్రబంధాలు ఆయన మహిమను కొనియాడాయి. ఆయనను అర్చించడంతో సర్వ విఘ్నాలు సమసిపోయి, సమస్త విజయాలు సంప్రాప్తిస్తాయని వివరిస్తున్నాయి. దేవతల నుంచి సామాన్య మానవుల వరకు ఎదుర్కొనే విఘ్నాలను, ప్రతికూల శక్తులను నిలువరించి, వారు చేపట్టే కార్యాలు విజయ తీరాలకు చేరేందుకు ఆయన కృప ఉపకరిస్తుందని వేదవాక్కు.అందుకు ఎన్నో గాథలు ఉదాహరణలు. యజ్ఞత్వం, దైవత్వం, మంత్రత్వం, ద్రవ్యత్వం ...అనే నాలుగు అంశాలతో కూడుకున్నదే గణేశార్చన. ఊర్ధ్వలోకాల ఉద్ధరణ, దేవగణాలకు నేతృత్వం, భువిపై జీవుల మనుగడ పర్యవేక్షణ, సస్యకారక శక్తిని పెంపొందించడం ఆయన చతుర్భుజాలతో నిర్వహించే పాత్రలుగా ప్రవచనకర్తలు విశ్లేషిస్తారు.

వినాయకుడిని ప్రధాన దైవంగా ఆరాధించే మతాన్ని గాణపత్యం అంటారు. అయినా, ఆయన సర్వమతాలకు ఆరాధ్యదైవం. దేశవిదేశాల్లోనూ ఆయనకు విశేష సంఖ్యలో ఆలయాలు ఉన్నాయి. మాతాపితరులను దైవంగా భావించి, పూజించి గణాధిపత్యం పొందిన గణపతి,ఆదర్శపుత్రుడిగా భావి తరాలకు మార్గదర్శి. శక్తి,యుక్తి ఐశ్వర్యం, ఆనందం-అనే నాలుగు అంశాల పరిపూర్ణతత్త్వమే గణపతి రూపమని శాస్త్రవాక్కు.

పరమేశ్వరుడు, పరాశక్తి ఏకీకృతంగా ప్రకటించిన ప్రసన్న భావమే గణపతి స్వరూపమని బ్రహ్మాండపురాణం, పార్వతీదేవి శరీరం నుంచి ఉత్పన్నమైన మట్టి (నలుగు) ద్వారా గణపతి ఆవిర్భవించినట్లు శివమహాపురాణం, శబ్దస్పర్శ రూపరసగుణాల మేలుకలయిక గణేశుడని అధర్వణవేదం పేర్కొంటున్నాయి. ప్రకృతి ఆకృతే గణపతి ('ప్రకృతీ పురుష అభేదాత్మకః గణేశః')అని గణేశ పురాణోక్తి. పృథ్వీతత్తం గల మూలాధార చక్రానికి అధిష్ఠానదైవం గణనాథునిగా పతంజలి యోగశాస్త్రం చెబుతోంది. మట్టి వినాయకుడిని పూజించాలనడంలోని రహస్యమిదేనంటారు. మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఆగమశాస్త్రం కూడా చెబుతోంది. పర్యావరణ కాలుష్య బెడదను ఎరిగిన మన పెద్దలు ఏర్పరిచిన సంప్రదాయం ఇది. గణపతి జలరూపానికి ప్రతినిధి ('జలరూపో వినాయకః') కనుక మట్టితో చేసిన వినాయక ప్రతిమను నీళ్లలో లయం చేయాలి. చెరువు నుంచి సేకరించిన మట్టితో తొమ్మిది అంగుళాల ఎత్తుగల ప్రతిమను తయారు చేసి, తొమ్మిది రోజులు పూజించి, మట్టిని తెచ్చిన చోటనే నిమజ్జనం చేయాలని శాస్త్రం చెబుతోంది. మనిషి జీవితంలో ఎంత వైభోగం అనుభవించినా, దేహత్యాగం తరువాత పంచభూతాల్లో కలవడం అనివార్యం అనే సత్యాన్ని ఈ ఉదంతం వెల్లడిస్తోంది. వినాయక పూజా పత్రి నిమజ్జనాన్ని పర్యావరణం ఆరోగ్య కోణంలో చూస్తే... వర్షాల కారణంగా అప్పటికే కొత్త నీటితో నిండిన చెరువుల్లో, సరస్సుల్లో బాక్టీరియా వంటి క్రిములు చేరతాయని, ఓషధ గుణాలు కలిగిన పత్రిని ఆ నీటిలో వేయడం వల్ల, క్రిములునశించి, నీరు శుద్ధి అవుతుందని చెబుతారు.

గణపతి ప్రకృతి ప్రేమికుడు. మట్టితో చేసిన ప్రతిమ(ల)ను సహజసిద్ధ పత్రితో పూజించడం; మండపం, పాలవెల్లిని సహజ పదార్థాలతో అలంకరించడం వంటివి ప్రకృతిని గౌరవించే సంకేతాలు.మన పూర్వీకులు చెప్పిన ప్రకృతి సంరక్షణే భగవత్ సేవ' అనే సూత్రాన్ని ఈ పండుగ గుర్తు చేస్తుంది. గజాననుడి పూజ ధార్మిక వేడుక మాత్రమే కాదు. సామాజిక స్ఫూర్తి, సాంస్కృతిక ఐక్యతకు, పర్యావరణ హితాన్ని చాటిచెప్పే గొప్పసందర్భం. స్వాతంత్ర్య పోరాట సమయంలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్.. ఈ గణేశ్ ఉత్సవాలను సామూహికంగా ప్రారంభించి, ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని నింపారు.

వినాయకచవితిని పర్యావరణహితంగా జరుపుకోవాలని కోరుతూ ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కొన్నేళ్లుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఈ పండుగను కాలుష్య రహితంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల తమ 'మనకీ బాత్' (మనసులోని మాట) ప్రసంగంలో భాగంగా దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలకు బదులుగా, స్థానిక కళాకారులు మట్టితో రూపొందించే విగ్రహాలనే ప్రతిష్ఠించాలని కోరారు. ఇలా మన సంప్రదాయాలను పాటిస్తూనే, ప్రకృతి పట్ల మనకు గల బాధ్యతను నెరవేర్చవచ్చుని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాక, స్థానిక కళాకారుల వద్ద విగ్రహాలను కొనుగోలు చేయడం ద్వారా 'స్థానికులకు మద్దతు' (Vocal for Local) స్ఫూర్తిని బలపరుస్తుందని,ఇది దేశ ప్రయోజనాలకు దోహదపడుతుందని అన్నారు.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్




# 94 సంవత్సరాలు... 600 టెస్టులు..

**సంప్రదాయ టెస్టు క్రికెట్లో భారత్ మరో అరుదైన మైలురాయిని చేరింది. గాల్ వేదికగా శ్రీలంకతో జరిగిన 2026 సిరీస్ తొలిమ్యాచ్ ద్వారా 600 టెస్టుమ్యాచ్‌లు ఆడిన ఆసియా తొలిజట్టుగా రికార్డుల్లో చేరింది.**

ఎంతటి గొప్ప ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది. టెస్టు క్రికెట్లో భారత ప్రయాణం సైతం అలుపెరుగని ప్రయాణంలానే సాగింది. స్వాతంత్ర్యానికి పూర్వమే టెస్టు క్రికెట్లో తొలి అడుగువేసిన భారత్ గత 94 సంవత్సరాల కాలంలో అనూహ్యంగా ఎదిగిపోయింది. పలు అరుదైన రికార్డులు, అసాధారణ ఘనతలతో తనకు తానే సాటిగా నిలిచింది.

### 1932 నుంచి 2026 వరకూ....

మూడు ముఖాల క్రికెట్లో దేని ప్రత్యేకత దానిదే. ఐదురోజులు... నాలుగు ఇన్నింగ్స్.. రోజుకు కనీసం 80 ఓవర్లుగా సాగే సంప్రదాయ టెస్టు క్రికెట్‌నే అసలు సిసలు క్రికెట్‌గా చెబుతూ ఉంటారు. ఆ తర్వాతి కాలంలో వచ్చిన 50 ఓవర్ల వన్డే, 20 ఓవర్ల ధూమ్ ధామ్ టీ-20ల కంటే ఆధిక్యత చేతులు మారుతూ ఐదు రోజులపాటు సాగే టెస్టు సమరాన్నే క్రికెటర్లు, క్రికెట్ ప్రేమికులు ఇష్టపడుతూ ఉంటారు. క్రికెటర్ల సత్తాకు, నైపుణ్యానికి, నేర్పు, ఓర్పులకు పరీక్షగా నిలిచే టెస్టు క్రికెట్‌కు 14 దశాబ్దాల చరిత్రే ఉంది. అయితే.. అందులో భారత్‌కు 94 సంవత్సరాల అస్థిత్వం ఉంది.

తెలుగుతేజం కర్నల్ కఠారి కనకయ్య (సర్ సీకె) నాయుడు నాయకత్వంలో భారతజట్టు లండన్‌లోని చారిత్రక లార్డ్స్ మైదానం వేదికగా.. జూన్ 25,1932 న ఇంగ్లండ్ ప్రత్యర్థిగా తన మొట్టమొదటి టెస్ట్ మ్యాచ్ ఆడటం ద్వారా సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. సర్ సీకె నాయుడు, మహ్మద్ నిస్సార్, విజయ్ మర్చెంట్, లాలా అమర్ నాథ్, వినూ మన్కడ్, పంకజ్ రాయ్, దిలీప్ సర్దేశాయ్, పాలీ ఉమ్రీగర్, మన్సూర్ అలీఖాన్ పటౌడీ, అజిత్ వడేకర్, సునీల్ గవాస్కర్, గుండప్ప విశ్వనాథ్, ఫరూక్ ఇంజనీర్, మొహిందర్ అమర్ నాథ్, బిషెన్ సింగ్ బేడీ, ప్రసన్న, చంద్రశేఖర్, వెంకట్రాఘవన్, కపిల్ దేవ్, సచిన్ టెండుల్కర్, అనీల్ కుంబ్లే, మహ్మద్ అజారుద్దీన్, ద్రావిడ్, రవి శాస్త్రి, గంగూలీ, పూజారా, వీవీఎస్ లక్ష్మణ్, ధోనీ, సెహ్వాగ్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్‌ల నుంచి నేటితరం కెప్టెన్ శుభ్ మన్ గిల్ వరకూ ఎందరో ఎందరెందరో గొప్పగొప్ప క్రికెటర్లు తమ అసాధారణ ఆటతీరుతో భారత టెస్టు క్రికెట్ ను సుసంపన్నం కావించారు.

### అరుదైన, అపురూప రికార్డులు..

భారతజట్టు ఇప్పటి వరకూ ఆడిన 600 టెస్టుమ్యాచ్‌ల్లో ఎన్నో అపురూపమైన రికార్డులు ఉన్నాయి. భారత టెస్టు చరిత్రలో తొలి శతకం సాధించిన మొనగాడు లాలా అమర్ నాథ్ (1933) కాగా..ఓ ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా మహ్మద్ నిస్సార్ (1932) రికార్డుల్లో చేరారు.

భారతజట్టు తన తొలిటెస్టు విజయం నమోదు చేయటానికి రెండు దశాబ్దాలపాటు వేచి చూడాల్సి వచ్చింది. 1952 ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌పై భారత్ తన మొట్టమొదటి టెస్టు విజయాన్ని నమోదు చేసింది. తన మొట్టమొదటి టెస్టు సిరీస్ విజయాన్ని పాకిస్థాన్ ప్రత్యర్థిగా 2-1తో నమోదు చేసింది. విదేశీగడ్డపై తొలి సిరీస్ విజయం కోసం 1968 వరకూ వేచి చూసింది. తన అరంగేట్రం సిరీస్‌లోనే 774 పరుగులతో సంచలనం సృష్టించిన లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ 10వేల పరుగులు సాధించిన తొలి టెస్టు క్రికెటర్‌గా, ఓపెనర్‌గా ప్రపంచ రికార్డు నమోదు చేశాడు.

### భారత క్రికెట్లో 'సచిన్ శకం'!

పదహారేళ్ల ప్రాయంలోనే భారత టెస్టు జట్టులోకి అడుగుపెట్టిన సచిన్ టెండుల్కర్ ఆ తర్వాత రెండు దశాబ్దాలపాటు భారత క్రికెట్ మూలవిరాట్టుగా నిలిచాడు. 200 టెస్టుమ్యాచ్‌లు ఆడి 51 శతకాలతో 15వేల 921 పరుగులు సాధించిన ఒకే ఒక్కడిగా, టెస్టు క్రికెట్ ఎవరెస్టుగా, భారత క్రికెట్ దేవుడిగా మాస్టర్ సచిన్ నీరాజనాలు అందుకొన్నాడు. టెస్టు క్రికెట్లో ట్రిపుల్ సెంచరీ సాధించిన భారత తొలి క్రికెటర్ గా వీరేంద్ర సెహ్వాగ్ నిలిచాడు.

బౌలర్లలో 434 వికెట్లు పడగొట్టిన భారత తొలి బౌలర్ కపిల్ దేవ్ కాగా..ఒక ఇన్నింగ్స్‌లో 10కి 10 వికెట్లు పడగొట్టిన మొనగాడిగా అనీల్ కుంబ్లే (10- 74) ప్రపంచ రికార్డులు నెలకొల్పారు. తొలి హ్యాట్రిక్ సాధించిన ఆఫ్ స్పిన్నర్ ఘనతను హర్భజన్ సింగ్ దక్కించుకొన్నాడు. మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలో 2009లో ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలవడం ద్వారా భారత్ టెస్టు ఎవరెస్టును అధిరోహించగలిగింది.

### మూడవ జట్టుగా భారత్....

శ్రీలంకతో రెండుమ్యాచ్‌ల ఐసీసీ టెస్టు లీగ్ సిరీస్‌లో భాగంగా గాల్ వేదికగా జరిగిన తొలిటెస్టు బరిలో నిలవడం ద్వారా భారత్...టెస్టు చరిత్రలో 600 మ్యాచ్‌లు ఆడిన మూడో జట్టుగా రికార్డుల్లో చేరింది. ఇంగ్లండ్(1097), ఆస్ట్రేలియా(883)జట్లు ఇప్పటికే 600 టెస్టుల మైలురాయిని చేరితే..వాటి సరసన చేరిన తొలి ఆసియాజట్టుగా భారత్ నిలిచింది.

భారత మొట్టమొదటి టెస్టులో ఓ తెలుగు ఆటగాడు సీకె నాయుడు నాయకత్వం వహిస్తే.. 100వ టెస్టులో మన్సూర్ అలీఖాన్ పటౌడీ, 600వ టెస్టులో శుభ్ మన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తించారు. భారత అత్యంత విజయవంతమైన టెస్టు కెప్టెన్ రికార్డు విరాట్ కోహ్లీ పేరుతో ఉంది. అతని నాయకత్వంలో భారత్ ఆడిన 68 టెస్టుల్లో 40 విజయాలు నమోదు చేసింది. స్పిన్నర్ మానవ్ సుతార్ స్థానం 319 కావడం విశేషం. టెస్టు క్రికెట్లో భారత ప్రయాణం ఘనవిజయాలు, అసాధారణ రికార్డులతో నిరంతర ప్రవాహంలా కొనసాగుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.



**కృష్ణారావు చాప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# డాక్టర్ ఎంఎస్‌వీ చల్మారెడ్డి ఇకలేరు



వనపర్తికి చెందిన ప్రసిద్ధ వైద్యులు డాక్టర్ ఎంఎస్‌వీ చల్మారెడ్డి (87) అస్వస్థత కారణంగా చికిత్స పొందుతూ ఆగస్ట్ 26న స్వర్గస్తులయ్యారు. వీరు ఉమ్మడి పాలమూరు జిల్లాలో తాడూరు మండలం, పాపగల్‌లో జన్మించారు. వైద్య విద్యాభ్యాసం తరువాత ప్రభుత్వ వైద్యులుగా ఆమనగల్‌లో వైద్యసేవలు అందించడం ప్రారంభించారు. అనంతరం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులుగా పనిచేస్తూనే, విహెచ్‌పీ జిల్లా అధ్యక్షులుగా సేవలు అందించారు. 1985 నుంచి 2006వ సం. వరకు వనపర్తి జిల్లా సంఘచాలక్‌గా, 2006 నుండి 2009వరకు పాలమూర్ విభాగ్ సహ సంఘచాలక్‌గా, 2009 నుండి 2015 వరకు విభాగ్ సంఘచాలక్‌గా సంఘ బాధ్యత నిర్వర్తించారు. వనపర్తిలో ప్రత్యేకించి మహిళలకు పాజిటివ్ హెల్త్‌ను అందించడానికి యోగ కేంద్రాలు నడిపించడంలో విశేషంగా కృషిచేశారు. ఇదే సమయంలో మరొక వైపున ఆప్టే స్మారక సేవా సమితి పేరుతో వనపర్తిలోని పేద బస్తీలకు ప్రతివారం వెళ్లి వైద్యసేవలు అందిస్తూ అనేకమంది స్వయం సేవకులను సేవాకార్యంలో కార్యోన్ముఖులను చేశారు.




**నాగర్‌కర్నూల్ :** జాగృతిపత్రికను సకాలంలో అందజేస్తున్న పోస్ట్‌మెన్‌లకు రక్షాబంధన్ సందర్భంగా ఆగస్ట్ 28న నాగర్‌కర్నూల్ పోస్టాఫీస్‌లో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారప్రముఖ్ భాస్కరాచారి, నగర ప్రచార ప్రముఖ్ బండారి యాదగిరి, నగర సహ కార్యవాహ శివరావు రక్షలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్ కార్యాలయ ప్రారంభోత్సవం





**భాగ్యనగర్:** అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహా సంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎమ్) తెలంగాణ కార్యాలయ భవన ప్రారంభోత్సవం ఆగస్టు 23న భాగ్యనగర్ తార్నాకలో ఘనంగా జరిగింది. ప్రముఖ విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు, ఏబీఆర్‌ఎస్‌ఎమ్ కార్యకర్తలు, కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత ప్రచారప్రముఖ్ సునీల్ అంబేకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఏబీఆర్‌ఎస్‌ఎమ్ విశిష్టతను వివరించారు. గౌరవ అతిథులుగా ఏబీఆర్ ఎస్‌ఎమ్ అఖిల భారతీయ సంఘటన కార్యదర్శి మహేంద్రకపూర్, కర్ణాటక కేంద్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ బట్టు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్‌ఎస్‌ఎమ్ అఖిల భారతీయ సహ సంఘటన కార్యదర్శి గుంతా లక్ష్మణ్, దక్షిణమధ్య క్షేత్ర ప్రముఖ్ ప్రొ॥ఎన్.కిషన్,తెలంగాణ కన్వీనర్ డా॥ఏలూరి యాదయ్య, సహ కన్వీనర్లు ప్రొ॥ వంశీ కృష్ణారెడ్డి, డా॥రాజిరెడ్డి, అఖిలభారతీయ మహిళా సహకార్యదర్శి ప్రొ॥ సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీఆర్‌ఎస్‌ఎమ్ కార్యకర్తల కుటుంబసభ్యుల ఆత్మీయసమ్మేళనం జరిగింది.

భాగం-52 (ఈ శీర్షిక ఇంతటితో సమాప్తం)

## మార్క్సిజం-శ్రీరామరాజ్యం



# రామరాజ్య స్వరూపం

**రామరాజ్యంలో ప్రభుత్వ పరిపాలన, శాసన నిర్మాణం ఆదర్శప్రాయాలు. ధర్మం పట్ల అనురక్తి, ఈశ్వరుని పట్ల భక్తి రామరాజ్యానికి ప్రాణ తుల్యాలు. సువ్యవస్థితమైన పరిపాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండేవారు. అందరూ సంపన్నులే. రామరాజ్యంలో ప్రధానాంగాలుగా ఉన్న సిబ్బంది అందరూ క్రమశిక్షణతో, సదాచారంతో మెలిగేవారు.**

రామరాజ్య స్వరూప వర్ణనలు వాల్మీకి రామాయణంలోనూ, అధ్యాత్మ –ఆనంద రామాయణాల్లోనూ, పురాణాలు, శ్రీరామచరిత మానస్ మొదలైన వాటిలోనూ విస్తారంగా లభిస్తున్నాయి. వాటిలోని కొన్ని అంశాలు ఇక్కడ సారరూపంగా పేర్కొంటున్నాం.

**అధ్యాత్మ రామాయణం**

త్రిలోకనాథుడు, లక్ష్మీపతి అయిన భగవంతుడు రామునిగా పాలన చేస్తున్న కాలంలో పృథ్వి ధన–ధాన్య సంపన్నమై ఉండేది. వృక్షాలు చక్కగా ఫలాదులనిచ్చేవి. రామరాజ్యంలో సమస్త ప్రజలూ ధర్మపరాయణులై ఉండేవారు. ఎవరికీ కూడా తమ పుత్రుల మరణాన్ని చూడాల్సిన దుస్థితి కలిగేది కాదు.

**ఆనందరామాయణం**

రామచంద్రుని రాజ్యంలో ప్రజలందరూ ఎల్లప్పుడూ ఆనందంగా ఉండేవారు. ఆ కాలంలో ఎక్కడా దొంగతనాలు జరిగేవి కావు. కొట్లాటలు, అల్లర్లు జరిగేవి కావు. ఎవ్వరూ ఇతరులను నిందించే వారు కాదు. ఎవ్వరూ ఎవరికీ భయపడేవారు కాదు. రాజ్యం శత్రురహితమై ఉండేది. అయినా వివిధరకాలైన వాహనాలు–సేనా వాహినులు ఉండేవి. రామరాజ్యంలో ప్రజలందరూ బలశాలులు, దృఢమైన ఆరోగ్య వంతులుగా ఉండేవారు. జ్ఞానులుగా ఉండేవారు. 'ఇష్టాపూర్తములు' మొదలైన ధార్మిక కృత్యాలను నిర్వర్తిస్తుండేవారు. పొలాలన్నీ ధాన్యాదులతో కళకళలాడేవి. దేశమంతా సామరస్యం నెలకొని ఉండేది. ప్రజలంతా మంచివారై క్షమ, ఓర్పు వంటి గుణాలు కలిగిన ఉత్తములై ఉండేవారు. పశువులకు సరిపడేంత మేత దొరికేది. గోధనం అపరిమితం. దేశమంతటా అనేక దేవాలయాలుండేవి.

రామరాజ్యాన్ని ధర్మరాజ్యమని చెప్పేవారు. ధర్మ–అధర్మాలను చక్కగా వివేచన చేసి రాజ్యపాలన నిర్వహించేవారు. రాజదండాన్ని ధరించడానికి అయోగ్యులైన ఉద్యోగులకు దండాన్ని అందించేవారు కాదు. వారు శత్రువుల హృదయాలను, కన్నులను సూర్యుని వేడిమివలె మండించేవారు. మిత్రులు, స్వజనుల కన్నులకూ హృదయాలకూ చంద్రునివలె చల్లదనాన్ని పంచేవారు. ఆ విధంగా రామరాజ్యం మంగళమయంగా, ఏ రాజ్యంతోనూ పోలిక చెప్పడానికి వీలులేనిదై, రామరాజ్య మనే పేరును స్మరించగానే శుభాలను కలిగించేదై ఉండేది.

**స్కాందపురాణం**

శ్రీరామరాజ్యకాలంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించేవారు. అందరూ ధనధాన్య సంపన్నులై ఉండేవారు. పుత్ర పౌత్రాదులు కలిగి ఉండేవారు. మేఘాలు సమృద్ధిగా వర్షించేవి. పంట దిగుబడులు చాలినంతగా ఉండేవి. గోవులు కుండలకొద్దీ పాలనిచ్చేవి. వృక్షాలు అన్ని రుతువులలోనూ పళ్లనిచ్చేవి. శ్రీరామరాజ్యంలో ఏ ఒక్కరికీ శారీరక అనారోగ్యాలు కలిగేవి కాదు. మానసిక చింతలు ఉండేవి కాదు. స్త్రీలు పతివ్రతలుగా ఉండేవారు. పురుషులు పితృభక్తి పరాయణులై మసలేవారు. భర్తను కలిగినదైన ఏ స్త్రీకి దుఃఖం ఉండేది కాదు. ఏ ఒక్కరూ మాతాపితరులను, గురుజనులను అనాదరించేవారు కాదు.

రామరాజ్యంలో ఎవ్వరూ కూడా వృద్ధులు, వయసులో పెద్దవారి మాటలను ఉల్లంఘించేవారు కాదు. అందరూ పుణ్యకర్మలు నిర్వర్తించేవారు. ఎవరూ ఇతరుల భూములను లాక్కునేవారు కాదు. అందరూ పరస్త్రీ విముఖులై ఉండేవారు. ప్రజలు ఎవరినీ నిందించేవారు కాదు. ఏ ఒక్కరూ దరిద్రులు కాదు. రోగగ్రస్తులు కాదు. దొంగలు కాదు. జూదగాళ్లు కాదు. ఎవరూ మద్యపానం చేసేవారు కాదు. పాపం చేసేవారు కాదు. ఎవ్వరూ బ్రహ్మహత్యకు పాల్పడేవారు కాదు. గురుపత్నితో దుష్ప్రవర్తన కలిగి ఉండేవారు కాదు. ఎవ్వరూ స్త్రీ బాలకుల హత్యకు పాల్పడేవారు కాదు. అసత్యం పలికేవారు కాదు. వృత్తి ఉద్యోగాలను కోల్పోయేవారు కాదు. ఎవ్వరూ కూటసాక్ష్యాలు చెప్పేవారు కాదు. దుష్టులు, కృతఘ్నులు, మారిన చిత్తం కలిగినవారు ఎవరూ రామరాజ్యంలో కాన వచ్చేవారు కాదు. వేదపారంగతులైన బ్రాహ్మణులు సదా సర్వత్ర పూజలందుకునేవారని ప్రసిద్ధి. ఆ రాజ్యంలో ఎక్కడా ఎవరూ నియమ, సంయ మాలతో కూడిన వ్రతపాలన మానేవారు కాదు.

**శ్రీరామచరిత మానస్**

రామరాజ్యంలో ఎవరికీ దైహిక, దైవిక, భౌతిక తాపాలు కలిగేవి కావు. మానవులందరూ పరస్పరం ప్రేమపూర్వకంగా ఉండేవారు. వేదం బోధించిన నీతిని, మర్యాదను తు.చ. తప్పకుండా పాటించేవారు. వారివారి ధర్మాలను చక్కగా పాలించుకునేవారు. ధర్మం తనవైన సత్యం, శౌచం, దయ, దానం... అనే నాలుగు పాదాలపైన జగత్తుయందు పరిపూర్ణంగా మెలిగేది. కలలో కూడా ఎవరూ పాపం తల పెట్టేవారు కాదు. స్త్రీ పురుషులందరూ రామభక్తి పరాయణులై ఉండేవారు. అందరూ సమానంగానే పరమగతి అనగా మోక్షానికి అర్హులైనారు. పసితనంలో ఎవరికీ అపమృత్యువు సంభవించేది కాదు. ఎవరికీ ఎటువంటి పీడన కలిగేది కాదు. అందరికీ రోగరహితమైన సుందర శరీరాలు ఉండేవి. ఎవరూ దరిద్రులు కాదు. దుఃఖితులు కాదు. దీనులు కాదు. ఎవరూ మూర్ఖులు కాదు. శుభలక్షణ హీనులు కాదు. దంభరహితులుగా మసలుకునేవారు. అందరూ ధర్మపరాయణులే. పుణ్యాత్ములే. చతురులు, గుణవంతులు అయి ఉండేవారు. అయోధ్యా ప్రజలు ఉన్నతులైనవారిని ఆదరించేవారై, పండితులై, జ్ఞానులై ఉం దేవారు. ఇతరులు తమకు చేసిన ఉపకారాన్ని మరిచిపోకుండా కృతజ్ఞులై ఉండేవారు. కపటం, ధూర్తత్వం ఏ ఒక్కరిలోనూ ఉండేది కాదు.

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**

**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**

# బాల జాగృతి



## కథ

## నరేంద్రుడిని వివేకానందుడిగా మార్చిన గురువు



నరేంద్రనాథ్ దత్త చిన్నప్పటి నుంచే తెలివైనవాడు. కానీ "దేవుడు నిజంగా ఉన్నాడా? ఉంటే… ఆయనను చూడగలమా?" అనే ప్రశ్న మాత్రం ఎప్పుడూ వెంటాడేది.

ఈ ప్రశ్నకు సమాధానం కోసం అతను చాలామందిని అడిగాడు. ఎన్నో పుస్తకాలు చదివాడు. కానీ ఆయన సందేహాన్ని పూర్తిగా నివృత్తి చేసే సమాధానం మాత్రం దొరకలేదు. అలాంటి సమయంలోనే ఆయనకు శ్రీరామకృష్ణ పరమహంస పరిచయమయ్యారు. ఒకరోజు నరేంద్రనాథ్.. "మీరు దేవుడిని చూశారా?" అని శ్రీరామకృష్ణ పరమహంసనే నేరుగా అడిగారు.

"అవును. నిన్ను చూస్తున్నంత స్పష్టంగా చూశాను" అని పరమహంస సమాధానమిచ్చారు. ఆ మాటలు నరేంద్రనాథ్‌ను లోతుగా ఆలోచింప చేశాయి. అయితే, మాటలను వెంటనే నమ్మలేదు. శ్రీరామకృష్ణ పరమహంస మాటలను, ప్రవర్తన, ఆధ్యాత్మిక జీవితం అన్నింటినీ నిశితంగా గమనించాడు.

క్రమంగా, రామకృష్ణ పరమహంసలోని నిజాయతీ, ఆధ్యాత్మిక అనుభవం, భక్తి నరేంద్రనాథ్‌ను ఆకట్టుకున్నాయి. ఆయనను తన గురువుగా స్వీకరించాడు. రామకృష్ణ పరమహంస కూడా నరేంద్రనాథ్‌లోని అసాధారణమైన ప్రతిభను, ధైర్యాన్ని, నాయకత్వ లక్షణాలను గుర్తించారు. 'నీ జీవితం నీకోసం మాత్రమే కాదు… సమాజానికి, మానవాళికి ఉపకరించాలి" అనే భావాన్ని ఆయనలో నాటారు. కొంతకాలానికి శ్రీరామకృష్ణ పరమహంస శరీరాన్ని విడిచారు. గురువు దూరమైనా, ఆయన చూపిన బాట నరేంద్రనాథ్‌ను విడిచిపెట్టలేదు. సన్యాసం స్వీకరించి 'స్వామి వివేకానందుడి'గా మారాడు. దేశమంతా పర్యటిస్తూ ప్రజల జీవితాలను దగ్గరగా చూశాడు. పేదరికం, అజ్ఞానం, ఆకలి, నిరాశలను చూసిన ఆయన హృదయం కలచివేసేది.

తన గురువు బోధించిన ఆధ్యాత్మిక సందేశాన్ని కేవలం తనలోనే ఉంచుకోకుండా, దాన్ని మానవ సేవతో అనుసంధానించాడు. "జీవసేవే శివసేవ" అనే భావంతో ప్రజాసేవను జీవిత లక్ష్యంగా చేసుకున్నాడు. ప్రపంచ వేదికపై భారతదేశ ఆధ్యాత్మికతను పరిచయం చేశాడు. యువతలో ఆత్మవిశ్వాసం, ధైర్యం నింపాడు. విద్య, సేవ, వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశం ముందుకు సాగాలని పిలుపునిచ్చాడు. వివేకానంద తను గురువును కేవలం పూజించలేదు. ఆయన చూపిన మార్గాన్నే జీవితంగా మార్చుకున్నాడు. అందుకే స్వామి వివేకానందుడి జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది. ★

## మంచిమాట

మంచి మార్కులు నీ ప్రతిభను చూపిస్తాయి; మంచి ప్రవర్తన నీ వ్యక్తిత్వాన్ని చూపిస్తుంది.

## మెదడుకు మేత

ఒక ఇంట్లో ముప్పై రెండు మంది సైనికులు.. ఏమిటవి?

జవాబు : పళ్లు

## పద్యం

ఎదిరి బలము నెరిగి మెలగిన
చెడని బ్రతుకు, తన బలిమి తానే మెచ్చుచు
మదమున మెలగెడు వానికి
చెడుగే ప్రాప్తించు తుదకు తెలియు సుమతీ!

**భావం :** ఎదుటివారి బలాన్ని తెలుసుకుని జాగ్రత్తగా వ్యవహరించే వ్యక్తి సమస్యలను తప్పించుకోగలుగుతాడు. కానీ తన బలాన్ని మాత్రమే నమ్ముకుని గర్వంగా ప్రవర్తించే వ్యక్తికి చివరికి ఇబ్బందులు ఎదురవుతాయి.

## శ్లోకం

జలే తైలం ఖలే గుహ్యం
పాత్రే దానం మనాగపి
ప్రాజ్ఞే శాస్త్రం స్వయం యాతి
విస్తారం వస్తుశక్తితః

**భావం :** నీటిలో నూనె, మూర్ఖుడిలో రహస్యం దాగవు. దానం గుణం కలవారు తగినవాడు కనిపిస్తే దానం చేయకుండా ఉండలేరు. అలాగే పండితులలో శాస్త్రం విస్తరించి, స్వయం ప్రకాశితమవుతుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| చార్మినార్ | ముంబై |
| గేట్‌వే ఆఫ్ ఇండియా | హైదరాబాద్ |
| హవా మహల్ | ఆగ్రా |
| తాజ్ మహల్ | జైపూర్ |
| గోల్డెన్ టెంపుల్ | అమృత్‌సర్ |

**సమాధానాలు :** చార్మినార్–హైదరాబాద్; గేట్‌వే ఆఫ్ ఇండియా–ముంబై; హవా మహల్–జైపూర్; తాజ్ మహల్–ఆగ్రా; గోల్డెన్ టెంపుల్–అమృత్‌సర్.

## శాస్త్రవేత్తలు

### ఆర్.ఏ. మసెల్కర్



మహారాష్ట్రకి చెందిన ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, పరిశోధకుడు. పాలిమర్ సైన్స్, కెమికల్ ఇంజినీరింగ్ రంగాల్లో విశేష కృషి చేశారు. సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్‌గా, నేషనల్ కెమికల్ లాబొరేటరీ డైరెక్టర్‌గా పనిచేశారు.సీఎస్ఐఆర్ భారతీయ సంప్రదాయ జ్ఞానాన్ని రక్షించే క్రమంలో, పసుపుపై అమెరికాలో మంజూరైన పేటెంట్‌ను రద్దు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. తక్కువ వనరులతో ఎక్కువ మందికి ఉపయోగపడే "ఇంక్లూజివ్ ఇన్నోవేషన్" భావనను ప్రోత్సహించారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో చేసిన కృషికి పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ వంటి గౌరవాలు లభించాయి.

## జనరల్ నాలెడ్జ్

1. ఎన్నికల్లో ఓటు వేయడం అనేది ఏ హక్కు?
2. డేవిస్ కప్ ఏ క్రీడకు సంబంధించినది?
3. కొల్లేరు సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?

సమాధానాలు : 1. రాజకీయ హక్కు; 2. టెన్నిస్; 3. ఆంధ్రప్రదేశ్.

## భక్తాగ్రేసరులు

### స్వామి విరజానంద



'ఆత్మనోమోక్షాయ-జగత్ హితాయచ' అనే సందేశాన్ని జీర్ణించుకొన్న వారు స్వామి విరజానంద (కాళీకృష్ణ). బాల్యం నుంచి ఆధ్యాత్మిక చింతన గల ఆయనకు చదువుపై ఆసక్తి తగ్గింది. ధార్మిక గ్రంథ పఠనం పెరిగి, మనసు సన్యాసం వైపు మొగ్గింది. స్వామి వివేకానంద నుంచి సన్యాసం స్వీకరించిన వారిలో ఆయన ఒకరు. కష్టించి పనిచేయడం, ధ్యానం ఆయన జీవితంలో ప్రధాన భాగాలయ్యాయి. తీవ్రంగా ధ్యానం చేసి,అంతలోనే పొలం పనిలో నిమగ్నమయ్యేవారు 'దేనికైనా సిద్ధంగా ఉండాలి. రోజూ ధ్యానం చేయి. మిగిలిన కాలం సత్ గ్రంథాలు చదువు. లోకానికి హితమైన పనులు చేయి' అని వివేకానంద చేసిన బోధనను విరాజానంద అక్షరాల పాటించారు. వివేకానందకు వ్యక్తిగత సేవలు చేయడం, ఆయన రచనలు సంకలనం చేయడం, ఆశ్రమాల నిర్వహణ బాధ్యతలు వంటివి నిర్వర్తించారు. 'ఎవరి మనసు నొప్పించకు. మనసే మందిరం కదా' అన్న కబీరు సూక్తిని వేద వాక్యంగా భావించారు. ★



# వారఫలాలు

07-13 సెప్టెంబర్, 2026



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

మీపట్ల బంధువులు మరింత ప్రేమానురాగాలు. విద్యార్థులు ప్రతిభను చాటుకుంటారు. ఆదాయసంతృప్తికరం, అప్పులుతీరతాయి. ప్రముఖ వ్యక్తుల పరిచయం. వ్యాపారులకు క్రమేపీ అనుకూల పరిస్థితులు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఆటంకాలు తొలగుతాయి. పారిశ్రామిక వర్గాలకు విదేశీ యానం. కళాకారులు, సాంకేతిక నిపుణులు విదేశీ పర్యటనలకు సంసిద్ధులవుతారు. 9,10 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. దేవీఖడ్గమాల పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆలోచనలు స్థిరంగా ఉండవు. మీ నిర్ణయాల కోసం కుటుంబసభ్యులు ఎదురుచూస్తారు. అయినా తొందరపాటు వద్దు. తరచూ ప్రయాణాలు సంభవం. దేవాలయాల సందర్శనం. వ్యాపారులు లాభనష్టాలు సమాన స్థాయిలో భరించాల్సిన పరిస్థితి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు తప్పవు. పారిశ్రామికవేత్తలు, రచయితలకు విదేశీ పర్యటనలు వాయిదా పడవచ్చు. 10,11 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. హనుమాన్‌ఛాలీసా పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

మీ నిర్ణయాలు కుటుంబసభ్యులను మెప్పిస్తాయి. సంఘంలో విశేష గౌరవం పొందుతారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహన యోగం. ప్రముఖులతో పరిచయాలు. వ్యాపారులకు లాభాలు దక్కి ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగులకు ప్రోత్సాహ కరంగా ఉంటుంది. రాజకీయవర్గాలకు పదవీ యోగం. క్రీడాకారులు, సాంకేతిక నిపుణులకు విశేష గుర్తింపు దక్కుతుంది. 12,13తేదీల్లో ఖర్చులు. శారీరక రుగ్మతలు. లక్ష్మీస్తుతి మంచిది.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఎంతటి వారినైనా వాక్పటిమతో ఆకట్టుకుంటారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు అరుదైన అవకాశాలు దక్కుతాయి. పారిశ్రామిక, రాజకీయ వేత్తలకు అంచనాలు నిజమవుతాయి. క్రీడాకారులు నైపుణ్యాన్ని చాటుకుంటారు. 7,8 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. విష్ణుసహస్రనామ పారాయణ పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కుటుంబంలో శుభకార్యాలపై సంప్రదింపులు జరుపుతారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో చికాకులు తొలగి ముందుకు సాగుతారు. కళాకారులకు సన్మానాలు. పరిశోధకులు, క్రీడాకారులకు అరుదైన పురస్కారాలు దక్కవచ్చు. 9,10 తేదీలలో వివాదాలు. శారీరక రుగ్మతలు. సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

వాహనాలు, భూములు కొనుగోలులో ప్రతిబంధకాలు తొలగుతాయి. వ్యాపారులు అనుకున్న లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు రాగల అవకాశం. రాజకీయవర్గాలకు నూతనోత్సాహం. రచయితలు, పరిశోధకులు అందరిలోనూ ప్రత్యేకతను నిలుపుకుంటారు. 11,12 తేదీలలో వృథా ఖర్చులు. ఆరోగ్యసమస్యలు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. పెద్దల సలహాలు స్వీకరిస్తారు. వ్యాపారులకు మరింత అనుకూలస్థితి. ఉద్యోగులకు ఉన్నత శ్రేణి నుంచి ప్రశంసలు అందుతాయి. కళాకారులకు అవార్డులు. పరిశోధకులు, క్రీడాకారులు సత్తా చాటుకుంటారు. 8,9 తేదీల్లో దూరప్రయాణాలు. వృథాఖర్చులు. శారీరక రుగ్మతలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఉద్యోగయత్నాలు మరింత అనుకూలిస్తాయి. వాహనయోగం. ఇంటి నిర్మాణయత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారులు పెట్టుబడులకు తగినంతగా లాభాలు పొందుతారు. ఉద్యోగులకు పదోన్నతులు రావచ్చు. రాజకీయ వర్గాలకు కొత్త పదవులు. రచయితలు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు. 9,10 తేదీల్లో ఆరోగ్య,కుటుంబసమస్యలు. మానసిక అశాంతి. కనకదుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. ఆలోచనలు అమలు చేస్తారు. శత్రువులు కూడా స్నేహితులుగా మారతారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఆటంకాలు తొలగుతాయి. పారిశ్రామిక వేత్తలకు అరుదైన అవకాశాలు. కళాకారులు, పరిశోధకులకు ఆహ్వానాలు అందు తాయి. 8,9 తేదీలలో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. ఖర్చులు అధికం. ఆదిత్య హృదయం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

విద్యార్థుల నైపుణ్యానికి తగిన గుర్తింపు లభిస్తుంది. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహం, వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు చిక్కులు అధిగమిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు రావచ్చు. రాజకీయ వర్గాలకు అరుదైన అవకాశాలు. కళాకారులు, క్రీడాకారులకు అవార్డులు దక్కుతాయి. 11,12 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఇంటిలో శుభకార్యాలు. ప్రముఖుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు నూతన పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు హోదాలు మరింత పెరుగుతాయి. కళాకారులకు పురస్కారాలు, సన్మానాలు. సాంకేతిక నిపుణులు, రచయితలు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 7,8 తేదీల్లో ఖర్చులు. ఆస్తి వివాదాలు. గణేశాష్టకం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

దేవాలయాల సందర్శన పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు. బంధువులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. విలువైన సామగ్రి కొనుగోలు. వ్యాపారులు ఒడిదుడుకుల నుంచి బయటపడతారు. ఉద్యోగులకు శుభవార్తలు అందుతాయి.రాజకీయవేత్తలు, కళాకారులకు సామాన్యంగా ఉంటుంది. రచయితలు, మేధావులు తమ సత్తాను నిరూపించుకుంటారు. 9,10 తేదీల్లో వివాదాలు. అనుకోని ఖర్చులు. రాఘవేంద్ర స్తోత్రాలు పఠించండి.

# పదరసం-580

## ఆధారాలు

**అడ్డం**

1. ప్రారంభమే (3)
3. ఇంద్రుని ఏనుగు (4)
6. జానపద ఒక వాద్యం (2)
7. చెణుకు (3)
9. రథం, తేరు (3)
11. పని, అవసరం (2)
12. భూమి, ధరణి (2)
13. వేప (2)
14. దశరథుడి తండ్రి (3)
15. కుశలం (2)
17. వంతు, క్షీరం (2)
18. ధనుస్సు (2)
20. ప్రసంగికుడు (2)
21. కారాగృహం, బాధ (2)
22. సేవ, అర్చన (4)
25. మోదకం (3)
27. బాటసారి (4)
29. మేను, శరీరం (3)
30. సర్పం (2)

**నిలువు**

1. జాప్యం (3)
2. యుద్ధం,రణం (3)
3. సంపద (3)
4. గద్యము, మాట (4)
5. కార్యక్రమం, ఉత్సవం (2)
8. సాక్ష్యం, నిదర్శనం (3)
10. రాక్షసులు (4)
11. కాలాన్ని వెళ్లబుచ్చడం (4)
14. ప్రమాదం, ముప్పు (3)
16. వనిత,సాహిత్య ప్రక్రియ...కింది నుంచి (3)
18. వేగు, గూఢచారి (4)
19. ఈ బాయి కృష్ణభక్తురాలు (2)
22. ముదముతో ఒక తైలం (4)
23. దేవవైద్యుడు (4)
24. రథాన్ని అధిరోహించినవాడు (2)
26. ప్రదేశాలు,చోట్లు (3)
27. లేత, తమిళ ఆకలి (2)
28. పోగు, రాశి (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | | 4 | 5 | |
| | | 6 | | | | | 7 | | 8 |
| 9 | 10 | | | 11 | | | | | |
| | | | 12 | | | 13 | | | |
| 14 | | | | 15 | | | | 16 | |
| 17 | | | 18 | | | 19 | | 20 | |
| | | 21 | | | 22 | | 23 | | |
| | 24 | | 25 | | | | | | 26 |
| 27 | | 28 | | | | | 29 | | |
| | | | | 30 | | | | | |

## పదరసం - 579 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 పె | రు | 2 గు | | 3 మా | 4 ని | 5 క | | 6 పి | 7 త |
| ద | | 8 హు | కుం | | 9 దా | సి | | 10 సి | మ |
| 11 వి | 12 భు | డు | | 13 గా | నం | | 14 పి | నా | కం |
| | వ | | 15 దా | ర | | 16 స్తో | ద | రి | |
| 17 జ | న | 18 ని | | డి | | 19 పా | ప | | 20 తి |
| | 21 వి | న్న | 22 పం | | 23 తా | నం | | 24 వ | న్నె |
| 25 పూ | జ | | కం | | ళి | | 26 వా | డి | |
| | యం | | | 27 కు | | 28 చ | లి | | 29 ఆ |
| 30 న | | 31 ప | 32 రి | జ | 33 న | ము | | 34 చే | వ |
| 35 గ | మ | ని | క | | 36 వ | రు | డు | | డ |

సినిమా



# 'ఇరుముడి'కి ఊహాకందని విజయం!

**కొన్నేళ్లుగా సీనియర్ హీరో రవితేజ పరాజయాల తోనే ప్రయాణం చేస్తున్నారు. ఈ యేడాది సంక్రాంతికి వచ్చిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సైతం విజయాన్ని పొందకపోవడంతో తన పంథాను మార్చి భక్తి మార్గాన్ని ఎంచుకుని 'ఇరుముడి'ని నెత్తిన పెట్టుకున్నారు. ఇంత కాలంగా ఆయనతో దోబూచులాడిన విజయలక్ష్మి ఇప్పుడీ సినిమాతో ఆయన్ని వరించడమే కాదు... కొత్త రికార్డులను సృష్టించింది.**

రవితేజ సోలో హీరోగా విజయాన్ని అందుకుని దాదాపు నాలుగేళ్లు దాటింది. 2022లో వచ్చిన 'ధమాకా' ఆయన చివరి హిట్ మూవీ. ఆ తర్వాత సంవత్సరమే సంక్రాంతి కానుకగా వచ్చిన చిరంజీవి చిత్రం 'వాల్తేరు వీరయ్య'లో రవితేజ ఓ ప్రత్యేక పాత్ర పోషించారు. ఆ సినిమా కూడా ఘన విజయాన్ని అందుకుంది. అప్పటి నుంచి విడులైన ఆరు సినిమాలూ బాక్సాఫీస్ బరిలో బోల్తా కొట్టాయి. ఆయనతో 'అమర్ అక్బర్ ఆంటోనీ', 'వాల్తేరు వీరయ్య' సినిమాలు నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ క్లిష్ట సమయంలో 'ఇరుముడి' నిర్మించడానికి సాహసించింది. ఈ సంస్థకూ ఈ మధ్య వరుస పరాజయాలే ఎదురయ్యాయి. అలానే 'ఇరుముడి' దర్శకుడు శివ నిర్వాణ సైతం దీనికి ముందు 'టక్ జగదీశ్, ఖుషీ' సినిమాలతో పరాజయాన్నే అందుకున్నారు. దాంతో 'ఇరుముడి' విజయం ఈ ముగ్గురికీ ఎంతో ప్రత్యేకమైందిగా మారింది.

'ఇరుముడి' సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ రాగానే ఇది మలయాళ చిత్రం 'మాలికాపురం'నకు రీమేక్ కాదు కదా! అని చాలా మంది సందేహం వెలిబుచ్చారు. అయితే ఆ మలయాళ చిత్రం తెలుగు లోనూ విడుదల కావడంతో మరోసారి అదే సినిమాను ఎందుకు రీమేక్ చేస్తారులే అని సమాధాన పడ్డారు.

ఇంతకూ కథేంటంటే... ఉత్తరాంధ్రలోని ఓ గ్రామంలోని ట్రక్ డ్రైవర్ త్రినాథ్ పెద్ద తాగుబోతు. కేవలం అయ్యప్పమాల వేసుకున్న 41 రోజులు మాత్రమే అతను మద్యానికి దూరంగా ఉంటాడు. మిగిలిన సమయాల్లో కయ్యానికి కాలు దువ్వుతుంటాడు. అతనికి పన్నెండేళ్ల కూతురంటే ప్రాణం. గ్రామంలోని ప్రతి ఆడపిల్లనూ తన కూతురులానే భావిస్తాడు. వాళ్లకు ఏ సమస్య వచ్చినా ప్రాణాలకు తెగించి, పరిష్కరిస్తాడు. అలాంటి త్రినాథ్.. తండ్రిగా భావించే గురుస్వామి కూతురుకు ఎదురైన సమస్యను ఎలా ఎదుర్కొన్నాడు? ఆ క్రమంలో అతను కోల్పోయిందేమిటి? త్రినాథ్ కూతురు తప్పనిసరి పరిస్థితుల్లో చదువు కోసం పట్టణంలో హైస్కూల్‌కు పంపినప్పుడు ఆమె ఎలాంటి చేదు అనుభవాలను ఎదుర్కొంది? దానికి కారకులైన వారికి త్రినాథ్ ఎలా బుద్ధి చెప్పాడు? అనేదే చిత్రం కథ.

ఇది భక్తిరస ప్రధాన చిత్రం కాదని, కాకపోతే తాను రాసుకున్న కథకు డివోషనల్ టచ్ ఇచ్చానని దర్శకుడు శివ నిర్వాణ విడుదలకు ముందే చెప్పారు. కథానాయకుడు అయ్యప్ప భక్తుడు కావడంతో, అతను మాల ఎప్పుడు వేస్తాడా? అతనిపై ఎప్పుడెప్పుడు పగ తీర్చుకుందామా? అని ప్రత్యర్థి వర్గాలు ఎదురు చూస్తుంటాయి. పైగా హీరో ఊరిలో ఎవరికి ఏ కష్టం వచ్చిన ముందుండేవాడు కావడంతో... ఇది డివోషనల్, యాక్షన్ మిక్సిడ్ థ్రిల్లర్ మూవీగా మారి పోయింది. అయ్యప్పస్వామికి సంబంధించిన పాటలు ఇందులో మూడున్నాయి. అందులోని 'మల్లెపూల పల్లకి' సాంగ్ అయ్యప్ప భక్తులకు పూనకాలు తెప్పించేలా ఉంది. మరో రెండు పాటలూ సందర్భానుసారంగా సాగాయి. రవితేజ కెరీర్‌లో ఇప్పటి వరకూ ఇలాంటి సినిమా చేయలేదు. దాంతో ఆయన అభిమానులే కాదు సగటు సినిమా ప్రేక్షకులు సైతం 'ఇరుముడి'ని ఆదరిస్తున్నారు. అలానే ఆడపిల్లల తల్లిదండ్రులు సైతం ఈ సినిమాను బాగా ఇష్టపడుతున్నారు. ఫలితంగా థియేటర్లకు కుటుంబాలు తరలి వస్తున్నాయి. అలా ఈ సినిమా రెండు రోజుల్లో బ్రేక్ ఈవెన్ కావడమే కాదు... ఐదారు రోజులకే వంద కోట్ల క్లబ్ లో చేరిపోయింది.

'ఇరుముడి' సినిమాలో లోపాలు లేవని కాదు. ముఖ్యంగా గురుస్వామి విషయంలో దర్శకుడు ఇచ్చిన ట్విస్ట్ పూర్తిగా బేస్‌లెస్‌గా ఉంది. ఆ పాత్రను మొదటి నుంచి తీర్చిదిద్దిన తీరు ఏ రకంగానూ అంగీకార యోగ్యంగా అనిపించదు. ప్రభుత్వ పాఠశాలటీచర్‌ను నెగెటివ్‌గా చూపించడంతో ఆ సన్నివేశాలను తొలగించాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. అలా చేస్తే సినిమానే ఉండదు. మన చిత్రాలలో పోలీస్, రాజకీయనేతలు,జర్నలిస్ట్, ఇండస్ట్రీయలిస్ట్... ఇలా చాలామందిని ప్రతినాయకులుగా చూపిస్తుంటారు. కాబట్టి ఒక వర్గాన్ని ప్రత్యేకంగా టార్గెట్ చేసి ఈ సినిమా తీశారని అనుకోకూడదు. ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడే వారు కూడా ఉంటారనే జాగరుకతతో వ్యవహరించాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు ఆడపిల్లలతో మనసువిప్పి మాట్లాడాలని, వారిని నిర్భీతులుగా తీర్చిదిద్దాలనే సందేశాన్ని ఈ సినిమా ద్వారా చెప్పారు. కథ, కథనాలలో కొన్ని లోటు పాట్లు ఉన్నా... మొత్తంగా చూసినప్పుడు సినిమా సగటు ప్రేక్షకుడిని మెప్పిస్తుంది. ముఖ్యంగా పతాక సన్నివేశం కళ్లు చెమర్చేలా చేస్తుంది. కూతురు కోరిక మేరకు తాగుడు వ్యసనాన్ని వదిలేసి, పూర్తి స్థాయిలో భక్తిమార్గంలోకి కథానాయకుడు అడుగుపెట్టినట్టు చూపించడం బాగుంది.

రవితేజ, ప్రియభవానీ శంకర్, వారి కుమార్తెగా నటించిన బేబీ నక్షత్ర బాగా చేశారు. అలానే గురుస్వామి పాత్రలో సాయికుమార్ ఒదిగిపోయారు. ఇతర ప్రధానపాత్రలను అజయ్ ఘోష్, జబర్దస్త్ కొమరం, రమేశ్ ఇందిరా, శ్వాసిక, మీసాల లక్ష్మణ్, సామ్, రాజ్ కుమార్ కసిరెడ్డి తదితరులు పోషించారు. జీవీ ప్రకాశ్ సమకూర్చిన బాణీలు, నేపథ్య సంగీతం; విష్ణుశర్మ సినిమాటోగ్రఫీ మూవీని నిలబెట్టాయి.

అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతున్న 'ఇరుముడి'ని కన్నడ అనువాద చిత్రం 'టాక్సిక్' కోసం థియేటర్ల నుంచి తొలగించడం చాలామందికి ఆగ్రహాన్ని తెప్పించింది. అయితే భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకున్న 'టాక్సిక్'కు ఫ్లాప్ టాక్ రావడంతో చాలా సెంటర్స్‌లో మొదటి రోజునే తిరిగి 'ఇరుముడి' చిత్రాన్ని ప్రదర్శించడం మొదలు పెట్టారు. కొన్ని సినిమాల విజయానికి కథో, నటీనటులు, సాంకేతిక నిపుణుల ప్రతిభనో కారణం అని చెప్పలేం. ఒక్కోసారి ఊహించిన మ్యాజిక్ జరిగి పోతుంటుంది. 'ఇరుముడి' విషయంలోనూ అదే జరిగింది!

**– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్**











# 'నమస్తే సదా వత్సలే' కార్యక్రమంలో ప్రముఖుల సందేశాలు

**ఇంద్రసేనారెడ్డి, త్రిపుర గవర్నర్**

నేను **1962**లో కబడ్డి ఆడుతుంటే రోడ్డుమీద ఎందుకు ఆడతావు. శంకర్‌మఠ్ దగ్గర బాగా ఆడిస్తారు. అంటే దాని వెనక ఉన్న పొలాల్లో ఆడడానికి వెళ్లాను. అక్కడికి వెళ్లాక ఆడించడం, చివర్లో ప్రార్థన చేయించేవారు. ఆ రోజుల్లో అక్కడ ప్రారంభం అయిన ఆ అలవాటు ఈ రోజు నన్ను ఇక్కడి దాకా తీసుకొచ్చింది.

---

**బండారు దత్తాత్రేయ, హరియాణా మాజీ గవర్నర్**

సామాన్య ప్రజలకు కూడా సంఘం అంటే ఏమిటని అర్థం చేసేటటువంటి సంఘ ప్రార్థన అధునాతన రూపంలో చాలా అద్భుతంగా ఉంది. మామూలుగా ఉన్నప్పుడు లేని శ్రద్ధ ప్రార్థనలో నాకు ఉండేది. అది నాకు నిత్యకృత్యమైంది.

---

**విద్యాసాగర్‌రావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్**

నేను, ఇంద్రసేనారెడ్డిగారు ఇంకొంతమంది మిత్రులు యూనివర్సిటీలో ఉన్నప్పుడు ప్రార్థన అర్థం గురించి చర్చ జరిగేది. ఎప్పుడూ, ప్రతిరోజు కొన్ని లక్షలమంది భారత్‌లోనే కాకుండా ప్రపంచంలో చాలా చోట్ల పాడుతుంటారు. దీని గురించి తెలియనివాళ్లు కూడా ఇది విన్నప్పుడు ఆగి వినే శక్తి ప్రార్థనకు ఉంది.

---

**సాయికుమార్, సినీ నటుడు**

అమ్మ నన్ను ఎప్పుడూ దేశం నీకేమి చేసిందని కాదు, నువ్వు దేశానికేమి చేశావు అని ఆలోచించమంటు, సినిమాలో కూడా ఏదో ఒక సందేశం ఇవ్వడానికే ప్రయత్నించమనేది. సంఘం వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రార్థన గీతానికి నేను స్వరార్చన చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

---

**అభిజిత్ గోఖలే, సంస్కారభారతి అఖిల భారతీయ సంఘటన మంత్రి**

సంఘ ప్రార్థనకు సంబంధించి ఏం చేయాలి అనుకుంటున్నారో నాకు చెప్పి అనుమతి తీసుకుందామని వచ్చారు. సంఘం ఏం నమ్ముతుంది అంటే ఇది సంఘ ప్రార్థన కాదు, ఎవరైతే తమని తాము భారతమాత పుత్రులమని భావిస్తారో వాళ్లందరూ ఇది పాడవచ్చు అన్నాను.

---

**భరత్‌కుమార్, దక్షిణమధ్య క్షేత్ర ప్రచారక్**

ఎప్పుడైతే కళ్లుమూసుకుంటే దైవం, కళ్లు తెరిస్తే దేశమని దేశంలో ఉన్న **140** కోట్లమందికి భావన కలుగుతుందో అప్పుడు ఈ దేశం వైభవ స్థితికి వెళ్తుంది.

---

**రాహుల్ రానడే, అఖిల భారత ప్రార్థన సంకల్ప ప్రముఖ్, సంగీతజ్ఞులు**

నన్ను ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థన విన్నావా అని అడిగినప్పుడు నమస్తే సదా వత్సలే మాతృభూమి అని మాత్రమే విన్నాను. దాని తర్వాత నాకు తెలియదు అన్నప్పుడు మళ్లీ వినుమన్నారు. ఎందుకంటే దాని అర్థం చాలా లోతైనది అన్నారు. దీని అర్థం అన్ని భాషల్లోకి అనువదించాలన్నారు. అలా ఈ ప్రాజెక్టు ఆరంభమయ్యింది.

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 47


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు















| | | | | |
|---|---|---|---|---|
| వెల : ₹.150/- | వెల : ₹.60/- | వెల : ₹.270/- | వెల : ₹.120/- | వెల : ₹.150/- |
















| | | | | |
|---|---|---|---|---|
| వెల : ₹.180 | వెల : ₹.190 | వెల : ₹.250/- | వెల : ₹.60/- | వెల : ₹.200/- |
















| | | | | |
|---|---|---|---|---|
| వెల:₹.999/- సెట్ | వెల:₹.450/- | వెల :₹.200/- | వెల : ₹.900/- | వెల : ₹.350/- |

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687